ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 26.01.2026 | సంపుటి :12 సంచిక : 187 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# మహిళలకు అగ్రతాంబూలం

## అన్ని రంగాల్లో అతివలదే పైచేయి

- రాజ్యాంగమే జాతీయ స్ఫూర్తి, దేశ ఐక్యతకు పునాది
- రిపబ్లిక్ డే సందర్భంగా జాతినుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగ నిబంధనల ద్వారా జాతీయ స్ఫూర్తికి, దేశ ఐక్యతకు బలమైన పునాదిని వేశారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తెలిపారు. దేశ ప్రజలమైన మనం స్వదేశంలో, విదేశాల్లో గణతంత్ర దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకోబోతున్నామని స్పష్టం చేశారు. సోమవారం దేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోనున్న నేపథ్యంలో ద్రౌపదీ ముర్ము ఆదివారం జాతినుద్దేశించి ప్రసంగించారు.భారతీయ మహిళలు సంప్రదాయ మూస పద్ధతులను బద్దలు కొట్టి ముందుకు సాగుతున్నారని ద్రౌపదీ ముర్ము కొనియాడారు. నారీమణులు దేశ సర్వతోముఖాభివృద్ధికి చురుకుగా తోడ్పడుతున్నారని వెల్లడించారు. వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు, స్వయం ఉపాధి నుంచి సాయుధ దళాల వరకు ప్రతి రంగంలోనూ మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారని తెలిపారు. క్రీడా రంగంలోనూ టీమ్ ఇండియా ఒమెన్ క్రికెటర్లు ప్రపంచవ్యాప్తంగా కొత్త ప్రమాణాలను నెలకొల్పారని గుర్తు చేసుకున్నారు."గతేడాది నవంబర్‌లో టీమ్ ఇండియా మహిళా క్రికెటర్లు ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్‌ను, ఆ తర్వాత బ్లైండ్ మహిళల టీ20 వరల్డ్‌కప్‌ను గెలుచుకుని క్రీడా చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించారు. గత సంవత్సరం

మిగతా 2లో..


## శుభాంశు శుక్లాకు అశోక చక్ర



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత వ్యోమగామి శుభాంశు శుక్లాకు భారత సైనిక పురస్కారం అశోక చక్రను ప్రకటించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ నెల 26న ఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకల్లో ఈ అవార్డు ప్రదానం చేయనున్నట్లు జాతీయ మీడియా పేర్కొంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి వెళ్లిన తొలి భారతీయ వ్యోమగామిగా శుభాంశు శుక్లా రికార్డు

మిగతా 2లో..

# పద్మ అవార్డులను ప్రకటించిన కేంద్రం





## ధర్మేంద్రకు పద్మ విభూషణ్..

- శిబూ సోరెన్, మమ్ముట్టిల పద్మభూషణ్..
- నటులు మురళీమోహన్,రాజేంద్రప్రసాద్‌లకు పద్మశ్రీ

### పద్మ అవార్డుల ప్రకటన
### తెలంగాణకు 7.. ఆంధ్రాకు 4 పద్మశ్రీలు..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించింది. కళలు, సామాజిక సేవ, ప్రజా సంబంధాలు, శాస్త్ర-సాంకేతికం, వాణిజ్యం-పరిశ్రమలు, వైద్యం, సాహిత్యం- విద్య, క్రీడలు, సివిల్ సర్వీస్ రంగాల నుంచి ఐదుగురికి పద్మ విభూషణ్, 13 మందికి పద్మ భూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. బాలీవుడ్‌కు విశేష సేవలందించిన సినీ నటుడు ధర్మేంద్రకు (కళలు) మరణానంతరం పద్మవిభూషణ్ ప్రకటించారు. కె.టి.థామస్ (సామాజిక సేవ), ఎన్.రాజన్ (కళలు), పి.నారాయణన్ (సాహిత్యం) వి.ఎస్. అచ్యుతానందన్ (మరణానంతరం) (సామాజిక సేవ)లకు కూడా పద్మ విభూషణ్ అవార్డులకు దక్కాయి. ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడుని పద్మ భూషణ్ వరించింది.

**పద్మభూషణ్‌లు వీరికే..**

అల్కా యాజ్ఞిక్ (కళలు)- మహారాష్ట్ర, భగత్‌సింగ్ కోశ్యారీ (ప్రజావ్యవహారాలు)- ఉత్తరాఖండ్, కల్లిపట్టి రామసామి పళనిస్వామి (వైద్యం)- తమిళనాడు, మమ్ముట్టి (కళలు)- కేరళ, నోరీ దత్తాత్రేయుడు (వైద్యం)- అమెరికా, పీయూష్ పాండే (మరణానంతరం) (కళలు)- మహారాష్ట్ర, ఎస్‌కేఎం మెయిలానందన్ (సామాజిక సేవ)- తమిళనాడు, శతావధాని ఆర్ గణేశ్ (కళలు)- కర్ణాటక, శిబూ సోరెన్ (మరణాంతరం) (ప్రజావ్యవహారాలు)- ఝార్ఖండ్, ఉదయ్ కొటక్ (వాణిజ్యం-పరిశ్రమలు)

మిగతా 2లో..



### తెలంగాణ నుంచి..

గూడూరు వెంకట్రావుకు పద్మశ్రీ
రామారెడ్డి మామిడి (మరణానంతరం) (పశుసంవర్ధక, పాడి పరిశ్రమ) పద్మశ్రీ
కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్(సైన్స్)కు పద్మశ్రీ
గడ్డమనుగు చంద్రమౌళి(సైన్స్ విభాగం)కి పద్మశ్రీ
దీపికారెడ్డి(నృత్యకారిణి)కి పద్మశ్రీ
పాలకొండ విజయ్‌ఆనంద్‌రెడ్డి(వైద్యం)కు పద్మశ్రీ
యూజీసీ మాజీ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్‌కు పద్మశ్రీ

### ఆంధ్రప్రదేశ్ నుంచి..

గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు పద్మశ్రీ
వెంపటి కుటుంబశాస్త్రి(సాహిత్యం)కి పద్మశ్రీ
సినీనటుడు గద్దె బాబూ రాజేంద్ర ప్రసాద్- కళలు
మాగంటి మురళీ మోహన్ - కళలు

# రెండ్రోజుల్లో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్

- అభివృద్ధి, సంక్షేమ పథకాలే కాంగ్రెస్ ఓటు బ్యాంకు
- బీఆర్ఎస్ పదేళ్లలో చేయని అభివృద్ధి.. రెండేళ్లలో చేసి చూపించాం
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్/జగిత్యాల(జనంసాక్షి):**వచ్చే శాసనసభ ఎన్నికల్లోనూ అధికారం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో నిజామాబాద్ కార్పొరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, అమలు జరుపుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మీద విశ్వసనీయతను పెంపొందించిందని ఆయన పేర్కొన్నారు.జరిగిన అభివృద్ధిని అమలుజరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విరివిగా తీసుకపోయేందుకు కాంగ్రెస్ పార్టీ లీడర్, క్యాడర్ కృషి చేసేందుకు ముందుకు

మిగతా 2లో..

## హెడ్ కానిస్టేబుల్ వెంకటరెడ్డికి గ్యాలంటరీ అవార్డు



**ప్రాణాలకు తెగించి 'మోస్ట్ వాంటెడ్'ను పట్టుకున్న తెగువకు కేంద్ర పురస్కారం**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఎదురుగా 125 కేసుల్లో నిందితుడైన కరడుగట్టిన నేరస్థుడు. అదును చూసి పోలీసులపైకి తుపాకీ ఎక్కుపెట్టాడు.. రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. తూటా దూసుకుపోయి కాలికి గాయమైనా, రక్తం వస్తున్నా గాయాన్ని పట్టించుకోకుండా ప్రాణాలకు

మిగతా 2లో..



## నుమాయిష్‌కు పోటెత్తిన సందర్శకులు

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న నుమాయిష్‌కు సందర్శకులు పోటెత్తారు. ఆదివారం కావడంతో కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రత్యేక లైన్లను ఏర్పాటు చేశారు



నాంపల్లి అగ్ని ప్రమాదం..

## బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

**హైదరాబాద్(జనంసాక్షి):** నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో అగ్ని ప్రమాద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరో వైపు భవన యజమాని సతీశ్ బచాస్‌ను అబిడ్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిన్న మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే.




అగ్నిప్రమాదంలో మృతులు

# బొగ్గు స్కాంలో సీఎంను కాపాడేందుకు భట్టి ప్రయత్నాలు

**సైట్ విజిట్ నిబంధన పెట్టిన అన్ని టెండర్లూ రద్దు చేయాలి**

**ఈ బాగోతాన్ని బయటపెట్టిన బీఆర్ఎస్‌పై బురద జల్లేందుకు కుట్ర:హరీశ్**

**హైదరాబాద్(జనంసాక్షి):** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన 40 ఏళ్ల అనుభవాన్ని ఉపయోగించి సీఎం రేవంత్‌ను బొగ్గు కుంభకోణం నుంచి బయటపడేసేందుకు యత్నించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఈ స్కామ్‌ను బయటపెట్టిన తమ పార్టీపై బురద జల్లుతున్నారన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ మాట్లాడారు."2025 మేలో సైట్ సర్టిఫికెట్ నిబంధన వచ్చింది. దీని తొలి లబ్ధిదారు సీఎం బంధువు, శోధా కన్‌స్ట్రక్షన్ యజమాని సృజన్‌రెడ్డి. ఆ తర్వాత అన్ని టెండర్లకు సైట్ విజిట్ నిబంధన పెట్టారు. ప్రతి టెండర్‌కు ప్లస్ టెన్ పద్ధతి ఫాలో అయ్యారు. స్కామ్‌లు జరగలేదని నమ్మించేందుకు భట్టి విక్రమార్క ప్రయత్నిస్తున్నారు. నైనీ కోల్ బ్లాక్ ఒక్కటే కాదు.. పారదర్శకత, నిజాయతీ ఉంటే సైట్ విజిట్ నిబంధన పెట్టిన అన్ని టెండర్లూ రద్దు చేయాలి. 2025 మే నుంచి ఎన్ని టెండర్లు పిలిచారు.. ఎంతమందికి సర్టిఫికెట్ ఇచ్చారో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. తమకు సైట్ విజిట్ సర్టిఫికెట్లు ఇవ్వట్లేదని.. కావాల్సిన వారికే ఇచ్చారని జీసీసీ, మహాలక్ష్మి వంటి అనేక కంపెనీలు ఫిర్యాదు చేశాయి. నా వద్ద ఫొటోలు, వీడియోలు, మెయిల్స్ ఉన్నాయి. విచారణకు ఆదేశిస్తే ఆధారాలు ఇస్తా. సమయం వచ్చినప్పుడు అవన్నీ బయటపెడతా" అని అన్నారు.





## తప్పుడు ప్రచారం ఆపండి

- మీ మాటలను పట్టించుకునే పరిస్థితి లేదు
- తెలంగాణ ప్రజలు మళ్లీ మోసపోరు
- హరీశ్‌కు ఎమ్మెల్సీ దయాకర్ కౌంటర్

**హైదరాబాద్(జనంసాక్షి):**మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ దయాకర్ కౌంటర్ ఇచ్చారు. హరీష్‌రావు అతి తెలివితో మతి భ్రమించినట్లుగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమాలు చేస్తే బీఆర్ఎస్ నాయకులకు బొగ్గు టెండర్లు ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. నాలుగు జరిగితే మూడు మీకు దక్కాయన్నారు. నీ చుట్టాలు టెండర్లు వస్తే నీకు ముడుపులు ముట్టలేదని వ్యతిరేకిస్తున్నారా? అబద్ధాన్ని నిజం చేయడానికి బావ బామ్మర్దుల తాపత్రయం మామూలుగా లేదన్నారు. అందుకే

మిగతా 2లో..

## హెచ్-1బీ స్టాంపింగ్‌లో యూఎస్ జాప్యం

### ఇంటర్వ్యూలు 2027లోకి మార్పు



**వాషింగ్టన్(జనంసాక్షి):**భారతీయ వృత్తి నిపుణులకు అమెరికా ప్రయాణాల్లో మరింత జాప్యం చోటుచేసుకోనుంది. హెచ్-1బీ వీసాల స్టాంపింగ్ ఇంటర్వ్యూల అపాయింట్‌మెంట్లు 2027లోకి మారాయి. కొత్త ఇంటర్వ్యూల స్లాట్లకు కొరత ఏర్పడటంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో వేలాది మంది వృత్తి నిపుణులు భారత్‌లోనే చిక్కుకుపోయే పరిస్థితి నెలకొంది. మరికొందరి ఉద్యోగాలు ప్రమాదంలో పడే పరిస్థితి తలెత్తింది.భారత్‌లోని అమెరికా కాన్సులేట్లలో బ్యాక్‌లాగ్‌లు భారీగా పెరిగిపోయాయి. ఫలితంగా వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూలు 2027లోకి మారాయి. వాస్తవానికి డిసెంబర్ 2025లో వీటిల్లో తొలిసారి జాప్యం చోటుచేసుకొంది. నాడు ఇంటర్వ్యూలను మార్చి 2026కు మార్చాల్సివచ్చింది. ఆ తర్వాత ఆ తేదీలు అక్టోబర్‌కు.. ఇప్పుడు 2027కు మారినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. దిల్లీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా కేంద్రాల్లో కొత్త ఇంటర్వ్యూ స్లాట్లు లేవు. దీంతో ప్రస్తుతం ఉన్న అపాయింట్‌మెంట్లను అధికారులు 18 నెలలు తర్వాతకు మార్చాల్సి వచ్చింది. ఫలితంగా 2027 సంవత్సరం మధ్యలోకి అవి చేరాయి.దీంతో ఇమిగ్రేషన్ నిపుణులు ప్రస్తుతం అమెరికాలో ఉన్న వృత్తి నిపుణులు వీసా స్టాంపింగ్ కోసం తిరిగి భారత్‌కు వెళ్లవద్దని సూచిస్తున్నారు. హ్యూస్టన్‌కు చెందిన ఇమిగ్రేషన్ సంస్థ భాగస్వామి ఎమిలీ న్యూమన్ మాట్లాడుతూ.. తాము గత 50 రోజుల్లో భారత్ కోసం కొత్త వీసా ఇంటర్వ్యూల స్లాట్లు ఉన్నట్లు చూడలేదన్నారు. అదే సమయంలో అమెరికాలో ఉన్న వృత్తి నిపుణులు కూడా భారత్‌లో స్టాంపింగ్ ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ల

మిగతా 2లో..

## మాట మార్చిన ట్రంప్

యూకే దళాలను ప్రశంసిస్తూ పోస్టు

2లో..

## డిమాండ్లు అంగీకరించండి.. లేకుంటే చంపేస్తాం

- వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలికి అమెరికా దళాల హెచ్చరిక
- డెన్సీ రోడ్రిగ్జ్ సంచలన ఆడియో లీక్

## ఒంటరి పోరాటం చేస్తాం

- ఎన్నికల్లో జయభేరి మోగిస్తాం
- ఎవరికీ తలవంచం
- టీవీకే అధ్యక్షుడు విజయ్ ధీమా

**చెన్నై(జనంసాక్షి):**తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఒంటరిగానే విజయం సాధిస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ పేర్కొన్నారు. మరికొద్ది నెలల్లో జరిగేది ఎన్నికల పోరు కాదని.. ప్రజాస్వామ్య యుద్ధమన్నారు. మహాబలిపురంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం టీవీకే పార్టీకి 'విజిల్' గుర్తు కేటాయించిన సంగతి

మిగతా 9లో..

# బంకర్‌లోకి ఖమేనీ

**అమెరికా దాడి భయంతో అధికారుల అప్రమత్తం ● కుమారుడు మసూద్ ఖమేనీకి బాధ్యతల అప్పగింత**

**టెహ్రాన్(జనంసాక్షి):**అమెరికా దాడి చేస్తుందనే భయాలు ఇరాన్‌ను చుట్టుముట్టాయి. దీంతో దేశాధినేత రక్షణ కోసం అధికారులు చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని అధికారులు టెహ్రాన్‌లోని సురక్షితమైన బంకర్‌కు తరలించినట్లు సమాచారం.అమెరికా దాడి చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సీనియర్ మిలిటరీ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో అత్యంత సురక్షితమైన బంకర్‌లో ఖమేనీ ఆశ్రయం పొందుతున్నట్లు తెలుస్తోంది. దీన్ని టెహ్రాన్‌లోని పలు సొరంగాలకు అనుసంధానం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే సుప్రీం లీడర్ తన కార్యాలయ బాధ్యతలను చిన్న కుమారుడు మసూద్ ఖమేనీకి

మిగతా 2లో..





## మన ఉత్పత్తుల నాణ్యత అత్యుత్తమంగా ఉండాలి

- ప్రజాస్వామ్య ప్రక్రియల్లో యువత భాగం కావాలి
- భారత అభివృద్ధిలో వారే కీలకం: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఆంధ్రప్రదేశ్‌లోని కరవు ప్రాంతమైన అనంతపురంలో నీటి ఎద్దడి సమస్యను ఎదుర్కోవడానికి అక్కడి ప్రజలు చేపడుతున్న చర్యలను ప్రధాని మోదీ ప్రశంసించారు. అక్కడ వర్షపాతం సరిగా లేకపోవడం వల్ల స్థానికులు తీవ్ర నీటి కొరతను

మిగతా 2లో..

## మహిళలకు అగ్రతాంబూలం

చెస్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ ఇద్దరు భారతీయ మహిళల మధ్య జరిగింది. ఈ ఉదాహరణలు క్రీడా ప్రపంచంలో భారత్‌కు చెందిన నారీమణుల ఆధిపత్యానికి నిదర్శనం. దేశ ప్రజలు వారిని చూసి గర్విస్తున్నారు. పంచాయతీ రాజ్ సంస్థలలో మహిళా ప్రతినిధుల సంఖ్య దాదాపు 46 శాతంగా ఉంది. మహిళల రాజకీయ సాధికారతను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు 'నారీ శక్తి వందన్ అధినియం' మరింత బలాన్ని ఇస్తుంది. వికసిత భారత్ నిర్మాణంలో నారీ శక్తి పాత్ర కీలకమైనది" అని ముర్ము అన్నారు.

## బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

అగ్ని ప్రమాద ఘటన అత్యంత దురదృష్టకరమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఐదుగురు మరణించడం బాధాకరమన్నారు. ఫర్నిచర్ దుకాణం యజమాని నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు.అగ్ని ప్రమాదంపై హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా జీహెచ్‌ఎంసీ, పోలీస్, రెవెన్యూ, హైడ్రా అధికారులు సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని భవనాలు ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు.

ఐదు మృతదేహాల గుర్తింపు

నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఫర్నిచర్ దుకాణంలో జరిగిన అగ్నిప్రమాద ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. భవనం సెల్లార్‌లో ఐదు మృతదేహాలను సిబ్బంది గుర్తించి బయటకు తీశారు. చిన్నారులు ప్రణీత్, అఖిల్‌తో పాటు బీబీ, ఇంతియాజ్, హబీబ్ మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.నాంపల్లి స్టేషన్‌రోడ్డులోని హిందీ ప్రచార్‌సభ భవనం పక్కన సాయి విశ్వాస్ ఛాంబర్స్ ఐదంతస్తుల భవనంలో బచ్చాస్ ఫర్నిచర్ దుకాణం ఉంది. శుక్రవారం రాత్రి కంటైనర్‌లో చైనా నుంచి భారీగా ఫర్నిచర్ వచ్చింది. దాన్ని రెండు సెల్లార్లలో భద్రపరిచారు. దుకాణంలో సుమారు 22 మంది పనిచేస్తున్నారు. అక్కడ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న యాదయ్య, లక్ష్మి దంపతులు.. తమ ఇద్దరు పిల్లలు ప్రణీత్(11), అఖిల్(7)లతో కలిసి సెల్లార్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం పిల్లలిద్దరూ పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయారు. పిల్లల్ని సెల్లార్‌లోనే ఆడుకోవాలని చెప్పి తల్లిదండ్రులు పనిమీద బయటకు వెళ్లారు.మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో భవనంలోని రెండు సెల్లార్లలో అగ్నిప్రమాదం సంభవించింది. పొగలు రావడం గమనించి సిబ్బంది బయటకు పరుగులు తీశారు. దుకాణంలో పనిచేస్తున్న సుభాన్‌పుర నివాసి మహ్మద్ ఇంతియాజ్(27), శాస్త్రిపురం ప్రాంతానికి చెందిన సయ్యద్ హబీబ్(40)లు.. సెల్లార్లో చిక్కుకున్న ప్రణీత్, అఖిల్, బీబీ(55) అనే వృద్ధురాలిని బయటకు తీసుకువచ్చేందుకు లోపలికి వెళ్లి.. తిరిగి రాలేదు. దీంతో హైడ్రా, పోలీసు, ఫైర్ సహా 9 విభాగాల సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. పొగ దట్టంగా వ్యాపించడంతో రెస్క్యూ ఆపరేషన్‌కు ఆటంకంగా మారింది. ఆదివారం ఉదయం కూడా సహాయక చర్యలు కొనసాగాయి. ఫర్నిచర్ దుకాణం ఉన్న భవనం సెల్లార్‌కు జేసీబీతో రంధ్రం చేసి పనులు చేపట్టారు. రెస్క్యూ ఆపరేషన్‌ను గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి పరిశీలించారు.

## వాయుకాలుష్యం.. కోట్లాదిమందిపై భారం

**రాహుల్ గాంధీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):వాయు కాలుష్యం సమస్య కారణంగా ప్రజలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా చిన్నారులు, వయోవృద్ధుల పరిస్థితి దారుణంగా ఉందని చెప్పారు. ఈ సంక్షోభాన్ని విస్మరించకూడదని, మార్పు దిశగా మొదటి అడుగు మన గళాన్ని వినిపించడమేనని తెలిపారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు."వాయు కాలుష్యం కారణంగా ఆరోగ్యం, ఆర్థిక రూపంలో ప్రజలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. కోట్లాది మంది సామాన్య పౌరులు రోజూ ఈ భారాన్ని మోస్తున్నారు. ప్రజల జీవనోపాధి దెబ్బతింటోంది. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు, రోజువారీ కూలీలపై తీవ్ర ప్రభావం పడుతోంది" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. వాయు కాలుష్యం ఎలా ప్రభావితం చేసిందో ప్రజలు తమ అనుభవాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల గొంతుకను వినిపించడం తన కర్తవ్యమని చెప్పారు. దిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. దేశ రాజధానికి ఊపిరి పోయడానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఇందులో భాగంగా కేంద్రంతో పాటు దిల్లీ ప్రభుత్వానికి స్పష్టమైన గడువు విధించింది. వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) సూచించిన సిఫార్సులను ఎలా అమలు చేస్తారో చెబుతూ.. రాబోయే 4 వారాల్లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది.

## నీటిగుంతలో పడి ముగ్గురు చిన్నారులు మృతి

**ఊర్కొండ(జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లెలో ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో ఆడుకొనేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటి కుంటలో పడి ప్రాణాలు విడిచారు. దీంతో స్థానికంగా విషాదఛాయలు నెలకొన్నాయి. మృతి చెందినవారిని మధు సిరి(14), స్నేహ, శ్రీమన్య (11)గా గుర్తించారు. ఊర్కొండ ఎస్ఐ ఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పద్మ అవార్డులను ప్రకటించిన కేంద్రం

మహారాష్ట్ర, వీకే మల్హోత్రా (మరణాంతరం) (ప్రజావ్యవహారాలు)- దిల్లీ, వెల్లప్పల్లి నటేశన్ (ప్రజావ్యవహారాలు)- కేరళ, విజయ్ అమృత్‌రాజ్ (క్రీడలు)- అమెరికా,

**పద్మశ్రీలు వీరే...**

ఏఈ మృత్యుంజయం – సైన్స్ ఉ ఇంజినీరింగ్ – కేరళ, అనిల్ కుమార్ రస్తోగి – ఆర్ట్ – ఉత్తర్ ప్రదేశ్, అంకె గౌడ. ఎం – సోషల్ వర్క్ – కర్ణాటక, అర్మిండ ఫెర్నాండేజ్ – మెడిసిన్ – మహారాష్ట్ర, అర్వింద్ వైద్య – ఆర్ట్ – గుజరాత్, అశోక్ ఖడే – వాణిజ్యం – మహారాష్ట్ర, అశోక్ కుమార్ సింగ్ – సైన్స్ ఉ ఇంజినీరింగ్ – ఉత్తర్‌ప్రదేశ్, అశోక్ కుమార్ హల్దార్ – లిటరేచర్ ఉ విద్య – పశ్చిమ బెంగాల్, బల్‌దేవ్ సింగ్ – క్రీడలు – పంజాబ్, భరత్ సింగ్ భర్తీ – కళలు – బిహార్, భిక్ల్యా లడక్య దిండా – కళలు – మహారాష్ట్ర, బిశ్వ బంధు (మరణానంతరం) – సామాజిక సేవ – జమ్ము కశ్మీర్, బుద్ధ రష్మీ మణి – ఆర్కియాలజీ – ఉత్తర్‌ప్రదేశ్, బుద్రి తాటి – సామాజిక సేవ – చత్తీస్‌గఢ్, చంద్రమౌళి గడ్డమణుగు – సైన్స్ ఇంజినీరింగ్ – తెలంగాణ, చరణ్ హెంబ్రామ్ – లిటరేచర్ ఉ ఎడ్యుకేషన్ – ఒడిశా, చిరంజి లాల్ యాదవ్ – కళలు – ఉత్తర్ ప్రదేశ్, దీపికా రెడ్డి – కళలు – తెలంగాణ

ధార్మిక్‌లాల్ చునియాలాల్ పాండ్యా – కళలు – గుజరాత్, గద్దె బాబూ రాజేంద్ర ప్రసాద్ – కళలు – ఆంధ్రప్రదేశ్, గఫ్రుద్దీన్ మేవాటి జోగి – కళలు – రాజస్థాన్, గంభీర్ సింగ్ యోన్‌జోన్ – లిటరేచర్ ఉ ఎడ్యుకేషన్ – పశ్చిమ బెంగాల్, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం) – కళలు – ఆంధ్రప్రదేశ్, గాయత్రీ బాలసుబ్రమణియన్, రజనీ బాలసుబ్రమణియన్ – కళలు – తమిళనాడు, గోపాల్ జీ త్రివేదీ – సైన్స్ అండ్ ఇంజినీరింగ్ – బిహార్, గూడూరు వెంకట్ రావు – మెడిసిన్ – తెలంగాణ, హెచ్ వి హండే – మెడిసిన్ – తమిళనాడు, హాలీ వార్ – సామాజిక సేవ – మేఘాలయ, హరి మాధవ్ ముఖోపాధ్యాయ (మరణానంతరం) – కళలు – పశ్చిమ బెంగాల్, హరిచరణ్ సైకియా – కళలు – అస్సాం, హర్మన్ ప్రీత్ కౌర్ – క్రీడలు – పంజాబ్, ఇంద్రజిత్ సింగ్ సిద్ధు – సామాజిక సేవ – మహారాష్ట్ర, జోగేశ్ దేవురి – వ్యవసాయం – అస్సాం, జుజెర్ వాసి – సైన్స్ ఉ ఇంజినీరింగ్ – మహారాష్ట్ర, జ్యోతిష్ దేబనాథ్ – కళలు – పశ్చిమ బెంగాల్, కె. పజనివేల్ – క్రీడలు – పుదుచ్చెరి, కె. రామస్వామి – సైన్స్ అండ్ ఇంజినీరింగ్ – తమిళనాడు, కె.విజయ్ కుమార్ – సివిల్ సర్వీస్ – తమిళనాడు, కబీంద్ర పురకాయస్త – ప్రజా సేవ – అస్సాం, కైలాస్ చంద్ర పంత్ – లిటరేటర్ అండ్ ఎడ్యుకేషన్ – మధ్యప్రదేశ్, కలమండలం విమలా మేనన్ – కళలు – కేరళ, కెవాల్ కృషన్ తక్రాల్ – మెడిసిన్ – ఉత్తర్ ప్రదేశ్, ఖెమ్ రామ్ సుంద్రియాల్ – కళలు – హరియానా, కొలక్కల్ దేవకీ అమ్మ – సామాజిక సేవ – కేరళ, కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్ – సైన్స్ అండ్ ఇంజినీరింగ్ – తెలంగాణ, కుమార్ బోస్ – కళలు – పశ్చిమ బెంగాల్, కుమారస్వామి తంగరాజ్ – సైన్స్ అండ్ ఇంజినీరింగ్ – తెలంగాణ, లార్స్ క్రిస్టియన్ కొచ్ – కళలు – జర్మనీ, లియుద్మిలా విక్టోరోవ్నా ఖోఖ్లోవా – లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్ – రష్యా, మాధవన్ రంగనాథం – కళలు – మహారాష్ట్ర మాగంటి మురళీ మోహన్ – కళలు – ఆంధ్రప్రదేశ్, మహేందర్ కుమార్ మిశ్రా – లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్ – ఒడిశా, మహేంద్ర నాథ్ రాయ్ – లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్ – పశ్చిమ బెంగాల్, మామిడాల జగదీశ్ కుమార్ – లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్ – దిల్లీ, మంగళ కపూర్ – లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్ – ఉత్తర్ ప్రదేశ్, మిర్ హాజీభాయ్ కసమ్‌భాయి – కళలు – గుజరాత్, మోహన్ నాగర్ – సామాజిక సేవ – మధ్యప్రదేశ్, నారాయణ్ వ్యాస్ – ఆర్కియాలజీ – మధ్యప్రదేశ్, నరేశ్ చంద్ర దేవ్ వర్మ – లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్ – త్రిపుర, నీలేశ్ వినోద్‌చంద్ర మండ్లేవాలా – సోషల్ వర్క్ – గుజరాత్, నురుద్దీన్ అహ్మద్ – కళలు – అస్సాం, ఒత్తువర్ తిరుత్తణి స్వామినాథన్ – కళలు – తమిళనాడు

పద్మ గుర్మీత్ – మెడిసిన్ – లద్దాఖ్, పాలకొండ విజయ్ ఆనంద్ రెడ్డి – మెడిసిన్ – తెలంగాణ, పోఖిల లెక్తెపి – కళలు – అస్సాం, ప్రభాకర్ బసవప్రభు కోరె – లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్ – కర్ణాటక, ప్రతీక్ శర్మ – మెడిసిన్ – యూఎస్ఎ, ప్రవీణ్ కుమార్ – క్రీడలు – ఉత్తర్ ప్రదేశ్, ప్రేమ్ లాల్ గౌతమ్ – సైన్స్ అండ్ ఇంజినీరింగ్ – హిమాచల్ ప్రదేశ్

పుణ్యమూర్తి నటేశన్ – మెడిసిన్ – తమిళనాడు, ఆర్.కృష్ణన్ (మరణానంతరం) – కళలు – తమిళనాడు, ఆర్‌వీఎస్ మణి – సివిల్ సర్వీస్ – దిల్లీ

## శుభాంశు శుక్లాకు అశోక చక్ర..!

సృష్టించిన నేపథ్యంలో భారత ప్రభుత్వం శుక్లాకు ఈ పురస్కారాన్ని ప్రకటించినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.గతేడాది నిర్వహించిన యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా విజయవంతంగా అంతరిక్ష యాత్ర పూర్తి చేసిన విషయం తెలిసిందే. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ-విస్నియెస్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ)లతో కలిసి ఐఎస్ఎస్‌కు వెళ్లిన శుభాంశు.. అంతరిక్షంలో అనేక ప్రయోగాలు చేశారు. ఖగోళంలోని జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై అధ్యయనం చేశారు. ఖగోళంలో మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక వీడియోను చిత్రీకరించారు. అంతరిక్షంలో వ్యోమగాముల మానసిక ఆరోగ్యంపై సైతం అధ్యయనం చేశారు.

## బంకర్‌లోకి ఇరాన్ సుప్రీం లీడర్..!

అప్పగించినట్లుగా మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో కార్యనిర్వాహక వర్గంతో సమన్వయ పనులు కూడా ఆయనే చూడనున్నట్లు తెలిపాయి. అయితే, ఈ వార్తలపై ఇరాన్ అధికారుల నుంచి ఎలాంటి ప్రకటన లేదు. ఇరాన్‌లో పరిపాలనకు వ్యతిరేకంగా భారీ నిరసనలు చలరేగాయి. ఈ క్రమంలో జరిగిన ఘర్షణల్లో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనకారులకు హాని కలిగితే రంగంలోకి దిగుతామని హెచ్చరించారు. ఆ దేశంపై సైనిక చర్యకు కూడా సిద్ధమవగా.. చివరి నిమిషంలో రద్దు చేసుకున్నారు. అయితే, ఇటీవల భారీ సంఖ్యలో తమ యుద్ధ నౌకలు ఇరాన్‌వైపు కదులుతున్నాయని ఆయన ప్రకటించడం భయాందోళనకు దారి తీసింది.

## మన ఉత్పత్తుల నాణ్యత అత్యుత్తమంగా ఉండాలి

ఎదుర్కొంటారని మోదీ అన్నారు. ఆ సమస్యను పరిష్కరించడానికి అక్కడి ప్రజలు స్వయంగా జలాశయాలను పునరుద్ధరించడానికి ముందుకు వచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో ఇప్పటి వరకు 10కి పైగా జలాశయాలను పునరుద్ధరించారని.. 7 వేలకు పైగా చెట్లను నాటారని పేర్కొన్నారు. ఆదివారం మన్‌కీ బాత్ 130వ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ప్రస్తావించారు.భారతీయ పరిశ్రమలు, స్టార్టప్‌లు తమ వస్తువుల తయారీలో నాణ్యతపై దృష్టి సారించాలని ప్రధాని పేర్కొన్నారు. నాణ్యతను ఒక బెంచ్‌మార్క్‌లా చేసేందుకు సంకల్పించాలని పిలుపునిచ్చారు. భారతీయ ఉత్పత్తులు టాప్ క్వాలిటీకి పర్యాయపదంగా మారాలని సూచించారు. లోపాలు లేని వస్తువులను తయారు చేయాలని పరిశ్రమలను కోరారు. వస్త్రాలు, టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ప్యాకేజింగ్.. ఇలా మనం తయారు చేసే ఏ వస్తువైనా ఉత్తమంగా ఉండేలా చూడాలన్నారు. యువతకు అన్ని రంగాల్లో ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ప్రపంచ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటోందన్నారు. భారత్‌లో పెద్ద సంఖ్యలో స్టార్టప్‌లతో లక్షలమంది యువతకు ఉద్యోగావకాశాలు వస్తున్నాయన్నారు.మన కుటుంబ వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శమని ప్రధాని పేర్కొన్నారు. మన కుటుంబ వ్యవస్థలను విదేశీయులు గౌరవిస్తారన్నారు. ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి భారత్‌ను ఆదర్శంగా తీసుకొని యూఏఈ ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటున్నట్లు ఆ దేశాధ్యక్షుడు పేర్కొన్నట్లు ప్రధాని వెల్లడించారు. 2026 సంవత్సరాన్ని యూఏఈ 'కుటుంబ సంవత్సరం'గా నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ తనకు చెప్పారన్నారు.

ప్రజాస్వామ్య ప్రక్రియల్లో యువత భాగం కావాలి

దేశంలో నిర్వహించే అన్ని ప్రజాస్వామ్య ప్రక్రియల్లో యువత భాగం కావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.

## హెడ్ కానిస్టేబుల్ వెంకటరెడ్డికి గ్యాలంటరీ అవార్డు

తెగించి ఆ నిందితుడిని హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి పట్టుకోగలిగారు. గచ్చిబౌలిలోని ప్రిజం పబ్ వద్దజరిగిన ఈ ఉత్కంఠభరిత పోరులో మోస్ట్ వాంటెడ్ ప్రభాకర్ అలియాస్ రాహుల్ రెడ్డి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు.నానక్‌రామ్‌గూడకు చెందిన ప్రభాకర్ (30) సాదాసీదా నేరస్థుడు కాదు. ఇతనిపై తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 125కు పైగా కేసులు ఉన్నాయి. 2022లో విశాఖ సెంట్రల్ జైలు ఎస్కార్ట్ నుంచి తప్పించుకుని అప్పటి నుంచి పోలీసుల నుండి తప్పించుకు తిరుగుతున్నాడు. గౌలిదొడ్డిలోని 'ప్రిజం పబ్'కు ప్రభాకర్ వస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మర్రి వెంకటరెడ్డికి పక్కా సమాచారం అందింది.వెంటనే అప్రమత్తమైన వెంకటరెడ్డి, తన సహచర సిబ్బంది ప్రదీప్ రెడ్డి , వీరాస్వామి లతో కలిసి పబ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నిందితు డిని గుర్తించి, లొంగిపోవాలని ఆదేశించారు. కాల్పులతో విరుచుకుపడ్డ నిందితుడుపోలీసులను చూడగానే కంగుతిన్న ప్రభాకర్, తప్పించు కోవాలనే ఉద్దేశంతో తన వద్ద ఉన్న తుపాకీ తీసి పోలీసుల వైపు గురిపెట్టి రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఈ క్రమంలో ఒక తూటా వెంకటరెడ్డి ఎడమ కాలి బొటనవేలికి తగిలి రక్తస్రావమైంది. అయినప్పటికీ వెనకడుగు వేయకుండా, తన గాయాన్ని లెక్కచేయకుండా వెంకటరెడ్డి ఇతర కానిస్టేబుళ్లతో కలిసి నిందితుడిపైకి దూకి అతడిని కట్టడి చేశారు. ప్రాణాలకు తెగించి నిందితుడిని పట్టుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది.సాహసానికి గుర్తింపు గ్యాలంటరీ అవార్డుగత 20 ఏళ్లుగా పోలీస్ శాఖలో అంకితభావంతో పని చేస్తున్న మర్రి వెంకటరెడ్డి, గతంలోనూ పలువురు భయంకరమైన నేరస్థులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించారు. గచ్చిబౌలి పిఎస్ పరిధిలో నమోదైన ఉదంతంలో ఆయన చూపిన ధైర్యసాహసాలకు గుర్తింపుగా, 2026 రిపబ్లిక్ డే సందర్భంగా ఆయనను కేంద్ర ప్రభుత్వ 'మెడల్ ఫర్ గ్యాలంటరీ' అవార్డు దక్కింది. ప్రస్తుతం నిందితుడిపై హత్యాయత్నం, ఆర్మ్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హెచ్-1బీ స్టాంపింగ్‌లో యూఎస్ జాప్యం

కోసం ప్రయత్నించడంలేదని చెప్పారు. 2027 వరకు ఎటువంటి రెగ్యులర్ అపాయింట్‌మెంట్లు లేవని 'అమెరికన్ బజార్' వెల్లడించింది. ఇప్పటికే స్టాంపింగ్ కోసం భారత్‌కు వచ్చిన వారికి కూడా ఇంటర్వ్యూలు రద్దైనట్లు చెప్పారని తెలిపింది. జనవరి, ఫిబ్రవరిలో అపాయింట్‌మెంట్లు ఉన్న వారికి కూడా.. వాటిలో మార్పులు చేసి ఏడాది తర్వాత డేట్లను కేటాయిస్తూ ఈమెయిల్స్ వచ్చాయి. ఇప్పటికే వీసా స్టాంపింగ్ కోసం భారత్‌కు చేరుకొన్న వేలాది మంది వృత్తి నిపుణులు తిరిగి అమెరికా వెళ్లలేక ఇక్కడే చిక్కుకుపోయారు. వీరిలో కొందరి భార్యపిల్లలు అమెరికాలో ఉండగా.. తల్లిదండ్రులు భారత్‌లో ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంప్లాయిమెంట్ కాంట్రాక్టులు, హౌసింగ్ అగ్రిమెంట్లలో సమస్యలు తలెత్తుతున్నాయి. వీసా గడువు ముగిసిన చాలా మంది ఉద్యోగులకు .. వారి సంస్థల యజమానులు పొడిగింపులను కూడా ఇవ్వడంలేదు. దీనికి తోడు లక్ష డాలర్ల ఫీజు ఉండటంతో కొత్త హెచ్-1బీ వీసాల కోసం కంపెనీలు దరఖాస్తులు చేయడంలేదు. మరోవైపు ఈ సమస్యను మరింత జఠిలం చేసేలా అమెరికా విదేశాంగ శాఖ కొన్నాళ్ల క్రితం కీలక నిర్ణయం తీసుకొంది. దీని ప్రకారం భారతీయులు మరో దేశంలోని అమెరికా కాన్సులేట్లలో వీసా స్టాంపింగ్ చేయించుకునే అవకాశాన్ని నిలిపివేసింది. దీంతో భారతీయ కాన్సులేట్లలో అపాయింట్‌మెంట్లకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది.

## తప్పుడు ప్రచారం ఆపండి

మిమ్మల్ని బిర్లా-రంగా అనేదని, మీ మామనే నిన్ను పక్కన పెట్టారని, ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు పట్టించుకుంటారని అన్నారు.

# రెండ్రోజుల్లో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్

రావాలని ఆయన పిలుపునిచ్చారు.రానున్న పురపాలక సంఘం ఎన్నికల్లో సత్తా చాటాలని ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. పురపాలక సంఘం ఎన్నికల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు గాను లోకసభ నియోజకవర్గాల వారిగా మంత్రులను ఇంచార్జీలుగా నియమంచిన విషయం విదితమే.ఆ క్రమంలో భాగంగ నిజామాబాద్ లోకసభ నియోజకవర్గానికి రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డిని నియమించారు.ఈ సందర్భంగా ఆదివారం రోజున నిజామాబాద్ లోకసభ నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్ కార్పొరేషన్,బోధన్, ఆర్మూర్,భీంగల్,మెట్పల్లి,కోరుట్ల పురపాలక సంఘం పరిధీలలో నిర్వహించిన పార్టీ సమన్వయ సమావేశాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,ప్రభుత్వ సలహాదారులు బోధన్ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి,మరో ప్రభుత్వ సలహదారు యం.డి షబ్బీర్ అలీ నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు భూపతి రెడ్డి,శాసనమండలి సభ్యులు బల్మూరి వెంకట్,కార్పొరేషన్ ఛైర్మన్ అనిల్,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణ మాజీ శాసనమండలి సభ్యులు నర్సిరెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ పురపాలక సంఘం మీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు.పార్టీ నిర్వహిస్తున్న సర్వేల ఆధారంగా టికెట్లు ఖరారు చేస్తామని ఆయన ప్రకటించారు.సర్వేతో పాటువిధేయత,చిత్తశుద్ధి, క్రమశిక్షణ ల ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ఉంటుందని ఆయన తెలిపారు.అదే సమయంలో అవకాశం రాని వారికి ప్రత్యమ్నాయ అవకాశాలు కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.పార్టీ కోసం శ్రమించే ప్రతీ ఒక్కరికీ అండగా ఉంటామని ఆయన చెప్పారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందంటేనే అది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శ్రమతోటే అని ఆయన అన్నారు.పార్టీ గెలుపులో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు.పట్టణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జరుగుతున్న అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చెసి పట్టణ ప్రాంతాలలో మెరుగైన అభివృద్ధి జరుపుతామని ఆయన చెప్పారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మీదట జరుగుతున్న అభివృద్ధి అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెడితే పురపాలక సంఘం ఎన్నికల్లో విజయదుందుభి మ్రోగిస్తామని ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఉద్బోధించారు.అర్హులైన నిరుపేదలకు యావత్ భారత దేశంలోనే మొట్టమొదటి సారిగా నాణ్యమైన సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు.గతంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేసినప్పుడు ఆ బియ్యం వినియోగించేందుకు ప్రజలు ఇష్ట పడక పోగా వాటిని అమ్ముకునే వారని ఆయన చెప్పారు.దొడ్డు బియ్యం ప్రజలు వినియోగించుకోక పోగా పక్కదారి పట్టి అనేక అక్రమాలు జరిగేవని ఆయన చెప్పారు.అటువంటి అవకతవకలకు చెక్ పెట్టడంతో పాటు రాష్ట్రంలోని 85% ప్రజలకు 13,600 కోట్ల వ్యయంతో ఉచితంగా సన్నబియ్యం అందించిన విప్లవాత్మక నిర్ణయం కాంగ్రెస్ పార్టీదే అన్నారు.ఒక్క నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోనే 18000 మంది లబ్ధిదారులకు సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు.నిరుపేదల కడుపు నింపేందుకు ఉద్దేశించబడిన నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ ఉచితంగా అందిస్తున్న అంశం తనకెంతో తృప్తి నిచ్చిందని ఆయన చెప్పారు.నిరుపేదల కళ్ళలో వెలుగులు నింపాలన్నదే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సంకల్పమన్నారు.మహిళలకు ఉచితంగా ఆర్.టి.సి బస్సులో ప్రయాణ సౌకర్యం,పేదలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందించడం,సన్నబియ్యం పంపిణీ అందులో భాగమే నని ఆయన తెలిపారు.అన్నింటికీ మించి రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన నిరుపేదలకు తెల్లరేషన్ కార్డుల మంజూరు చేసిన ఘనత ముమ్మాటికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వనిదే నని ఆయన పేర్కొన్నారు.పదేళ్ల బి.ఆర్.ఎస్ పాలనలో అర్హులైన నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయక పోగా ఉన్న కార్డులలో కొత్త సభ్యుల చేర్పులకు కుడా అవకాశం ఇవ్వలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దుయ్యబట్టారు.ఇటువంటి అంశాలతో ప్రజల దగ్గరకు పోతే అంతిమ విజయం కాంగ్రెస్ పార్టీదే నన్న వాస్తవాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విస్మరించరాదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హితవుపలికారు.

**రెండ్రోజుల్లో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్: మంత్రి ఉత్తమ్**

అన్ని మతాల సమ్మేళనమే కాంగ్రెస్ పార్టీ అని.. దేశంలో భాజపాను ఓడించాలంటే తమ పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాశాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ నాయకుల, కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి టికెట్లు దక్కని వారు అధైర్య పడొద్దని.. వారికి నామినేటె పదవులు ఇస్తామన్నారు. సన్నబియ్యం కోసం ఏటా రూ.13,600 కోట్ల నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు.రెండు రోజుల్లో మున్సిపల్ షెడ్యూల్ విడుదల అవుతుందని, ఫిబ్రవరి 2వ వారంలో ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. 90 శాతం మున్సిపల్‌లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలును భాజపా అడ్డుకుందని విమర్శించారు. మున్సిపల్‌లలో అధికార కాంగ్రెస్ పార్టీ జెండాలు ఎగరవేస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్య, నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు.

# ఇరాన్ నిరసనల్లో మృతులు.. 30 వేల మంది

## 'టైమ్' సంచలన కథనం

**న్యూయార్క్(జనంసాక్షి):**ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెల్లుబికిన నిరసనల్లో వేల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు 'టైమ్' పత్రిక సంచలన కథనం వెలువరించింది. ఒక్క జనవరి 8, 9వ తేదీల్లోనే ఇరాన్ వీధుల్లో చోటుచేసుకొన్న హింసాత్మక ఘటనల్లో దాదాపు 30 వేలమంది చనిపోయి ఉండవచ్చని స్థానిక ఆరోగ్యశాఖ అధికారులను ఉటంకిస్తూ పేర్కొంది. భారీ సంఖ్యలో ప్రజలను ఇరాన్ భద్రతా దళాలు ఊచకోత కోశాయని.. మృతదేహాల తరలింపునకు అంబులెన్సుల స్థానంలో 18 చక్రాల ట్రక్కులను వినియోగించాల్సి వచ్చినట్లు తెలిపింది.ఆర్థిక సంక్షోభంతో ఇటీవల ఇరాన్‌లో ఆందోళనలు వెల్లువెత్తాయి. దేశవ్యాప్తంగా నాలుగు వేలకుపైగా ప్రదేశాల్లో నిరసనలు జరిగాయి. దీంతో ఆందోళనకారులపై భద్రతా బలగాలు ఉక్కుపాదం మోపాయి. జనవరి 21న ప్రభుత్వ వర్గాలు ప్రకటించిన 3,117 కంటే మృతుల సంఖ్య చాలా ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. అమెరికా కేంద్రంగా పనిచేసే హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్స్ న్యూస్ ఏజెన్సీ ఇప్పటివరకు 5,459 మరణాలను ధ్రువీకరించగా.. మరో 17,031 మరణాలపై సమాచారం సేకరిస్తోంది.ఇటీవలి పరిణామాలపై అమెరికా హెచ్చరికలు, ఆ దేశం దాడి చేస్తుందనే భయాల నడుమ ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని అధికారులు టెహ్రాన్‌లోని సురక్షితమైన బంకర్‌కు తరలించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే సుప్రీం లీడర్ తన కార్యాలయ బాధ్యతలను చిన్న కుమారుడు మసూద్ ఖమేనీకి అప్పగించినట్లుగా మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో కార్యనిర్వాహక వర్గంతో సమన్వయ పనులు కూడా ఆయనే చూడనున్నట్లు తెలిపాయి. అయితే, ఈ వార్తలపై ఇరాన్ అధికారుల నుంచి ఎలాంటి ప్రకటన లేదు.



## డిమాండ్లు అంగీకరించండి.. లేకుంటే చంపేస్తాం

**– వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలికి అమెరికా దళాల హెచ్చరిక**

**– డెన్సీ రోడ్రిగ్జ్ సంచలన ఆడియో లీక్**

కరాకస్(జనంసాక్షి):వెనెజువెలాపై సైనిక దాడి చేసి ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా దళాలు నిర్బంధించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో తమకు ఎదురైన సవాళ్ల గురించి తాత్కాలిక అధ్యక్షురాలు డెన్సీ రోడ్రిగ్జ్ ఫోన్లో మాట్లాడిన వీడియో ఒకటి తాజాగా లీక్ అయింది. తమ డిమాండ్లు అంగీకరిస్తారా.. లేక చస్తారా అని అమెరికా దళాలు బెదిరించినట్లు అందులో ఉంది. మదురో నిర్బంధం తర్వాత జరిగిన ఓ సమావేశానికి సంబంధించిన వీడియోలో.. రోడ్రిగ్జ్ ఫోన్ కాల్ ద్వారా మాట్లాడుతూ.. అధికారాన్ని కాపాడుకోవడమే తన ప్రాధాన్యత అని చెప్పినట్లుగా ఉంది. "అధ్యక్షుడు కిడ్నాప్ అయిన తర్వాత నిమిషం నుంచే మాకు బెదిరింపులు మొదలయ్యాయి. డిమాండ్లపై స్పందించేందుకు నాకు, అంతర్గత మంత్రి డియోస్డాడో కాబెల్లో, నా సోదరుడు, మంత్రి జార్జ్ రోడ్రిగ్జ్‌లకు కేవలం 15 నిమిషాల సమయం మాత్రమే ఇచ్చారు. లేకుంటే వారు మమ్మల్ని చంపేస్తానని బెదిరించారు. మదురో ఆయన భార్యను కిడ్నాప్ చేయలేదు.. చంపేశాం అని యూఎస్ దళాలు మాకు చెప్పాయి. ఇలాంటి పరిస్థితుల్లో బాధ్యతలు స్వీకరించాల్సి రావడం బాధాకరం" అని ఆమె ఆ వీడియోలో పేర్కొన్నారు.ఇదిలాఉండగా.. దేశంలో అధికార మార్పిడికి రోడ్రిగ్జ్ అమెరికాతో రహస్య డీల్ కుదుర్చుకున్నారనే ప్రచారం మొదలయ్యింది. గతేడాది నవంబరు నుంచే యూఎస్ అధికారులతో ఆమె సంప్రదింపులు జరిపారని ది గార్డియన్ పత్రిక పేర్కొంది. మదురోని తొలగించి అధికారం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నానని రోడ్రిగ్జ్ చెప్పినట్లు సదరు కథనం వెల్లడించింది. ఈ క్రమంలోనే తాజాగా ఆమె మాట్లాడిన వీడియో బయటకు రావడం గమనార్హం.

## మాట మార్చిన ట్రంప్

**యూకే దళాలను ప్రశంసిస్తూ పోస్టు**

వాషింగ్టన్(జనంసాక్షి):అఫ్గానిస్థాన్‌తో యుద్ధంలో నాటో దేశాలు దూరంగా ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయంలో ట్రంప్ స్వరం మార్చారు. యూకే సైనికుల కృషిని ప్రశంసిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. యూకేకు చెందిన గొప్ప, ధైర్యవంతులైన సైనికులు యూఎస్‌కు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. అఫ్గాన్‌లో మరణించిన 457 మంది యూకే సైనికులు, తీవ్రంగా గాయపడిన వారిని గొప్ప యోధులుగా అభివర్ణించారు. ఇరుదేశాల మధ్య ఉన్న సైనిక బంధం ఎప్పటికీ విచ్ఛిన్నం కాలేనంత బలంగా ఉందన్నారు. కాగా.. ఇటీవల ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తమకు అవసరమైనప్పుడు నాటో దేశాలు అండగా ఉంటాయని తాను అనుకోవడం లేదన్నారు. అయినా వారి అవసరం మాకు లేదన్నారు.

## పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు అభినందనలు

- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** 2026 సంవత్సరానికి గాను గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల జాబితాలో తెలంగాణ రాష్ట్రానికి విశేష ప్రాధాన్యత లభించడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. వివిధ రంగాల్లో అసాధారణ సేవలు అందించిన కళాకారులకు పద్మశ్రీ పురస్కారాలు లభించడం రాష్ట్ర ప్రతిభకు దక్కిన అత్యున్నత గౌరవంగా ఆయన అభివర్ణించారు. సైన్స్ రంగంలో చంద్ర మౌళి, కృష్ణమూర్తి, కుమారస్వామి తంగరాజ్ చేసిన పరిశోధనలు దేశ విజ్ఞానాభివృద్ధికి దోహదపడినవని తెలిపారు. వైద్య రంగంలో గూడూరు వెంకట్ రావు, విజయ ఆనంద్ రెడ్డి గార్లు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో అందించిన సేవలు అభినందనీయమని అన్నారు. కూచిపూడి నృత్య కళలో దీపికా రెడ్డి భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారని ప్రశంసించారు. పశుసంవర్ధక రంగంలో విశేష సేవలు అందించిన రామారెడ్డి మామిడికి (మరణానంతరం) పద్మశ్రీ లభించడం ఆయన సేవలకు సముచిత గౌరవమని పేర్కొన్నారు. ఈ ఘనత సాధించిన ప్రతి ఒక్కరికీ తన తరఫున, టీపీసీసీ తరఫున, అలాగే తెలంగాణ ప్రజల తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

## మేడారంలో 50 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

- జాతర ప్రాంతాల్లో 30 ప్రాంతాల్లో ప్రత్యేకంగా 800 డాక్టర్లతో మెడికల్ క్యాంపులు
- జంపన్న వాగులో సురక్షిత స్నానాలకు 325 మంది స్విమ్మర్లు,రక్షణ సిబ్బంది





**ములుగు బ్యూరో,జనవరి 25 (జనం సాక్షి):** మేడారం జాతరకు వచ్చే లక్షలాది భక్తుల ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేపట్టింది.ఒకవైపు సురక్షిత మంచినీటిని అందించడం, ముమ్మర పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం,జంపన్న వాగులో నీరు కలుషితం కాకుండా చర్యలుచేపట్టడంతో పాటు పెద్ద ఎత్తున వైద్య సదుపాయాలను కల్పించింది.మేడారం జాతర ప్రధాన వేదిక సమీపంలో టిటిడి కల్యాణ మండపంలో 50 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం,30 ప్రాంతాల్లో ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. మొత్తం జాతరలో ఏవిధమైన ఇబ్బందులు కలుగకండా ఉండేందుకు 5192 మంది మెడికల్,పారా మెడికల్ సిబ్బందిని వైద్యఆరోగ్యశాఖ రంగంలోకి దించింది.జాతర సమయంలో 24 గంటలు వైద్య సేవలందించేందుకు గాను 649 వైద్యాధికారులు,154 మంది ఆయుష్ వైద్యాధికారులు,673 నర్సింగ్ అధికారులు, 1905 ఆశ వర్కర్లు,1111 పారామెడికల్ సిబ్బంది,331 సూపర్వైజరి స్టాఫ్, 700 ఇతర సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు.జాతర ముగిసిన అనంతరం కూడా స్థానిక గిరిజనులకు ఏవిధమైన ఆరోగ్య సమస్యలు కలుగకుండా 10 మెడికల్ క్యాంప్స్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.వీటితోపాటు, మేడారం చుట్టూ పక్కలా ఉన్న ఏటూరు నాగారం, ములుగు, పస్రా, గోవిందా రావు పేట, మంగపేట సిఎస్సి ఆసుపత్రులను పటిష్ఠపరిచారు.

### జంపన్న వాగులో సురక్షిత స్నానాలకు 325 మంది స్విమ్మర్లు, రక్షణ సిబ్బంది...

మేడారం వచ్చే బీభక్తులు విధిగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ జంపన్న వాగులో ప్రమాదవశాత్తు పడి ప్రమాదాలకు గురీకాకుండా ఉండేందుకు జంపన్న వాగు పొడుగునా సురక్షితులైన స్విమ్మర్లు,సింగరేణి,ఎస్డిఆర్ఎఫ్ సిబ్బందిని మొత్తం 325 మందిని నియమించారు. వీరిలో మత్స్య శాఖ ద్వారా 210 స్విమ్మర్లు, 12 మంది సింగరేణి రెస్క్యూ టీమ్ సభ్యులు,100 మంది ఎస్డీఆర్ఎఫ్ టీమ్ సభ్యులున్నారు.వీరందరికీ లైఫ్ జాకెట్లు, ప్రత్యేక టీ షర్ట్స్,సెర్చ్ లైట్స్, లైఫ్ సేవింగ్ పరికరాలు అందచేశారు.

### అగ్ని ప్రమాదాలు జరగకుండా 268 సిబ్బంది

జాతర మొత్తం ప్రాంగణంలో ఏవిధమైన అగ్నిప్రమాదాలు జరుగకుండా రాష్ట్ర అగ్నిమాపక శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. 15 ఫైర్ బ్రిగేడ్స్,12 మిస్ట్ బుల్లెట్స్, రెండు ఫైర్ ఇంజన్లను జాతర ప్రాంగణంలో మోహరించారు. మొత్తం 268 ఫైర్ సిబ్బంది విధుల్లో ఉంటారు.



### ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం ద్వారా

## స్వయం ఉపాధికి బాటలు

- 200 మంది మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని..



**హనుమకొండ ప్రతినిధి, జనవరి 25 (జనం సాక్షి) :** ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.ఆదివారం హనుమకొండ జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం కార్యక్రమంలో భాగంగా 200 మంది మైనారిటీ మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం ద్వారా యువతకు, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. కుట్టు మిషన్లు, వ్యాపార రుణాలు, నైపుణ్య శిక్షణల ద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇది కేవలం సంక్షేమ పథకం మాత్రమే కాదని, అభివృద్ధికి పునాది వేస్తున్న కార్యక్రమమని అన్నారు. మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో అందిస్తున్నామని, మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా హాస్టళ్లు, కోచింగ్ సెంటర్లు, వృత్తి శిక్షణ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. మైనారిటీ కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను సమానంగా చూసే విధానంతో పాలన సాగిస్తోందని, మతం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలకు భిన్నంగా ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. లబ్ధిదారులు ఈ కుట్టు మిషన్లను సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇది మొదలు మాత్రమేనని, రాబోయే రోజుల్లో మైనారిటీల కోసం మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొస్తామని తెలిపారు. ఇప్పటికే మరో 200 కుట్టు మిషన్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ తప్పకుండా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు.ఈ పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు మైనారిటీ అనుబంధ సంఘ నాయకులు, మైనారిటీ పెద్దలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి ఫసల్ వాది విద్యా పీఠానికి సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తా

- రఘురామ కృష్ణంరాజు చంద్రబాబును తీసుకురావాలని కోరుతున్న
- రథ సప్తమి సందర్భంగా పాప నాశ వ్రతం
- ముఖ్య అతథులుగా పాల్గొన్న జగ్గారెడ్డి, రఘు రామకృష్ణం రాజు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సంగారెడ్డి మండలం ఫసల్ వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రథసప్తమిని పురస్కరించుకొని 1,671 మంది మహిళలతో భారీస్థాయిలో పాపనాశ వ్రతాన్ని నిర్వహించారు. మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీపిసిసి జనరల్ సెక్రటరీ తోపాజి అనంత కిషన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పాపాలను హరింపజేసే ఈ వ్రతం లోక కళ్యాణార్థం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రాంగణం భక్తుల జయజ యధ్వానా లతో మారుమోగింది. ఈ కార్యక్ర మంలో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కూన సంతోష్ పాల్గొన్నారు

## మరణించి ఇద్దరిలో జీవించారు!



**ఆత్మకూర్, జనవరి 25 (జనం సాక్షి):** గుండెపోటుతో స్వర్గస్తులైన రెవిన్యూ కాలనీ వాస్తవ్యులు తక్కిళ్లపల్లి రాజేశ్వరరావు మరణించి కూడా ఇద్దరిలో జీవించారు. కుటుంబ సభ్యుల సమ్మతితో నేను ఉపాధ్యక్షునిగా ఉన్న"తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్" తరపున వారి నేత్రాలను ఎల్వి ప్రసాద్ ఆసుపత్రికి అందించడం జరిగింది. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూన్నాను.ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు.

## డాక్టరేట్ అందుకున్న మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న...



**కడెం, జనవరి 25(జనం సాక్షి) :** 15 సంవత్సరాలుగా నిరంతరం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజాసేవలో తనదైన శైలిలో ప్రజల్లో ముద్ర పొందినటువంటి నచ్చన్ ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న ఆదివారం రోజున డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. గంగన్న ఆధ్వర్యంలో 2012 సంవత్సరంలో "స్పందన" స్వచ్ఛంద సంస్థను స్థాపించి ట్రైబల్ ఏరియాలలో ఆరోగ్యం, విద్య, పరిసరాల పరిశుభ్రత, ఓటు హక్కు అవగాహన వంటి అంశాలపై అనేక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. అలాగే ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా సమయంలో ప్రజల ఆరోగ్య రక్షణకు తోడ్పడుతూ ఉచితంగా 10,000 మాస్కులు పంపిణీ చేశారు.అంతేకాకుండా, నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలో సర్పంచ్‌గా ఎన్నికైన అనంతరం గ్రామాభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపుగా ప్రభుత్వము స్వచ్ సర్వేక్షణ్ గ్రామీణ్ - 2023 రాష్ట్ర అవార్డును ప్రదానం చేసింది. గత 5 సంవత్సరాలుగా నచ్చన్ ఎల్లాపూర్ మరియు కడం మండల కేంద్రాలలో వేసవికాలంలో ప్రజల కోసం ఉచిత అంబలి పంపిణీ, చలివేంద్ర కేంద్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలను ప్రతి ఏడాది సొంతంగా నిర్వహిస్తూ సుమారు 5 లక్షల రూపాయల వ్యయం చేస్తున్నారు. ఇలా ఆయన చేసిన అనేక సేవలను గుర్తించి వారి కుటుంబం నుంచి ప్రజల మందనలు పొందుతూ వరుసగా మూడుసార్లు గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

## నాంపల్లి అగ్నిప్రమాద ఘటనలో ఒక మృతదేహం లభ్యం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నాంపల్లిలో శనివారం సాయంత్రం ఫర్నిచర్ దుకాణంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక మృతదేహం కనిపించింది. గత ఇరవై ఒక్క గంటలుగా శ్రమించిన రెస్క్యూ టీమ్ కు వృద్ధురాలి మృతదేహం కనిపించింది. అరవై ఏళ్ల వృద్ధురాల మృతదేహాన్ని అంబులెన్స్ లో తరలించారు. మరో నలుగురు మృతదేహాలు లభ్యం కావాల్సి ఉంది. మంటలు ఇంకా అదుపులోకి రాకపోవడంతో నీటితో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు.

### నలుగురి కోసం గాలింపు...

మరో నలుగురి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. నలుగురి కోసం వారి బంధువులు బయట నిన్నటి నుంచి ఎదురు చూస్తున్నారు. భవనంలోకి వెళ్లడానికి కష్టసాధ్యంగా మారడంతో అనేక ప్రయత్నాలు చేసి చివరకు లోపలికి రెస్క్యూ టీం చేరుకుంది. అయితే ఆ నలుగురు సజీవంగా ఉంటారన్న నమ్మకం మాత్రం లేదు. ఇప్పటికే ఇరవై గంటలు దాటిపోవడంతో ఆశలుసన్నగిల్లుతున్నాయి.

### జేఎన్టీయూ నిపుణుల బృందాన్ని...

నాంపల్లి ఘటనపై కీలక పరిణామం చోటుచేసుకుంది. భవన భద్రతపై అనుమానాల నేపథ్యంలో జేఎన్టీయూ ఇంజినీరింగ్ నిపుణుల బృందం నాంపల్లికి చేరుకోనుంది. గత 21 గంటలుగా భవనం సెల్లార్‌లలో మంటలు కొనసాగుతుండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. సెల్లార్‌లకు రంధ్రాలు పడి పైకి పొగ వెలువడుతోంది. భవనం దృఢత్వంపై అధికారులకు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జేఎన్టీయూ నిపుణుల బృందం భవనాన్ని పూర్తిగా తనిఖీ చేసి సురక్షిత స్థితిపై నివేదిక సమర్పించనుంది.

# సింగరేణిపై బీఆర్ఎస్ నీతులు

- కాంగ్రెస్ ఓ లూజర్ పార్టీ
- మహేష్ గౌడ్ జాగృతిలో చేరితే నేషనల్ కన్వీనర్ పోస్టు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మేఘా అనే తిమింగలాన్ని రక్షించేందుకు బీఆర్ఎస్ చిన్న చేప చుట్టూ టెండర్ల వ్యవహారాన్ని తిప్పుతోందనితెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్ట్ ల విషయంలో సృజన్ రెడ్డి చిన్న చేప అని, మేఘా కృష్ణారెడ్డికి రూ. 25 వేల కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. దాని మీద బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడటం లేదని కవిత ప్రశ్నించారు. కార్మికులకు కష్టం వస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ లు పట్టించుకోవటం లేదని, పెద్ద కాంట్రాక్టర్ ను కాపాడేందుకు గుంటనక్క ప్రయత్నం చేస్తోందన్నారు. సింగరేణి విషయంలో బీఆర్ఎస్ తప్పులే చేయనట్లు మాట్లాడటం విచిత్రంగా ఉందని కల్వకుంట్ల కవిత అన్నారు. గుంటనక్క ప్రెస్ మీట్ ను గుడ్డిగా ఫాలో అయి కేటీఆర్ గుంతలో పడ్డాడడన్నారు. గతంలో సృజన్ రెడ్డికి బీఆర్ఎస్ హయాంలోనే కాంట్రాక్ట్ లు ఇచ్చారని, అప్పుడు రేవంత్ రెడ్డి బావమరది అని గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. సింగరేణి విషయంలో బీఆర్ఎస్ డొల్లతనాన్ని మేము గమనిస్తున్నామన్న కవిత కేటీఆర్ పై కథనం వస్తే ఒక నీతి? దళిత మహిళపై కథనం వస్తే ఒక నీతా? అని నిలదీశారు. కాంగ్రెస్ ఓ లూజర్ పార్టీ.. వచ్చే ఎన్నికల్లో గెలిచేది జాగృతి పార్టీయేనని కల్వకుంట్ల కవిత అన్నారు.కార్మికులకు కష్టం వస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ లు పట్టించుకోవటం లేదన్నారు. పెద్ద కాంట్రాక్టర్ ను కాపాడేందుకు గుంటనక్క ప్రయత్నం చేస్తోందని, సింగరేణి విషయంలో బీఆర్ఎస్ తప్పులే చేయనట్లు మాట్లాడటం విచిత్రంగా ఉందన్నారు. గుంటనక్క ప్రెస్ మీట్ ను గుడ్డిగా ఫాలో అయి కేటీఆర్ గుంతలో పడ్డాడని, గతంలో సృజన్ రెడ్డికి బీఆర్ఎస్ హయాంలోనే కాంట్రాక్ట్ లు ఇచ్చారని, అప్పుడు రేవంత్ రెడ్డి బావమరది అని గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. మహేష్ గౌడ్ నే జాగృతి లోకి ఆహ్వానిస్తున్నామని, ఆయన వస్తే నేషనల్ కన్వీనర్ పోస్ట్ ఇస్తామన్నారు. ఫోన్ ట్యాపింగ్ విచారణను ను జోక్ గా మార్చారని, తన లాంటి బాధితులకు న్యాయం జరుగుతుందని నమ్మకం లేదని అన్నారు. మోస్ట్ అన్ పాపులర్ యూట్యూబ్ ఛానెల్ లో కథనాలు వేసినట్లు శాటిలైట్ ఛానెల్ లో కథనాలు వేస్తున్నారని, దళిత ఆడబిడ్డల మీద అలాంటి కథనాలు వేయటంపై తాము బాధపడ్డామని, గతంలో లైన్ అతిక్రమించిన యూట్యూబ్ ఛానెల్ వాళ్లను బీఆర్ఎస్ ప్రభుత్వం అరెస్ట్ చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి లైన్ అతిక్రమించిన శాటిలైట్ ఛానెల్ ప్రతినిధులను కూడా అరెస్ట్ చేసిందని, ఐతే జర్నలిస్టులను అరెస్ట్ చేసిన తీరును మేము ఖండిస్తున్నామని అన్నారు.



## సిడిసి విద్యార్థి మొయిజుద్దీన్‌కు ద్వితీయ బహుమతి

**గుంటూరు (జనంసాక్షి) :** గుంటూరు నగరంలోని కేర్ డెంటల్ కాలేజీ మూడవ సంవత్సరం విద్యార్థి యస్. యం. మొయిజుద్దీన్ కు తెలంగాణ రాష్ట్రం దంత వైద్యుల పదవ మహా సభలలో ద్వితీయ బహుమతి లభించింది. తెలంగాణ రాష్ట్రం రాజధాని హైదరాబాదులో ఆదివారం నాడు ముగిసిన రెండు రోజుల మహా సభల సందర్భంగా యస్. యం. మొయిజుద్దీన్ Role of Mandibular advanced device in obstructive sleep apnea అను ప్రత్యేక అంశం మీద సభలలో పరిశోధన పత్రం సమర్పించారు. ఈ పరిశోధన పత్రం లోని విషయాలు కొత్త వైద్య విధానాల దిశగా దంత వైద్య విద్యారులలో సరికొత్త ఆలోచనలను రేకెత్తించే విధంగా ఉండటంతో యస్ యం మొయిజుద్దీన్ పత్రాన్ని పరిశీలించ దగినదిగా ఉందని సభలో పాల్గొన్న ప్రముఖులు విద్యార్థి మొయిజుద్దీన్ ను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం దంత వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ డి యన్ స్వామి , ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ అశ్విన్ దేశ్ పాండే, తెలంగాణ, అంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు దంత వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుంటూరు కేర్ డెంటల్ కాలేజీ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ రసూల్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జాజిర్ హుస్సేన్ విద్యార్థి యస్ యం మొయిజుద్దీన్ ను అభినందించారు.

# తెలుగులో సాహిత్య గణతంత్రం సాధ్యమేనా?

ప్రొఫెసర్ వెంకటరామయ్య గంపా

**భారతదేశం డెబ్బై ఏడు వసంతాల గణతంత్ర వేడుకలను ఘనంగా జరుపుకుంటోంది. ఢిల్లీలోని కర్తవ్య పథ్?లో మువ్వన్నెల జెండా రెపరెపలాడుతుంటే, రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛా వాయువులను మనమంతా ఆస్వాదిస్తున్నాం. 'రిపబ్లిక్' అంటే కేవలం ప్రభుత్వ విధానం మాత్రమే కాదు, అదొక జీవన విధానం. ప్రజలే ప్రభువులని, అంతిమ నిర్ణయాధికారం సామాన్యుడిదేనని చాటిచెప్పే ఉదాత్తమైన భావన అది. సరిగ్గా ఈ సందర్భంలోనే మన సాంస్కృతిక ప్రయాణాన్ని, మరీ ముఖ్యంగా 1950 తర్వాత తెలుగు సాహిత్య గమనాన్ని సింహావలోకనం చేసుకోవలసిన బాధ్యత మనపై ఉంది.**

రాజకీయంగా గణతంత్ర లక్ష్యం సిద్ధించింది. మరి సాహితీ ప్రపంచంలో ఆ 'గణ'తంత్ర స్ఫూర్తి ఎంతవరకు పరిమళించింది? అక్షర ప్రపంచం అందరిదీ అయిందా? లేక నిర్ణయాధికారం ఇంకా కొంతమంది చేతుల్లోనే ఉందా? అన్న ప్రశ్నలను తర్కబద్ధంగా విశ్లేషించుకోవడానికి పాశ్చాత్య రాజనీతి శాస్త్రంలోని 'ఎలైట్ సిద్ధాంతం' (మేధావి పాలన సిద్ధాంతం), భారతీయ న్యాయ మీమాంసలోని 'ఛత్రిణో గచ్ఛంతి న్యాయం' మనకు రెండు కరదీపికల్లా ఉపయోగపడతాయి.



ముఖ్యంగా 1950 తర్వాత తెలుగు సాహిత్య పరిస్థితులను ఈ సిద్ధాంతాల వెలుగులో పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన సామాజిక సత్యాలు బోధపడతాయి. సాహిత్యాన్ని నిందించడం ఈ వ్యాస ఉద్దేశం కాదు, శతాబ్దాలుగా కవులు, రచయితలు చేసిన కృషిని తక్కువ చేయడమూ కాదు. అయితే వ్యవస్థాగతంగా ఏ రక్షణ నీడన సాహిత్యం ఎదిగింది? ఆ అండ ఎవరిని సంరక్షించింది? ఎవరిని విస్మరించింది? అన్నది హేతుబద్ధంగా చర్చించుకోవడం ఆరోగ్యకరమైన సమాజానికి అవసరం.

ముందుగా 'ఛత్రిణో గచ్ఛంతి న్యాయం' గురించి ప్రస్తావించుకుందాం. ఇందులో ఆసక్తికరమైన, లోతైన అర్థం గోచరిస్తుంది. ఒక పెద్ద జనసమూహం ఊరేగింపుగా వెళుతోందనుకుందాం. అందులో వందలమంది ఉన్నారు. వారిలో నలుగురో, ఐదుగురో చేతిలో గొడుగులు (ఛత్రాలు) పట్టుకుని నడుస్తుంటారు. దూరం నుంచి ఆ సమూహాన్ని చూసినవారు 'అదుగో... గొడుగుల వారు వెళుతున్నారు' అని వ్యవహరిస్తారు. ఇక్కడ గమనించాల్సిన సూక్ష్మ విషయం ఏమిటంటే, ఆ సమూహంలో గొడుగులు లేనివారే ఎక్కువ. కానీ ఆ సమూహానికి గుర్తింపు తెచ్చింది మాత్రం గొడుగులు ఉన్న ఆ కొంతమందే. ఈ ఉదాహరణ సమాజంలో కొంతమంది మాత్రమే దృష్టిని ఆకర్షిస్తారని, మిగిలినవారు ఎంత పెద్ద సమూహమైనా నేపథ్యంలోకి ఎలా మారిపోతారో కళ్ళకు కడుతుంది. దీన్ని 1950 తర్వాత మన సాహిత్య రంగానికి అన్వయించుకుంటే ఒక చేదు నిజం తెలుస్తుంది. ప్రజాస్వామ్యం వచ్చిన తర్వాత సాహిత్యం అందరిదీ అవుతుందని మనమంతా ఆశించాం. కానీ ఈ న్యాయం రూపం మార్చుకుంది తప్ప స్వభావం మార్చుకోలేదు. నన్నయ కాలం నుంచి శతాబ్దాల పాటు 'రాజాశ్రయం' అనే రక్షణ ఆధారం ఉంటే, ఆధునిక కాలంలో అది 'సిద్ధాంతం', 'సంస్థ', 'అవార్డు' అనే రకమైన రక్షణ కవచాలుగా మారింది. చేతిలో ఈ సాంస్కృతిక అండదండలు ఉన్నవారే సాహిత్య చరిత్రలో 'కవులు'గా, 'రచయితలు'గా, 'నిర్దేశకులు'గా ముందు వరుసలో నిలిచారు. ఆ ఆశ్రయం లేనివారు ఆ ఊరేగింపులో భాగమే అయినప్పటికీ వారికి తగిన గుర్తింపు, నామకరణం దక్కలేదు. ఈ విధంగా సమాజంలోని బలహీన వర్గాల గొంతుకలు తరచుగా అణగారిపోగా, మేధావి వర్గాలు మాత్రమే చరిత్రలో నిలుస్తున్నాయి.

ఇక 'ఎలైట్ సిద్ధాంతం' విషయానికి వస్తే విల్ఫ్రెడో పారెటో, గ్యేటానో మోస్కా వంటి సామాజిక శాస్త్రవేత్తలు ఒక కీలకమైన విషయాన్ని ప్రతిపాదించారు. ఏ సమాజంలోనైనా, అది రాచరికమైనా, ప్రజాస్వామ్యమైనా నిర్ణయాధికారం, మేధోపరమైన నాయకత్వం ఎప్పుడూ ఒక చిన్న, వ్యవస్థీకృత సమూహం చేతుల్లోనే ఉంటుందని వీరి వాదన. దీనిని 'విశిష్ట వర్గం' లేదా 'నిర్ణాయక శక్తి' అంటారు. మిగిలిన వారంతా ఆ వర్గం చూపిన దారిలో నడిచేవారే. ఈ సిద్ధాంతం సమాజంలో అధికారం ఎలా కేంద్రీకృతమవుతుందో వివరిస్తుంది. మన గణతంత్ర దినోత్సవ స్ఫూర్తి 'సమానత్వం' అయితే ఎలైట్ సిద్ధాంతం చెప్పేది 'వాస్తవికత'. 1950 తర్వాత తెలుగు సాహిత్యంలో ఈ వాస్తవికతను మనం స్పష్టంగా గమనించవచ్చు. సాహిత్యాన్ని సృష్టించేవారు, దానిని విశ్లేషించేవారు, ఏది ఉత్తమ సాహిత్యమో నిర్ణయించేవారు ఎప్పుడూ సంఖ్యాపరంగా తక్కువమందే ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తెలుగు సాహిత్యం విశ్వవిద్యాలయాల ప్రాంగణాల్లో చురుకైన పాత్ర పోషించింది. అంతవరకూ జమీందార్ల కోటల్లో, పండితుల సభల్లో ఉన్న సాహిత్యం విద్యా సంస్థల చేతిలోకి వచ్చింది. గణతంత్ర స్ఫూర్తికి అనుగుణంగా జరిగిన ఈ మార్పుతోనే ఆధిపత్య ధోరణికి బీజం పడింది. ఈ పరిణామం సాహిత్యాన్ని మరింత ప్రజాస్వామ్యంగా చేస్తుందని భావించారు. కానీ వాస్తవంలో అది కొత్త రకమైన విభజనలను సృష్టించింది. విశ్వవిద్యాలయాల్లో 'పాఠ్య ప్రణాళిక' (సిలబస్) అనే కొత్త రక్షణ వలయం తయారైంది. 'అధ్యయన మండలి' గదుల్లో కూర్చున్న కొంతమంది ఆచార్యులు తెలుగు జాతి ఏ కవిని చదవాలి? ఎవరిని విస్మరించాలి? అని నిర్ణయించడం జరిగింది. వారి నిర్ణయమే శిరోధార్యం. ఆ జాబితాలో ఎవరి పేరు ఉంటుందో వారే మహాకవులు. పాఠ్య ప్రణాళికలో చోటు దక్కించుకున్న కవుల ప్రతిభను మనం శంకించడం లేదు. కానీ అందులో చోటు దక్కని, ఎంతోమంది గొప్ప రచయితల మాటేమిటి? వారికి 'అకడెమిక్ భరోసా' లేకపోవడం వల్ల వారు సాహిత్య చరిత్రలో రావాల్సినంత గుర్తింపు పొందలేకపోయారు.




గతంలో అధిక శాతం పరిశోధనలన్నీ సిలబస్ లో ఉన్న కవుల చుట్టూనే తిరిగేవి కావడంతో ఒక రకమైన 'చక్రాకార కీర్తి' వారికి మాత్రమే దక్కింది. ఇది వ్యవస్థాగతంగా ఏర్పడిన ఒక 'ఎలైట్ వలయంగా' భావించాలి. సామాన్య పాఠకుడి అభిరుచికి, అకడెమిక్ ప్రమాణాలకు మధ్య ఏర్పడిన ఈ అదృశ్య అగాధం సాహిత్యాన్ని సామాన్యుల నుంచి దూరం చేయడంతో పాటు, మేధావి వర్గాలు మాత్రమే దానిని నియంత్రించే పరిస్థితిని కల్పించింది.

ముఖ్యంగా 1965-1985 మధ్య కాలంలో వచ్చిన ఉద్యమాలను గమనిస్తే అక్కడ నాయకత్వం ఒక చిన్న సమూహం చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండటం కనిపిస్తుంది. వారు చెప్పిందే వేదం, గీసిందే గీత. ఈ కాలఖండం తెలుగు సాహిత్య చరిత్రలో అత్యంత కీలకమైనది. దీనిని 'కల్లోల, క్షీణ దశాబ్దాలు' అని భమిడిపాటి అనంత నారాయణ తన 'తెలుగు సాహిత్యంలో కల్లోల, క్షీణ దశాబ్దాలు (1965-1985)' పుస్తకంలో అభివర్ణిస్తారు. రాజకీయ అస్థిరత, నక్సల్బరీ ఉద్యమం, ఎమర్జెన్సీ వంటి పరిణామాలు సాహిత్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. దిగంబర కవులు, విప్లవ రచయితలు (విరసం) తెరపైకి వచ్చి పాత వ్యవస్థపై తిరుగుబాటు చేశారు. ఇది 'ఎలైట్ వర్గాల చలనంగా' మనం భావించవచ్చు. ఈ ఉద్యమాలు సాహిత్యాన్ని మరింత రాజకీయంగా మలచాయి, ప్రజల ఆవేదనలను వ్యక్తం చేశాయి. అయితే ఎలైట్ సిద్ధాంతం ప్రకారం ఇక్కడ నాయకత్వ స్వభావం మారింది తప్ప, వర్గ స్వభావం మారలేదు. విశ్వవిద్యాలయ ఆచార్య వర్గంతో పాటు ఈ కాలంలో 'సిద్ధాంతకర్తలు' శాసించడం మొదలుపెట్టారు. 'ప్రజల కోసం కళ', 'కళ కోసం కళ కాదు' అనే నినాదాలు మార్మోగాయి. ఇది వినడానికి ఎంతో ఉదాత్తంగా ఉన్నా, ఆచరణలో 'అభ్యుదయ భావజాలం' అనే గొడుగు కింద చేరినవారికే కవిగా గుర్తింపు లభించింది. ప్రజాస్వామిక ఆకాంక్షలు బలంగా ఉన్నప్పటికీ, దిశానిర్దేశం మాత్రం మధ్యతరగతి చేతిలోనే ఉండిపోయింది. ఆ నీడలో లేనివారిని, లేదా భిన్నమైన తాత్వికతతో రాసేవారిని 'ప్రతిఘాతకులు'గా ముద్ర వేసి పక్కనబెట్టే ధోరణి ఆనాడు బలంగా కనిపించింది. కార్మికుల గురించి, పీడితుల గురించి రాసిన కవుల్లో అత్యధికులు మధ్యతరగతి విద్యావంతులే కావడం, వారు పీడితుల పక్షాన 'వకాలతు' పుచ్చుకోవడం గమనార్హం. ఇక్కడ 'రాజకీయ ఎలైట్' సాహిత్యాన్ని తమ ప్రయోజనాలకు వాహికగా మలుచుకుంది. సామాన్యుడి ఆవేదన నిజమే అయినా దాని వ్యక్తీకరణ మాత్రం ఒక 'నియంత్రిత చట్రం'లోనే జరిగింది.

ఆ తరువాత 1980ల నుంచి సాహిత్య అకాడమీలు, ప్రభుత్వ పురస్కారాల ప్రాధాన్యత పెరిగింది. గణతంత్ర వ్యవస్థలో ప్రభుత్వాలు కళలను పోషించడం అవసరమే. కానీ ఈ అవార్డుల ఎంపిక ప్రక్రియలోనూ పైన పేర్కొన్న గొడుగుల న్యాయమే కనిపిస్తుంది. ఢిల్లీ నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవార్డు కమిటీల్లో, న్యాయ నిర్ణేతల బృందాల్లో తరచుగా ఒక వర్గానికి చెందిన వారే ఉంటున్నారని, అవే పేర్లు, అవే ముఖాలు వివిధ కమిటీల్లో మారుతూ కనిపిస్తాయనే విమర్శ ఉంది. 'వర్గ ఐక్యత' వల్ల వీరు తమకు నచ్చినవారిని, తమ భావజాలానికి దగ్గరగా ఉండేవారిని ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. దీనివల్ల ఒక సంవత్సరం వెలువడిన వందలాది మంచి పుస్తకాల్లో, అవార్డు వచ్చిన ఒక్క పుస్తకమే 'శ్రేష్ఠమైనది'గా ప్రచారం పొందుతోంది. దాంతో మిగిలిన కొన్ని ఉత్తమ పుస్తకాలు పాఠకుల దృష్టికి వెళ్ళడం లేదు. సాహిత్య అకాడమీ బహుమతి పొందిన రచన వివిధ భాషల్లోకి అనువాదమవుతుంది. ఇక్కడే వ్యవస్థాగత పక్షపాతం పనిచేస్తోంది. అవార్డు అనే రక్షణ వేదిక ఉన్న రచయిత వెలుగులోకి వస్తున్నాడు. ఆ మద్దతు లేని ప్రతిభావంతుడు మరుగున పడిపోతున్నాడు. కొత్త నీరు రావాలంటే ఈ ఎంపిక వ్యవస్థల్లో మార్పులు, పారదర్శకత అవసరం.

1985 తర్వాత కాలంలో, ముఖ్యంగా 1990లలో తెలుగు సాహిత్యంలో ఒక గొప్ప కుదుపు వచ్చింది. దళిత, స్త్రీవాద, మైనారిటీ, ప్రాంతీయ అస్తిత్వ వాదాలు బలంగా వినిపించిన కాలం. బహుశా భారత గణతంత్ర స్ఫూర్తి సాహిత్యంలో నిజంగా ప్రతిఫలించిన సందర్భం ఇదేనేమో! ఈ ఉద్యమాలు సాహిత్యాన్ని మరింత బహుళత్వంగా మార్చడంతో పాటు అణగారిన వర్గాల గొంతుకలను వినిపించాయి. ఇన్నాళ్లూ ఇతరుల ఆశ్రయంలో ఉన్నవారు, తమ సొంత వేదికలతో ముందుకు వచ్చారు. 'మా కథలు మేమే చెప్పుకుంటాం', 'మా భాషలో మేమే రాసుకుంటాం' అనే ఆత్మవిశ్వాసం వీరిలో వ్యక్తమయ్యింది. వివిధ వర్గాల రచయితలు సానుభూతితో రాసిన దళిత కథల కంటే, దళితులు తమ స్వీయ అనుభవంతో రాసిన కథల్లో జీవకళ తొణికిసలాడింది. వంటింటి సామ్రాజ్యంలో బందీలైన స్త్రీలు తమ అంతరంగ తరంగాలను అక్షరబద్ధం చేశారు. ఉత్తరాంధ్ర, తెలంగాణ, రాయలసీమ మాండలికాలు సాహిత్య గౌరవాన్ని దక్కించుకున్నాయి. ఇది 'ఎలైట్ ఆధిపత్యం'పై జరిగిన ప్రజాస్వామ్య తిరుగుబాటు. సాహిత్యం కొంతమంది సొత్తు కాదని, అది అందరి హక్కు అని ఈ ఉద్యమాలు నిరూపించాయి. అయితే ఇక్కడ ఒక హెచ్చరిక అవసరం. ఈ ఉద్యమాలు సంస్థాగత రూపం దాల్చిన తరువాత వీటిలోనూ కొత్త 'విశిష్ట వర్గాలు' తయారయ్యారు. ఎవరు నిజమైన బహుజన కవి? ఎవరు నిజమైన స్త్రీవాది? అని తీర్పు చెప్పే 'ద్వారపాలకులు' తయారవుతున్నారు. ఇలా జరిగితే మళ్ళీ మనం మొదటికే వచ్చినట్లవుతుంది.

నేడు మనం ఇంటర్నెట్ యుగంలో ఉన్నాం. సోషల్ మీడియా వేదికలు 'సాహిత్య ద్వారపాలకుల' అవసరాన్ని తగ్గించాయి. పత్రికా సంపాదకుడు కరుణించకపోయినా, ప్రచురణకర్త ముందుకు రాకపోయినా ఒక సామాన్యుడు తన రచనను ప్రపంచం ముందు ఉంచగలడు. ఇది సాహిత్య గణతంత్రంలో ఒక విప్లవాత్మక మార్పే అయినప్పటికీ ఇక్కడ 'అల్గారిథమ్' అనే కొత్త సాంకేతిక ప్రమేయం తయారైంది. సామాజిక మాధ్యమాల్లో వచ్చే 'లైకులు', 'షేర్లు', 'కామెంట్లు' అనేవి కొత్త సాహిత్య ప్రమాణాలుగా మారుతున్నాయి. లోతైన విశ్లేషణ, నిబద్ధత కలిగిన రచనల కంటే సంచలనాత్మకమైన, ఉపరితల ఆకర్షణ ఉన్న పోస్టులకే ఎక్కువ గుర్తింపు లభిస్తోంది. 'డిజిటల్ ఎలైట్స్' అనే కొత్త వర్గం ఏర్పడుతోంది. ఎక్కువ ఫాలోవర్లు ఉన్నవారే గొప్ప రచయితలనే భ్రమ కలుగుతోంది. ఇది కూడా ఆధిపత్య ధోరణికి మరో రూపమే. ప్రచారం అనే బలం ఉన్నవాడే కనిపిస్తున్నాడు. ఈ డిజిటల్ మార్పులు సాహిత్యాన్ని మరింత ప్రజాస్వామ్యంగా చేస్తున్నాయా లేదా కొత్త అసమానతలను సృష్టిస్తున్నాయా అని పరిశీలించాలి.

సాహిత్యంలో ఈ ఆధిపత్య ధోరణులను గుర్తించడం తిరుగుబాటు కోసం కాదు, కేవలం దిద్దుబాటు కోసమే. బాటలు పరిచే మార్గదర్శకులు సమాజానికి ఎంతైనా అవసరం. అయితే ఆ బాటలు కేవలం రాజమార్గాలకే పరిమితం కాకూడదు, పల్లె కాలిబాటలనూ స్పృశించాలి. నిజమైన అక్షర గణతంత్రం సిద్ధించాలంటే వ్యవస్థలో సమూల మార్పులు అనివార్యం. విశ్వవిద్యాలయాల నుంచి సాహిత్య సంస్థల వరకు, మేధావుల ఆలోచనా విధానాల నుంచి అవార్డుల ఎంపిక వరకు... అన్నింట్లోనూ ప్రజాస్వామిక స్పృహ వెల్లివిరియాలి. పద్మ పురస్కారాల ఎంపికలో ప్రభుత్వం సామాన్యుడి మాటకు విలువ ఇస్తున్నట్లే, సాహిత్య అకాడమీలు జనహృదయ స్పందనను గౌరవించాలి. నాలుగు గోడల మధ్య జరిగే నిర్ణయాల కంటే, పాఠకుడి ఆదరణే గీటురాయి కావాలి. సాహిత్యం కొంతమంది పండితుల అగ్రాసనం మీద కాకుండా, సామాన్యుడి ముంగిట్లో సేదతీరాలి. త్రివర్ణ పతాకం భిన్నత్వంలో ఏకత్వానికి ఎలా ప్రతీకగా నిలిచిందో, మన సాహిత్యం అన్ని మాండలికాలను, అన్ని జీవితాలను తనలో కలుపుకున్నప్పుడే పరిపూర్ణమవుతుంది. 'రక్షణ ఆధారం' అనేది కొంతమందిని కాపాడే కవచం కాకూడదు, అది అందరినీ అక్కున చేర్చుకునే ఆకాశం కావాలి. సామాజిక న్యాయం, అక్షర స్వేచ్ఛ జతకట్టిన నాడే మన 'సాహిత్య గణతంత్ర' పతాకం సగర్వంగా రెపరెపలాడుతుంది.



**Prof. Venkata Ramaiah Gampa**
venkat@il.du.ac.in
Room No. F13, Department of Indian Languages and Literary Studies, Tutorial Building, University of Delhi, Delhi -110007.
Phone: 9958607789

## కమ్మనైన గీతమే ఈ దేశం

మూడు రంగుల జెండా
నీడలోన పాడేటి కమ్మనైన గీతం
వందే మాతర గీతం
కమ్మనైన తీయనైన
తేనే లోలికేటి గీతం
వందే మాతర గీతం
మధురాతి మధుర మధుర గీతం
వందే మాతర గీతం
భారత మాత వోడి నుండి పారె గంగా
యమున గోదారి
జలాల అలజడి గీతం
వందేమాతర గీతం
ఆ నదీ జలాలతో పండేటి
పచ్చనైన ప్రకృతి గీతం
వందే మాతర గీతం
భారత మాత కంటి వెలుగుతో వెలిగేటి
సూర్య కాంతి ఈ గీతం
వందే మాతర గీతం
గంగా జమున జలాలతో
పండే రక రకాల పంటల వలే
రకాల కుల మతాల భాషలతో హృదాయాలు
ఒప్పొంగించే చెవులకు వింపైన
గీతం వందే మాతర గీతం
మహాత్ముల అమర వీరుల త్యాగాలను తలంచే
గీతం
వందే మాతర గీతం
భారత మాత కన్నా విభిన్న బాషల కవుల
విభిన్న కావ్యలతో ఏకత్వం ఉన్న గీతం
వందే మాతర గీతం
భరత మాత ఒడిలోన
పచ్చని చెట్లపై పూసిన రక రకాల
సుగంధ వాసనలు
వెదజల్లే పూల పై విహరించే
తుమ్మెద రెక్కల ధ్వని తో గానాల గీతం
వందే మాతర గీతం సస్య శ్యామల గీతం
జయ జయహో భారత మాత గీతం
కవి కలం నుండి రాలిన మధుర మధుర
గీతాల వలే మధుర గీతం ఈ
వందే మాతర గీతం

**షేక్ జానిమియా**
**ఆలేరు, యాదాద్రి భువనగిరి జిల్లా**
**9866201842**

## భారత గణతంత్ర రాజ్యాంగం - లౌకిక విలువలు

గతంలో ఎన్నడూ లేనంతగా భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్నది. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ పీఠికలో మనం చెప్పుకున్నట్లుగా భారత రాజ్యాంగం సర్వసత్తాక, స్వతంత్ర, గణతంత్ర, లౌకిక, సామ్యవాద, ప్రజాస్వామిక దేశం గురించి కొంత చర్చించడం అవసరం. 1950 జనవరి 26వ తేదీ నుండి ఈ రాజ్యాంగాన్ని మనము అమలు చేసు కుంటున్నాం. ప్రపంచంలో అతి పెద్దదైన గొప్ప రాజ్యాంగాన్ని కలిగి ఉన్నామని ఎన్నో గొప్పలు చెప్పుకున్నాం. భారత స్వాతంత్ర పోరాటంలో ఎటువంటి పాత్ర లేనటువంటి ఆర్ఎస్ఎస్ జన సంఘ పార్టీ, 1980 నుండి భాజాపా గా అవతరించి నేడు మూడవ దఫా అధికారం కొనసాగిస్తున్నది. దేశంలో నేడు ఫాసిస్టు తరహా పాలన కొనసాగుతున్నది. 1949 డిసెంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగాన్ని భారత రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన మరుసటి రోజున భారత రాజ్యాంగాన్ని తిరస్కరిస్తున్నామని ఆర్ఎస్ఎస్ ప్రకటించింది. వారి పత్రిక ఆర్గనైజర్లో రాసింది. వాజ్ పాయ్ ప్రధానమంత్రి అయిందాక జాతీయ జెండాను కూడా ఎగురవేయలేదు.

2014వ సంవత్సరంలో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా ఈ దేశాన్ని పరిపాలిస్తున్నాడు. నరేంద్ర మోడీ అధికారంలోకి రావటానికి కారణం భారతీయ జనతా పార్టీ మాతృ సంస్థ అయిన రాష్ట్రీయ స్వయంసేవక సంఘం. ఆర్ఎస్ఎస్ రాజకీయ ఎజెండా భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చటం. భారత రాజ్యాంగాన్ని మార్చి " వర్ణాశ్రమ ధర్మాలను, స్త్రీలను, ఆదివాసీలను, దళితులను, ముస్లింలను, క్రైస్తవులను, శ్రామిక శ్రేయో రాజ్యం కోరుకునే కమ్యూనిస్టు లను అణచివేసి హిందూ రాజ్యం ఏర్పాటు చేయటం దాని లక్ష్యం.ఒకే దేశం- ఒకే ప్రజ- ఒకే భాష పేరుతో బహుళ సంస్కృతులు ,జాతులు, భాషలు, ఏకత్వంలో భిన్నత్వం కలిగిన గణతంత్ర భారత జాతిని విధ్వంసం చేయటమే అది పనిగా పెట్టుకున్నది. ఇస్లాం ఫోబియోను రెచ్చగొట్టి అందుకు అనుగుణంగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలు చేయుచున్నది. అదేవిధంగా జాతీయోన్మా దాన్ని రెచ్చగొట్టుచున్నది. జాతి సంపదను అంబానీ ఆదానీ లకు , ఆశ్రిత పెట్టుబడిదారులకు దోచిపెట్టుచున్నది. 75 సంవత్సరాలుగా ప్రజలు చెల్లించిన ప్రతి పన్ను నుండి పోగు పడ్డ జాతి సంపదను గనులు ,రైల్వేలు విమానాలు ,షిప్పి యార్డులు, విమానాశ్రయాలు ,రోడ్లు, జాతీయ రహదారులు అడవులు ఒకటేమిటి అన్ని " పి. పి. పి. పి " ప్రైవేట్ పబ్లిక్ పార్ట్నర్షిప్ పేరుతో, ప్రైవేట్ పబ్లిక్ పీపుల్స్ పార్టనర్షిప్ పేరుతో దేశ సంపదను ఆశ్రిత పెట్టుబడి దారులకు అప్పచెబుతు న్నారు. సిఏఏ, ఎన్నీఆర్, ఎన్ ఆర్ సి, సర్, జీఎస్టి, ఎంజిఎన్ఆర్ఇని ఎత్తివేయటం, నాలుగు లేబర్ కోడులు తీసుకురావడం, మణిపూర్ విధ్వంసం, నక్సలైట్ల పేరుతో చత్తీస్గఢ్ రాష్ట్రాన్ని అడవులను రక్తసిక్తం చేసి వందలాది మందిని ఎన్కౌంటర్ల పేరుతో హత్య చేయటం ఒకటి ఏమిటి, చెప్పు కుంటూపోతే పెద్ద గ్రంథమే అవుతుంది. లౌకిక విలువలకు తిలోదకాలిచ్చి బాబ్రీ మసీదు విధ్వంసం, రామాల యాన్ని నిర్మించటం , తీర్పుల దగ్గర్నుంచి నేటి అమలు వరకు మతం పేరుతో ప్రజలను మభ్యపెట్టడం, ఆర్టికల్ 370 , 35 ఏ,లను కాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దు చేయడం, రాష్ట్ర ప్రభుత్వాలను మున్సిపాలిటీల స్థాయికి దిగజార్చటం ఒకటేమిటి ఎన్నో విషయాలు చెప్పుకుంటూ పోవచ్చు.




బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వ్యతిరేకంగా అనేక పార్టీలు సంస్థలు వ్యక్తులు పోరాడారు. 1947 ఆగస్టు 15న భారతదేశానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పబడుతున్నది. భారత దేశన్నుండి బ్రిటిష్ సామ్రాజ్యవాదులను తరిమి కొట్టడానికి, దోపిడీ పీడనలను వ్యతిరేకిస్తూ అఖండ భారత జాతి ముద్దుబిడ్డలు ఎనలేని త్యాగాలు చేశారు. ఉరికంబాలు ఎక్కారు. ఇంగ్లీషు చదువులతో సోషలిస్టు సాహిత్యాన్ని, పాశ్చాత్య ఉదారవాద ఫ్రెంచ్, రష్యా, అమెరికా,ఆఫ్రికా మొదలగు దేశాల్లోని జాతీయ ఉద్యమాలను అధ్యయనం చేసిన భారతీయ యువకులు అమెరికాలో గదర్ పార్టీని 1913 అమెరికాలోని శాన్ఫ్రాన్సిస్కో నగరంలో ఏర్పాటు చేశారు. బొంబాయిలో 1885లో డిసెంబర్ 28-31వ తేదీన ఉమేష్ చంద్ర బెనర్జీ అధ్యక్షుడిగా భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడింది. ఏఓ హ్యూమ్ తదితరులు 72 మంది హాజరైన ఏర్పడ్డ జాతీయ కాంగ్రెస్ సామ్రాజ్యవాదానికి మహాత్మా గాంధీ అహింసా, సత్యాగ్రహం పద్ధతిలో బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని భారత గడ్డపై నుంచి తరిమి కొట్టడం సాధ్యపడదని క్రాంతి వీరులు భావించారు. విదేశాల్లో ఉన్న కొంతమంది భారతీయ యువకులు మార్క్సిస్టు ప్రభావానికి గురైనారు. రష్యాలో లెనిన్ నాయకత్వాన విజయవంతమైనటువంటి సోషలిస్టు విప్లవం , శ్రామిక శ్రేయో రాజ్యం వారిని ఆకర్షించింది. 1920 అక్టోబరు 17న కామ్రేడ్ షఫీక్ కార్యదర్శిగా రష్యా తాష్కెంట్లలో కమ్యూనిస్టు పార్టీని ఏర్పరిచారు. 1906 డిసెంబర్లో ఢాకాలో ముస్లిం లీగ్ అవతరించింది.హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అనేది 1928 సెప్టెంబరులో న్యూఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్లాలో చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్, సుఖ్దేవ్ థాపర్ మరియు ఇతరులచే స్థాపించబడిన ఒక రాడికల్ భారతీయ విప్లవాత్మక సంస్థ. మునుపటి హిందూస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్ నుండి పునర్వ్యవస్థీకరించబడిన ఇది సాయుధ పోరాటం ద్వారా బ్రిటిష్ వలస పాలనను పడగొట్టి సోషలిస్ట్ రిపబ్లిక్ను స్థాపించడానికి ప్రయత్నిం చింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను వెళ్లగొట్టడానికి దేశంలో వివిధ ప్రాంతాల్లో అనేక రకాల ఉద్యమాలు జరిగాయి. సంపూర్ణ స్వరాజ్యం కావాలనే నినాదం మొట్టమొదటిసారిగా కమ్యూనిస్టు పార్టీ ఇచ్చింది.డిసెంబర్ 19, 1929న లాహోర్ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ ఆమోదించిన పూర్ణ స్వరాజ్ తీర్మానం (సంపూర్ణ స్వాతంత్ర్యం), బ్రిటిష్ పాలన నుండి భారతదేశం యొక్క సంపూర్ణ సార్వభౌమాధికారాన్ని, చర్చించలేని లక్ష్యంగా ప్రకటించింది. జవహర్?లాల్ నెహ్రూ ప్రతిపాదించిన ఇది, మునుపటి ఆధిపత్య హోదా డిమాండ్?ను భర్తీ చేసి, శాసనోల్లంఘన ఉద్యమానికి వేదికను ఏర్పాటు చేసింది.

మౌలానా హస్రత్ మోహని, స్వామి కుమారానంద్ వంటి ప్రముఖుల నేతృత్వంలోని భారతదేశంలోని కమ్యూనిస్టులు బ్రిటిష్ పాలన నుండి పూర్ణ స్వరాజ్ (సంపూర్ణ స్వాతంత్ర్యం)ను మొదటగా సమర్థించారు, 1921లో అహ్మదాబాద్లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో అధికారికంగా దాని కోసం ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

1921లో, ప్రారంభంలో కమ్యూనిస్ట్ ఉద్యమంతో సంబంధం ఉన్న హస్రత్ మోహని మరియు స్వామి కుమారానంద్ "సంపూర్ణ స్వాతంత్ర్యం" తీర్మానాన్ని ప్రతిపాదించారు, దీనిని మొదట మహాత్మా గాంధీ తిరస్కరించారు.

1950 జనవరి 26 నుండి భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. నాటినుండి ప్రతి సంవత్సరం జనవరి 26న గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నాం. 29 ఆగస్టు 19 47న రాజ్యాంగ రచనా సభ డ్రాఫ్టింగ్ కమిటీని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన ఎన్నుకున్నది. డ్రాఫ్టింగ్ కమిటీ కోసం ముసాయిదా ప్రతిని తయారుచేసిన రాజ్యాంగ సలహాదారు మంగళూరు సరస్వతి బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సర్ బెనిగల్ నర్సింగరావు(బి ఎన్ రావు)కు కూడా రాజ్యాంగ నిర్మాణ కృషిలో భాగమైనందుకు ఆయనకు అభినందనలు దక్కాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ ముసాయిదా ప్రతి పూర్తి అయిన సందర్భంగా 1949 నవంబర్ 26న ఆయన చెప్పారు. 1946 డిసెంబర్ 9న మొట్టమొదటగా డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సమావేశమైన రాజ్యాంగ రచనా సభ రెండు సంవత్సరాల 11 నెలల 17 రోజుల పాటు చర్చించింది. మొత్తం 11 సమావేశాలు జరిగాయి. షెడ్యూల్ కులాల ప్రయోజనాలు పరిరక్షించే ఏకైక ప్రయోజనం తోనే నేను ఈ సభలో అడుగు పెట్టాను అని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఉద్ఘాటించారు.

డ్రాఫ్టింగ్ కమిటీ రచన నాణ్యత విషయం గురించి వస్తే నజీరుద్దీన్ అహ్మద్ (రాజ్యాంగ సభ సభ్యుడు) అభిప్రాయంలో నాసిరకం తక్కువ స్థాయి రాజ్యాంగం అని ఆయన అన్నారు. డ్రాఫ్టింగ్ కమిటీని డ్రిఫ్టింగ్ (నీటిలోఎటుపడితే అటు కొట్టుకుపోతున్న- వాటంగా) కమిటీగా వర్ణించి ఆయన తన తన అసమ్మతిని తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆహ్వానించారు. ఈసందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ- ప్రధానంగా కమ్యూనిస్టు సోషలిస్టు పార్టీలు రెండూ రాజ్యాంగాన్ని ఖండించాయి. వారు రాజ్యాంగాన్ని ఎందుకు ఖండిస్తున్నారు? నిజంగా ఈ రాజ్యాంగం అంత చెడ్డదా? కాదు అని చెప్పేందుకు నేను సంశయించను. శ్రామిక వర్గ నియంతృత్వ సూత్రం ఆధారంగా రాజ్యాంగం కావాలన్నది కమ్యూనిస్టు పార్టీ ఆదర్శం సోషలిస్టులకు రెండు అంశాలు కావాలి. సోషలిస్టులు అధికారంలోకి రాగానే ఎటువంటి పరిహారము చెల్లించకుండా వ్యక్తిగత ఆస్తినంత జాతి పరం లేదా సమాజ పరం చేయాలని సోషలిస్టులు కోరే మొదటి అంశం.... అని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్నారు. భారత రాజ్యాంగ సభలో ఒక్క కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు కూడా లేకపోవడం విచారకరం. ఇంత ఉన్నతమైన రాజ్యాంగానికి 106 సవరణలు చేశాం. 870 కేంద్ర చట్టాలు అమలులో ఉన్నాయి. ఇవి కాకుండా వివిధ రాష్ట్రాల్లో అనేక చట్టాలు అమలులో ఉన్నాయి. భారత రాజ్యాంగం రూపొందించినప్పుడు 395 ఆర్టికల్స్, 8 షెడ్యూలులు, 22 భాగాలు. కానీ నేడు 448 ఆర్టికల్స్, 12 షెడ్యూలు 25 భాగాలు కలిగి ఉన్నాము.

భారత రాజ్యాంగం అమలుకు నోచుకుంటుందా? లేదా అనేది గొప్ప ప్రశ్న? అందుకు అంబేద్కర్ ఈ విధంగా చెప్పాడు. ఎందుకంటే ఒక రాజ్యాంగం ఎంత మంచిదైనా అది అమలు చేయాల్సిన వారు చెడ్డ వారైతేఅది చెడుపు చేస్తుంది. అదేవిధంగా ఒక రాజ్యాంగం ఎంత చెడ్డదైనా దాన్ని అమలు చేసే వారు మంచివారైతే ఆ రాజ్యాంగం మంచే చేస్తుంది. రాజ్యాంగ ప్రవృత్తిపై పూర్తిగా రాజ్యాంగ ఆచరణ ఆధారపడి ఉండదు. భారత రాజ్యాంగ పరిరక్షణకు, లౌకిక ,సామ్యవాద ,ప్రజాస్వామ్య విలువలకు ప్రతి ఒక్కరూ ప్రతిన పూనాల్సిన సమయం ఆసన్నమైంది.

**మన్నవ హరిప్రసాద్**
**అడ్వోకేట్, మార్క్సిస్టు- లెనినిస్టు విశ్లేషకుడు**
**82477 28296**
**email:mannava-haripra sad@gmail.com**



# విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

మొయినాబాద్, జనవరి 25 (జనంసాక్షి) : విద్యార్థులకు సృజనాత్మక నాణ్యమైన విద్యను అందించినప్పుడే విద్యార్థులు అభివృద్ధి చెందేందుకు వీలుంటుందని, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ లు పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామ పరిధిలో శ్రీ శివ సాయి హై స్కూల్ 25వ వార్షికోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ గోపాలరావు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి విద్యార్థులు రేపటి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఆధారపడి ఉంటుందని, అన్నారు. డబ్బేకు ప్రాధాన్యత ఇస్తూ.. నడుపుతున్న పాఠశాలలకు చమర గీతం పాడి.. విద్యార్థుల భవిష్యత్తు కొరకు పాటుపడవలసిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు.



తను శ్రీ శివ సాయి పబ్లిక్ పాఠశాలకు 13సార్లు వచ్చి ఇలాంటి కార్యక్రమంలో పాల్గొన్నడం నాకు ఎంతో గర్వకారణమని, సబిత ఇంద్రారెడ్డి అన్నారు. మాజీ ఐపీఎస్ అధికారి జేడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే బాధ్యతను తీసుకోవాలని జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. మారుమూల గ్రామంలో పేద విద్యార్థులను తీర్చిదిద్దుతున్న యాజమాన్యాలను అభినందించారు. తను ఈ కార్యక్రమానికి హాజరుకావడం తను చిన్ననాటి పాఠశాలల్లో చదువుకున్న విద్య గుర్తుకొస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, బీజపురం సుమలత, బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న సతీష్, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పల్లగొల్ల అశోక్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త నరసింహారెడ్డి, ముదిగొండ రవి యాదవ్, షాబాద్ శ్యామ్ రావు, కొత్త మాణిక్ రెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ పల్లగొల్ల కృష్ణ యాదవ్, స్థానిక నాయకులు మరియు ప్రగతి రిసార్ట్స్ జీవీ.కే రావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు పాఠశాలలో మంచి మార్కులు ర్యాంకులు సాధించిన వారికి బహుమతులను అందించారు.

## మురుగు కాలువ పరిశుభ్రతకు చర్యలు



తాండూరు, జనవరి 25 (జనంసాక్షి) : మురుగు కాలువ పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టనట్లు బిర్కడ్ జ్యోతి రఘు పేర్కొన్నారు. ఆదివారం 20వ వార్డుకు చెందిన బిర్కడ్ జ్యోతి రఘు సమక్షంలో గాంధీనగర్ లోని మురుగు కాలువ పరిశుభ్రత పనులు చేపట్టారు.గత కొన్ని రోజులుగా గాంధీనగర్ లోని పెద్ద డ్రైనేజీ శుభ్రం చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కంపుతో పాటు దోమలు, ఈగల స్వైర విహారంతో అవస్థలు పడుతున్నారు. స్థానికులు ఈ విషయాన్ని బిర్కడ్ జ్యోతి రఘు దృష్టికి తీసుకవచ్చారు. దీంతో స్పందించి మురుగు కాలువ పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. జేసీబీ యంత్రం ద్వారా మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని తొలగింపు చేయించారు. మురుగు సవ్యంగా పారేలా శుభ్రం చేయించారు. మురుగు కాలువ సమస్య తీర్చడంతో స్థానికులు బిర్కడ్ జ్యోతి రఘుకు కృతజ్ఞతలు తెలిపారు.

## మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల్లో అధికారుల జవాబుదారీతనం పెరగాలి



శేరిలింగంపల్లి, జనవరి 25 (జనంసాక్షి) : ప్రజా ప్రయోజనాల నిమిత్తం అధికారులు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో జవాబుదారీతనం చూపాల్సిన అవసరం ఉందని, తద్వారా పనులలో మరింత నాణ్యత పెరిగే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల హుడా కాలనీ లేఅవుట్ పరిధి . రాక్ గార్డెన్ నుంచి ఎస్బిఐ మెయిన్ రోడ్ వరకు నిర్మిస్తున్న బిటి రోడ్డు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా లేఅవుట్? లో రాక్ గార్డెన్ నుంచి ఎస్?బిఐ మెయిన్ రోడ్డు వరకు హెచ్ఎండిఏ నిధులతో చేపడుతున్న భిటి రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టి పూర్తి చేయాలని, ఎక్కడ అధికారుల అలసత్వం, ఉదాసీనత కనిపించకుండా బాధ్యతాయుతంగా రోడ్డు పనులు పూర్తయ్యేంతవరకు వ్యవహరించాలని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగంగా పనులు పూర్తిచేసి వీలైనంత త్వరగా అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ముస్తాక్, ప్రభాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రాజు, రాములు గౌడ్, అనిల్ కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం పేరు మార్పుపై నిరసన కార్యక్రమం

మొయినాబాద్, జనవరి 25 (జనంసాక్షి) : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని, పేదల కడుపు నింపే ఇలాంటి పథకం ప్రపంచంలో ఎక్కడ లేదని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేనా భీంభరత్ పేర్కొన్నారు. వీబీజీ రాంజీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ మీనాక్షి నటరాజన్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలతో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరు మారుస్తూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీజీ రాంజీ ఉపాధి హామీ పథకానికి నిరసనగా ఆదివారం మొయినాబాద్ మండల పరిధిలోని తోల్కట్ట గ్రామంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీంభరత్



ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ సెక్రెటరీ విశ్వనాథం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సెక్రెటరీ విశ్వనాథం మాట్లాడుతూ.. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడం కోసం యూపీఏ ప్రభుత్వం కాలంలో ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం మహాత్మా గాంధీ పేరు తొలగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు. వీబీజీ రాంజీ పథకం గ్రామీణ ప్రాంత పేదలను మరింత పేదరికంలోకి నెట్టేస్తోందని, ఆయన విమర్శించారు. మహాత్మా గాంధీ పేరుతో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతిలోనే యధావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ఛైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, మొయినాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొక్క బాలకృష్ణరెడ్డి, శ్రీపాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, నరేందర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి కళ్యాణం కమనీయం

తలకొండపల్లి, జనవరి 25 (జనంసాక్షి) : మండలంలోని చుక్కాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో వెలసిన శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి



కళ్యాణం కన్నుల విందువుగా కొనసాగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆలయ పూజారులు పూర్ణ కుంభముతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నకేశవుడి కళ్యాణాన్ని పచ్చని మామిడి తోరణాలు బాజా భజంత్రీలతో వేద బ్రాహ్మణులు రామ శంకర శర్మ,ఆంజనేయ శర్మ,వెంకటేశ్వర శర్మ,శ్యామ్ శర్మ,శ్రీనివాసామూర్తి శర్మ,పట్టాభి రామశర్మల మంత్రోచ్ఛనుల మధ్యన కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో దంపతులు ఏమిరెడ్డి ప్రియాంక పాండురంగారెడ్డి,గౌరీ శ్రీనివాసరెడ్డిలు స్వామివారి కళ్యాణాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ దైవ సంకల్పం ఎంతో గొప్పదని,గ్రామాలలో ప్రజల మధ్య స్నేహం భక్తి భావంతో మెలుగుతూ అందరూ కలిసిమెలిసి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శ్యాంసుందర్ గుప్తా,వార్డు సభ్యులు ఉప సర్పంచ్ లావణ్య శ్రీనివాస్, చంద్రకుమార్, రాకేష్,నాయకులు ఏమి రెడ్డి రంగారెడ్డి,మధుసూదన్ రెడ్డి,బుచ్చిరెడ్డి, ఏరువ రాజలింగం,కుమార్ యాదవ్, కుమ్మరి రఘు,మాకం నరసింహులు, యాదయ్య, చీపునుంతల మాజీ సర్పంచ్ రఘుపతి, మధు, నిరంజన్,మహేష్,రాఘవేందర్ రెడ్డి,శేఖర్ రెడ్డి,కడ్తాల్ గూడూరు శ్రీనివాస్ రెడ్డి,సురేందర్ రెడ్డి,పెద్దయ్య గౌడ్,గ్రామస్తులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపుల ఐక్యంగా ఎదగాలి



రాజేంద్రనగర్, జనవరి 25 (జనంసాక్షి) : తెలంగాణలో అధిక జనాభా కలిగిన మున్నూరు కాపు సంఘాలను ఐక్యముగా ఏకీకృతం చేయాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. ఆయన ఈ అంశాన్ని బండ్లగూడ జాగీర్ మూన్నూరు కాపు సంఘ అధ్యక్షుడు మీరంపల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో, సికింద్రాబాద్?లోని సిక్ విలేజ్?లోని ఓ ఫంక్షన్ హాల్?లో మున్నూరు కాపు కమిటీ సభ్యులతో జరిగిన కార్యక్రమంలో స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు 2026 నూతన సంవత్సర కాలమానిని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, మున్నూరు కాపు కుల బంధువులు ఐక్యంగా ఎదగాలని, సమాజ సేవలో తమకంటూ ఓ స్థానం ఏర్పరచుకోవాలని, అలాగే నిరుపేద మున్నూరు కాపులకు ఐక్యత, సామాజిక అభివృద్ధి, నిరుపేదలకు సహాయంపై ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అతను, నిరుపేద మున్నూరు కాపులకు ఎదురవుతున్న సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే, వాటిని పరిష్కరిస్తే ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఆకుల మహేష్, ఛైర్మన్ తిరుమల ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ముత్యాల ఆంజనేయులు, మున్నూరు శ్రీశైలం, ఆర్గనైజింగ్ సెక్రటరీ దుర్కి శివకుమార్, ఉప కోశాధికారి తోట ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 25 (జనం సాక్షి) : గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీసు పెరేడ్ గ్రౌండ్ లో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఆదివారం జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్ డి ఓ రమాదేవి లతో కలసి పరిశీలించారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం




కొడంగల్, జనవరి 25 (జనం సాక్షి) : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం జాతీయ ఓటర్ల దినోత్సవం-2026 పురస్కరించుకొని తహసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది స్థానిక సీనియర్ ఓటర్లను శాలువాతో ఘనంగా సన్మానించారు. యువతతో నిర్భయంగా, కుల మత వర్గాలకు అతీతంగా, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఎన్నికల్లో ఓటు వేస్తామని అందరూ కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆవిర్భవించిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏటా ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2026 సంవత్సరానికి గాను నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు విలువను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ అనితా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్ లయన్స్ క్లబ్ కు ఎక్సలెంట్ అవార్డు

- సేవలకు గుర్తింపుగా అవార్డు లభ్యం
- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తాం
- తాండూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు శరణు బసప్ప

తాండూరు, జనవరి 25 (జనంసాక్షి) : విస్తృతంగా సేవలను కొనసాగిస్తున్న సందర్భంగా తాండూర్ లయన్స్ క్లబ్ కు ఎక్సలెంట్ అవార్డు లభించిందని తాండూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు శరణు బసప్ప పేర్కొన్నారు. ఆదివారం షాద్ నగర్ లో నిర్వహించినఇండిగో రీజియన్ మీట్. 2 ఆధ్వర్యంలో ఎక్సలెంట్ అవార్డులను ప్రకటించారు. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లా తాండూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు శరణు బసప్ప కు ఇండిగో రీజియన్ మీట్. 2 చైర్మన్ ఏ.మనోహర్ రెడ్డి చేతుల మీదుగా ఎక్సలెంట్ అవార్డు, ఎక్సలెంట్ తాండూర్ లయన్స్ క్లబ్ గా అవార్డులను ప్రదానం చేశారు. రీజియన్ పరిదిలో పన్నెండు క్లబ్ లు షాద్ నగర్ లో జరిపిన సమావేశంలో పాల్గొన్నారు. మరోవైపు తాండూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు శరణు బసప్ప ఆధ్వర్యంలో అనేక రంగాలలో విస్తృతంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. సేవలకు గుర్తింపుగా తాండూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు శరణు బసప్పకి ఎక్సలెంట్ అవార్డు దక్కింది. ఈ అవార్డు రావడం పట్ల అధ్యక్షులు సంతోషం వ్యక్తం చేస్తూ ఇండిగో రీజియన్ మీట్ చైర్మన్ ఎ. మనోహర్ రెడ్డికి, ప్రతినిధులకు



ధన్యవాదములు తెలియ జేశారు. అదేవిదంగా తాండూర్ లయన్స్ క్లబ్ ఎక్సెలెంట్ సెక్రటరీ, ఎక్సెలెంట్ ట్రేజరర్, ఎక్సెలెంట్ తాండూర్ లయన్స్ క్లబ్ గా ప్రతినిధులు సమావేశంలో ప్రకటించి వారికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా తాండూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు శరణు బసప్ప మాట్లాడుతూ బ్లడ్ డొనేషన్, హెల్త్ క్యాంపులు, మొక్కలను నాటడం, పాఠశాలకు నోట్ బుక్స్,ఉచిత ఐ క్యాంపులు, అన్నదానం, తదితర అనేక సేవా కార్యక్రమాలు నిర్వ హిస్తూ.. సేవే మార్గం ధ్యేయం గా ముందుకు కొనసాగడం జరుగుతుందని అన్నారు.

## చెడు అలవాట్లకు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దు

చేర్యాల, జనవరి 25 (జనంసాక్షి) : చెడు అలవాట్లకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని చుంచనకోట గ్రామ సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గ్రామంలో ప్రధాన చౌరస్తా వద్ద పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం, గంజాయి డ్రగ్స్, మత్తు పదార్థాలు ,గుట్కా, తంబాకు నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని, మత్తు పదార్థాలను సేవించి అనారోగ్యాల పాలై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని, గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండడమే లక్ష్యంగా మరింత ముందుకు వెళ్దామని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆగయ్య, వార్డు సభ్యులు వడ్లకొండ వెంకటేశం, మహిళా సంఘాలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# 77వ గణతంత్ర దినోత్సవం వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టాలి

నవాబుపేట్, జనవరి 25 (జనం సాక్షి) : రిపబ్లిక్ డే రోజు జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దళిత రత్న అవార్డు గ్రహీత శివరాజ్, రత్నం, అంజయ్య నవాబుపేట్ మండలం గణతంత్ర దినోత్సవం రాజ్యాంగశీ ఆత్మకు అనుగుణంగా నిర్వహించాలి అంబేద్కర్ శివరాజ్ డిమాండ్ చేశారు ఈ సందర్భంగా నవాబుపేట్ మండలం అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు నవాబు పెట్ మండలం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఆనందం, చంద్రశేఖర్,శివరాజ్ మాట్లాడుతూ ముఖ్యంగా రిపబ్లిక్ డే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని వారు సూచించారు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భారత రాజ్యాంగం అమలులోనికి వచ్చినా సందర్భంగా నిర్వహించబడతాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ విషయానీ గుర్తుంచుకోవాలన్నారు అలాంటి కార్యక్రమాలను రాజ్యాంగ రూపశిల్పి అంబేద్కర్ చిత్రపటం లేకపోవడం రాజ్యాంగానికి అవమానకరమే అన్నారు ఒకవేళ రిపబ్లిక్ డే కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటాని ఏర్పాటు చేయకపోతే అది కుల వ్యవస్థ భావజాలం అని జాలాన్ని ప్రోత్సహించి నట్లే అవుతుందన్నారు ప్రభుత్వ కార్యాలయాలు విద్యాసంస్థలు గ్రామపంచాయతీలు మండల కేంద్రాలు మాత్రమే కాకుండా అనధికారికంగా నిర్ణయించే గణతంత్ర వేడు కల్లో కూడా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలి వారు సూచించారు అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోనికి తీసుకెళ్లే విధంగా రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అంబేద్కర్ యువజన సంగం సభ్యులు నవాబు పెట్ మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఆనందం శివరాజ్, రత్నం, చంద్రశేఖర్అంజయ్య, జానీ, శ్యామ్, లక్ష్మణ్, రామచంద్రయ్య , ప్రసాద్, నర్సింలు, కిష్టయ్య, నవాబుపేట్ మండల కేంద్రంలోని అధికారులు, వివిధ పార్టీ నాయకులు మండలంలోని యువజన



సంఘాల నాయకులు సోమవారం ఉదయం 8:30. గంటలకు నవాబు పెట్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అందరూ హాజరుకావాలని కోరుతున్నాము.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
26 జనవరి 2026

# అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు

- టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్

**వనపర్తి బ్యూరో, జనవరి 25 (జనంసాక్షి) :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం జర్నలిస్టుల పక్షాన ఉంటూ టియుడబ్ల్యూజె (ఐజేయూ)పోరాటం కొనసాగిస్తుందని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ అన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రెండవ జిల్లా కార్యవర్గ సమావేశం వనపర్తి జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో జిల్లా అధ్యక్షులు మాధవరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మధు గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐజేయు పోరాట ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం 252 జీవోను విడుదల చేసిందని,జర్నలిస్టులకు మేలు చేసే విధంగా అందులో పలు సవరణలు చేయాలని యూనియన్ రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని వెల్లడించారు. త్వరలో సవరణ చేసిన జీవో విడుదల అవుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి జర్నలిస్టులకు అక్రిడేషన్లు అందే విధంగా యూనియన్ కృషి చేస్తుందని అన్నారు. ఎవరు కూడా ఎలాంటి అపోహకు గురి కావద్దని కోరారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రభుత్వం కేటాయించిన 10 గుంటల స్థలంలో జర్నలిస్టు భవన



నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అదేవిధంగా ఎమ్మెల్యేను మంత్రులను కలిసి భవన నిర్మాణం జరిగే విధంగా కృషి చేస్తామన్నారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత హెల్త్ క్యాంపులు వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరిగిందని త్వరలో పెబ్బేరులో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం మంజూరు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు యూనియన్ కృషి చేస్తుందన్నారు. ఘణపురం మండల కేంద్రంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించినప్పటికీ పట్టాలి ఇంకా పంపిణీ చేయలేదని త్వరలో ఎమ్మెల్యేను కలిసి విన్నవిస్తామన్నారు. అదేవిధంగా చిన్నంబావిలో జర్నలిస్టులకు కేటాయించిన ఇంటి స్థలాలను వారికి అందే విధంగా యూనియన్ ఆధ్వర్యంలో మంత్రి జూపల్లిని కలుస్తామన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించినప్పటికీ కొన్ని దుష్టశక్తులు అడ్డుకున్నాయని మున్సిపల్ ఎన్నికల అనంతరం వనపర్తి పట్టణ కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని అన్నారు. యూనియన్ బలోపేతం దిశగా ప్రతి ఒక్కరు పని చేయాలనీ అన్నారు. జాతీయ కౌన్సిల్ మెంబర్ మల్యాల బాలస్వామి మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా జర్నలిస్టుగా కొనసాగుతూ వృత్తిపరంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటునే యూనియన్ అభివృద్ధికి కృషి చేయడం జరిగిందన్నారు. జర్నలిస్టులు నీతి నిజాయితీతో పని చేయాలని సూచించారు. అనంతరం జాతీయ కౌన్సిల్ మెంబర్గా ఎన్నికైన మల్యాల బాలస్వామిని, సీనియర్ జర్నలిస్టు గోపాల్ ను యూనియన్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రాజు, కోశాధికారి ధ్యారపోగు మన్యం, యూనియన్ ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## బుడుగజంగం కాలనిలో నిటి సమస్య పరిష్కారం

- స్వంత నిధులతో బోరు వేయంచిన ఎమ్మెల్యే



**ఝరాసంగం, జనవరి 25 (జనం సాక్షి) :** బుడుగజంగం కాలనిలో తాగునీటి సమస్యను గుర్తించి జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు తన స్వంత నిధులతో బోరు వేయించారు. ఆదివారం ఝరాసంగం మండల కేంద్రంలోని బుడగ జంగం కాలనీ వాసులు త్రాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్ళినా ఫలితం లేకుండా పోయింది. చివరకు స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావును కలిసి సమస్యను వివరించగా వెంటనే స్పందించిన ఎమ్మల్యే కాలనీలో బోరు వేయించి ఆదివారం మోటారు బిగించి బోరును ప్రారంభించారు. బోరు వేయించి స్థానిక కాలనీ వాసుల దాహర్తి తీర్చినందుకు కాలనీ వాసులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, స్థానిక సర్పంచ్ వినోదాబాల్ రాజ్, తాజా మాజీ సర్పంచ్ బొగ్గుల జగదీశ్వర్, వార్డు సభ్యులు, నవీన్‌కుమార్, సంగమేశ్వర్, ప్రకాష్‌సింగ్, తేజమ్మ, నాయకులు సంతోష్‌కుమార్‌పటేల్, వెంకటేషం, నర్సంహాగౌడ్, ఎజాజ్‌బాబ, గడ్డం అనీల్, నాగన్న సజ్జన్‌షెట్టి, ఎంపీ నాగన్న, బస్వరాజ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా క్రమశిక్షణతో చదువుకోవాలి

- జిల్లా బీసీ అభివృద్ధి అధికారి అక్బర్ పాషా



**గద్వాల నడిగడ్డ, జనవరి 25 (జనం సాక్షి) :** రాబోయే పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా క్రమశిక్షణతో చదువుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి అక్బర్ పాషా విద్యార్థులకు తెలిపారు. శనివారం ఎర్రవల్లి మండలం ధర్మవరం గ్రామంలోని బీసీ బాయ్స్ హాస్టల్,మానవపాడు మండలంలోని మనోపాడు లోని ప్రభుత్వ హాస్టల్,వడ్డేపల్లి మండలంలోని శాంతినగర్ బీసీ బాయ్స్ హాస్టల్, బీసీ బాయ్స్ హాస్టల్ అయిజలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్లలోని విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా పరిస్థితులు, సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే వంటగదులు, హాస్టల్ ప్రాంగణాలను పరిశీలించగా,అవి పరిశుభ్రంగా మరియు చక్కగా నిర్వహించబడుతున్నట్లు గమనించారు. విద్యార్థులను రాబోయే ఎస్సెస్సీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా క్రమశిక్షణతో చదువుకోవాలని ప్రోత్సహించారు. తుది పరీక్షలు పూర్తయ్యే వరకు స్టడీ అవర్స్?ను సక్రమంగా అమలు చేయాలని, విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు పూర్తి స్థాయిలో వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సికింద్లాపూర్ లక్ష్మీ నరసింహస్వామి దర్శించుకున్న భక్తులు



**శివ్వంపేట, జనవరి 25 (జనంసాక్షి) :** మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామ శివారులో స్వయంభూగా వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలల్లో భాగంగా రెండవ వారమైన ఆదివారం ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాలతో పాటు జంట నగరాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దేవాలయంలో స్వామివారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికీ అభిషేకం, అర్చన, వ్రత మండపంలో దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతాలను పెద్ద సంఖ్యలో ఆచరించారు. అంతకుముందు భక్తులు కోనేరులో పుణ్య స్థానాలు ఆచరించి, తల నీలాలు సమర్పించి కొండపై ఉన్న దేవాలయానికి కాలినడకన చేరుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. మరికొందరు భక్తులు కొండపైన అలాగే కింది దేవాలయాల్లో స్వామివారికి ఒడిబియాలు పోసి వారి మొక్కలు చెల్లించుకున్నారు. ప్రతి సంవత్సరం ధనుర్మాసం నుంచి ఉగాది వరకు ప్రతి ఆదివారం జాతరోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ బ్రహ్మోత్సవాల భాగంగా ఆలయ పరిసరాల పరిశుభ్రతతో పాటుగా గుండం వద్ద శుచిశుభ్రత పనులు, కొండపై దేవాలయానికి భక్తులు నేరుగా చేరుకునేలా తగు ఏర్పాట్లు చేశారు. క్రింది దేవాలయంలో కూడా ఎవరికీ ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేసి తగు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని ఆలయ కార్యనిర్వాణా అధికారి శశిధర్, ఆలయ ప్రధాన పూజారి ధనుంజయ శర్మలు తెలిపారు. ఈ కార్యక్రమం లో అర్చకులు విద్యాకర్ చారి, సీనియర్ అసిస్టెంట్ నర్సింహా రెడ్డి, అర్చక బృందం, సిబ్బంది భక్తులు పెద్దసంఖ్యలో ఉన్నారు.

# తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర కళాశాల తరలింపుకు రంగం సిద్ధం..!

- ఉపాధ్యాయుల సౌకర్యం కోసమా..అక్కడి విద్యార్థుల కోరిక మేరకా..?

**చేర్యాల, జనవరి 25 (జనంసాక్షి) :** చేర్యాల ఈ పేరు ఉమ్మడి వరంగల్ జిల్లాలో నియోజకవర్గంగా, తాలూకా, రెవెన్యూ డివిజన్ గా గొప్ప అభివృద్ధిలో దూసుకుపోతున్న సమయంలో కొందరి రాజకీయ నాయకుల స్వార్థం కోసం ఈ ప్రాంతాన్ని ముక్కలుగా విడగొట్టి వారి పబ్బాన్ని గడుపుకొని అభివృద్ధి చెందుతున్న ప్రాంతాన్ని కాస్త అదో పాతాళానికి చేరే విధంగా చేసి పబ్బం గడుపుకున్నారు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత అయినా అభివృద్ధి చెందుతుంది అనుకుంటే గత ఎమ్మెల్యే ఈ ప్రాంతానికి చేసిన ద్రోహం అంతా ఇంత కాదు, ఈ ప్రాంత ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న నాయకులే తప్ప అభివృద్ధి చేస్తా అన్న నాయకుడు ఎవరూ లేరు. అరకురగా అభివృద్ధితో కొనసాగుతున్న ఈ ప్రాంతంలో కొన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు ఉండి విద్యారంగంలో కొంతవరకు ముందుకు పోతున్న తరుణంలో గత సంవత్సరం కాలం పాటు స్థానిక భవనంలో నడుస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలిక పాఠశాల, కళాశాలను జనగామ జిల్లాలోని యశ్వంతపూర్ గ్రామానికి తరలించడానికి రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.. చేర్యాల మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న ఓ భవనంలో నడుస్తున్న మహిళా డిగ్రీ కళాశాలను సిద్దిపేట జిల్లా కేంద్రానికి తరలించారు. ఖాళీ అయిన నేపథ్యంలో జనగామ జిల్లాలోని నర్మెట మండల కేంద్రంలో ఉన్న ఈ విద్యాసంస్థను గత సంవత్సరం క్రితం చేర్యాలకు తీసుకొచ్చి నడుస్తున్న క్రమంలో ఉపాధ్యాయుల సౌకర్యం కోసమో..అక్కడి విద్యార్థుల కోరిక మేరకో.. అక్కడి రాజకీయ నాయకుల మెప్పు కోసము తెలియదు కానీ మొత్తానికి అధికారుల నుంచి ఉత్తర్వులు సైతం తీసుకొచ్చి ఈ పాఠశాలను జనగామ జిల్లా యశ్వంతపూర్‌కు




తరలించడానికి రంగం సిద్ధం చేశారు. ఈ విషయమై ఈ ప్రాంత భవనాలను ఇక్కడే కొనసాగే విధంగా చూడాలని తరలింపు సమాచారంపై విద్యార్థి సంఘం నాయకులు, స్థానికులు, మేధావులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సంఘటితమే సంఘానికి శ్రీరామ రక్షా

- ఎంకే సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురోషోత్తమరావు

**శివ్వంపేట, జనవరి 25 (జనంసాక్షి) :** సభ్యులందరూ సంఘటితమైతేనే అది సంఘానికి శ్రీరామరక్షగా ఉంటుందని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు పిలుపునిచ్చారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 డైరీనీ, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా గెలుపొందిన మున్నూరు కాపు సంఘం సర్పంచ్ లకు సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం నగరం లోని సిక్ విలేజ్ శ్రీ రాజరాజేశ్వరి గార్డెన్‌లో సమావేశం ఏర్పాటు చేసీ అందులో డైరీనీ ఆవిష్కరించి, సర్పంచ్ లను శాలువ మెమెంటో లతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమ రావు, ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య, రాష్ట్ర ఉపాధ్యాయులు కల్లూరి హన్మంత్ రావు, డైరీ ఆవిష్కరణ కమిటీ చైర్మన్ మంగళారపు లక్ష్మణ్ పటేల్, డైరీ ఆవిష్కరణ కమిటీ కో-చైర్మన్ ఇసంపల్లి వెంకన్న పటేల్, మాజీ రాజ్యసభ సభ్యులు వీ. హన్మంత్ రావు, రాష్ట్ర జల నీటివనరుల సంక్షేమ సంఘం మాజీ చైర్మన్ వీ. ప్రకాష్ నూతన సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గం, జిల్లాల బాధ్యులు, నియోజవర్గ కోఆర్డినేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు మాట్లాడుతూ




త్వరలోనే జిల్లాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి సంఘం బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యల గూరించి చర్చిస్తామన్నారు. అదేవిధంగా కిందిస్థాయి నుంచి కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. ఇదే సమావేశంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ను మెదక్ జిల్లా శివంపేట మండలం ఎదుల్లాపూర్ సర్పంచ్, సంఘం రాష్ట్ర ఉపాధ్యాయులు కల్లూరి హనుమంతరావు శాలువాతో ఘనంగా సత్కరించారు.

# లక్ష్యంతో చదవితే విజయం మీదే..

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- కస్తూర్బా గాంధీ గిరిజన బాలికల విద్యాలయం ఆకస్మిక తనిఖీ

**సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 25 (జనం సాక్షి) :** విద్యార్థులు లక్ష్యంతో చదివితే విజయం మీదేనని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. ఆదివారం నారాయణఖేడ్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ గిరిజన బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, నారాయణఖేడ్ శాసనసభ్యులు సంజీవరెడ్డి, సబ్ కలెక్టర్ ఉమా హారతి ఆకస్మికంగా సందర్శించి, పాఠశాలలో అందిస్తున్న వసతులు, భోజన ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకు భోజన సమయం కావడంతో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, భోజనం రుచిగా ఉందా, ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యంగా ఉందని, మెనూ ప్రకారమే అందిస్తున్నారని విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. డైనింగ్ హాల్ లేకపోవడంతో భోజన సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... లక్ష్యంతో చదువుకుంటే అనుకున్నది సాధించవచ్చని అన్నారు. చదువుపై పూర్తి దృష్టి కేంద్రీకరించి, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. శాసనసభ్యులు సంజీవరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కార్పొరేట్ స్థాయికి దీటుగా విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ విద్యా విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి



ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు నారాయణఖేడ్ పట్టణంలోని అర్బన్ ఫారెస్ట్‌ను పరిశీలించారు. స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించి అక్కడి వసతి సౌకర్యాలు, నిర్వహణ తీరును పరిశీలించారు. గ్రంథాలయంలో సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సోమశిల సౌందర్యం పర్యాటకానికి మణిహారం

- మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్/నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జనవరి 25 (జనంసాక్షి) :** నల్లమల అడవుల మధ్య కృష్ణమ్మ ఒడిలో ఒదిగి ఉన్న సోమశిల పర్యాటక కేంద్రం ఆధ్యాత్మికతకు, ప్రకృతి ప్రేమికులకు అద్భుతమైన గమ్యస్థానమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన సోమశిల ఎకో టూరిజం పార్కును సందర్శించారు. వ్యూ పాయింట్ నుంచి కృష్ణా నది ప్రకృతి అందాలను వీక్షించారు. ఈ సందర్భంగా సోమశిల తీరం నుంచి ఎకో పార్కు వరకు మంత్రి బోటులో విహరించారు. అక్కడి ప్రకృతి అందాలను, అటవీ, పర్యాటక శాఖ కల్పిస్తున్న మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సోమశిల-శ్రీశైలం జలాశయం బ్యాక్ వాటర్స్ లో ప్రకృతి అందాలు పర్యాటక ప్రేమికుల్ని సరికొత్త అనుభూతిని కలిగిస్తాయని పేర్కొన్నారు. ఇక్కడి వ్యూ పాయింట్ వద్ద ప్రకృతి దృశ్యాలు పర్యాటకులను కట్టిపడేస్తాయని, ముఖ్యంగా ఎకో పార్కు పరిసరాల్లోకి అప్పుడప్పుడు పులులు వంటి వన్య ప్రాణులు రావడం ఇక్కడి పర్యాటకానికి మరింత ఆకర్షణను తెస్తుందని వివరించారు. తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు, దేశ విదేశీ పర్యాటకులను పెద్ద ఎత్తున ఆకర్షించేలా సోమశిలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. సోమశిల ప్రాంతం కేవలం విహారకేంద్రంగానే కాకుండా 15 శివాలయాల సముదాయంతో ఆధ్యాత్మిక క్షేత్రంగానూ అలరారుతోందని ఆయన గుర్తు చేశారు. పర్యాటకుల సౌకర్యార్థం తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ సోమశిల నుండి శ్రీశైలం వరకు ఐదు గంటల పాటు సాగే ప్రత్యేక బోటింగ్ సేవలను అందిస్తోందని, ఈ ప్రయాణంలో నదీ తీర అందాలను చూస్తూ సాగే ప్రయాణం మధురానుభూతిని కలిగిస్తుందని చెప్పారు. ఈ ప్రాంతంలో ఉన్న హరిత - మృగవాణి రిసార్ట్స్ పర్యాటకులు బస చేయడానికి అద్భుతమైన



వసతి కల్పిస్తున్నాయని, సమీపంలోని మల్లెల తీర్థం, పాలధార, పంచదార వంటి జలపాతాలు పర్యాటకులకు కనువిందు చేస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పర్యాటక సంపదను ప్రపంచానికి పరిచయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు.

## ఆదిశిలా క్షేత్రంలో ఘనంగా పవమాన హోమం

**మల్దకల్, జనవరి 25 (జనంసాక్షి) :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం మధుసూదనాచారి కుటుంబం ఆధ్వర్యంలో పవమాన హోమాన్ని వేదమంత్రాల మధ్య ఘనంగా నిర్వహించారు. అంతకుముందు శ్రీ స్వామి వారి కళ్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తంబిహళ్లి పీఠాధిపతి శ్రీ విద్యా సింధు మాధవ తీర్థులు హాజరై ఆలయ ప్రధాన అర్చకులు మధుసూదనాచారి కుటుంబాన్ని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, పట్వారి అరవింద రావు, చంద్రశేఖరరావు,బాబురావు, వెంకోబారావు,రామచంద్రారెడ్డిరాజు,రాముడుతదితరులు పాల్గొన్నారు.



## కౌన్సిలర్ దరఖాస్తులకు అపూర్వ స్పందన

- ఒక్కరోజులోనే 150 ధరఖాస్తుల స్వీకరణ
- డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మున్సిపల్ కౌన్సిలర్ ధరఖాస్తులకు అపూర్వ స్పందన లభించిందని, ఒక్కరోజులోనే 150 ధరఖాస్తులు స్వీకరించనట్లు డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం భూపాలపల్లి మున్సిపాలిటీలో కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నటువంటి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల నుండి పార్టీ బీఫామ్ కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్ మాట్లాడుతూ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు పోటీ చేసే ప్రతి వ్యక్తి దగ్గర నుండి దరఖాస్తులు స్వీకరించాలని, ఆ దరఖాస్తుల ఆధారంగా పిసిసి ఆధ్వర్యంలో సర్వే జరుగుతుందని, సర్వేలో ఎవరైతే ముందు వరుసలో ఉంటారో, పార్టీకి అంకిత భావంతో పనిచేసే వారు, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, కష్టపడి పనిచేసిన వ్యక్తులకే టికెట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎవరు ఉన్నా తొందరగా దరఖాస్తు చేసుకోవాలని, వాటిలో పరిశీలన చేసి ఒక్కో వార్డుకు ఒకరికి బీఫామ్ అందిస్తామని, మిగతావారు పార్టీ నియమా లకు కట్టుబడి పనిచేయాలని ఆయన సూచిం చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కొమురయ్య, భూపాల పల్లి బ్రాంచి ఐఎన్టీయుసీ నాయకులు పసు నూటి రాజేందర్, బేతెల్లి మధూకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ లీడర్లు వెంకీ యాదవ్, పద్మ, సమ్మయ్య, సురేష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిపేట జాతర పనుల్లో అక్రమాలు?

- చిరు వ్యాపారుల నుండి వసూళ్లు
- జాతర కమిటీ సభ్యుల మధ్య మనస్పర్ధలు
- కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు
- జాతర నిర్వహణ సరిగా జరిగేనా అనే అనుమానాలు
- స్థానిక ఎమ్మెల్యే, అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్న భక్తులు, ప్రజలు





**వరంగల్ బ్యూరో, జనవరి 25 (జనం సాక్షి) :** ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా వరంగల్ నగర సమీపంలోని అమ్మవారిపేట దామరగుట్టల వద్ద ఉన్న సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణ కొంత అయోమయంగా కనిపిస్తుంది. ఆ మధ్య స్థానిక ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు జాతర ప్రాంగణంలో అధికారులు, పోలీసులు, జాతర కమిటీ ధర్మకర్తలతో పూజారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జాతర నిర్వహణకు అందరూ సమన్వయంతో కలిసికట్టుగా పని చేసి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేసిన సంగతి తెలిసిందే. అయితే జాతర మరో రెండు రోజుల్లో ఉండగా జాతర పనుల్లో అక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం. అంతేకాకుండా జాతర ధర్మకర్తలు సభ్యుల మధ్య మనస్పర్ధలు పెరిగి గొడవలకు దిగుతున్నట్టు కూడా తెలుస్తుంది. జాతర నిర్వహణకు కావలసిన సమన్వయం లేకపోవడంతో ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి అన్నది తెలుస్తుంది. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి 20 లక్షల రూపాయలు ఎస్టిమేషన్ తోటి జాతర పనులు జరుగుతున్న క్రమంలో తాత్కాలిక లైటింగ్ కోసం సుమారు రూపాయలు 2 లక్షల 70 వేలు మంజూరైనట్టు తెలిసింది. అలాగే జాతర ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, సివిల్ పనులు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం నీటి సరఫరా పెయింటింగు మొదలైన వాటికి 6 లక్షల రూపాయల పైన నిధులు మంజూరైనట్లు కూడా సమాచారం. అయితే ఇక్కడ ఓ ప్రైవేటు మున్సిపల్ కాంట్రాక్టర్ జాతరలో మొరం పోయించేందుకు మొరం కొనుక్కొని తీసుకొచ్చి జాతర ప్రాంతంలో పోయాల్సి ఉండగా జాతర పక్కనే ఉన్నటువంటి దామెరగుట్ట పక్కన ఉన్న ఆవునూరి కుమారస్వామి వారికి సంబంధించిన వాళ్ళ ప్రైవేట్ భూముల్లో నుంచి ట్రాక్టర్ల ద్వారా మొరం ఉచితంగా తీసుకొచ్చి పోయడమే కాకుండా తమ సొంత స్థలం నుండి మొరం ఎలా తీసుకెళ్తారు అని అడిగిన ఆవునూరి కుమారస్వామిని కొందరు బెదిరించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా జాతరలో బతుకుదెరువు కోసం చిరు వ్యాపారులైనటు వారు (బొమ్మలు , మిఠాయిలు, ఇతర వస్తువులు అమ్ముకునేవారు) నుండి రూపాయలు 2 వేల నుండి పదివేల వరకు కొందరు ఇష్ట రాజ్యంగా వసూలు చేసి ఇబ్బందులు పెడుతున్నట్టు సమాచారం. ఈ విషయంలో జాతర కమిటీ సభ్యులలో కొందరు బాహటంగా విమర్శిస్తున్నారు. అంతేకాకుండా తమకు తెలియకుండా తమ ప్రైవేటు స్థలంలో జాతర కమిటీ బాధ్యులు 40 వేల రూపాయలు తీసుకొని అక్రమంగా బెల్ట్ షాపు ఏర్పాటు చేస్తున్నారని కొందరు స్థల యజమానులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. మొత్తంమీద అమ్మవారిపేట జాతర నిర్వహణ ఆయమయంగా మారింది. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ఉంది. అందిన కాడికి దోచుకుందాం అన్నట్టుగా తయారైంది. ఈ విషయంలో సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని జాతరలో ఎలాంటి అక్రమాలు, అసౌకర్యాలు లేకుండా చూడాలని ఈ సందర్భంగా అమ్మవారిపేట జాతరకు వచ్చే భక్తులు ప్రజలు కోరుతున్నారు.

## హనుమకొండలో బంజారా ఆత్మీయ సమ్మేళనం

- పాల్గొన్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**హనుమకొండ ప్రతినిధి, జనవరి 25 (జనంసాక్షి) :** హనుమకొండ బస్టాండ్ సమీపంలోని శ్రీహర్ష కన్వెన్షన్ హాల్ నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా బంజారా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై బంజారా గోత్ర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్యం రంగాల్లో బంజారా సమాజం మరింత ముందుకు రావాలని ఆకాంక్షించారు. తరతరాలుగా బంజారా సమాజం తన ప్రత్యేకమైన భాష, వేషధారణ, నృత్యాలు, పండుగలు, ఆచార సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగడం అభినందనీయమని తెలిపారు. బంజారా గోత్ర క్యాలెండర్ ఆవిష్కరణ ద్వారా యువతకు బంజారా సంస్కృతి, చరిత్రపై అవగాహన మరింత పెరుగుతుందని, ఇది గిరిజన వారసత్వాన్ని రాబోయే తరాలకు అందించే మంచి ప్రయత్నమని ఎంపీ అన్నారు. సామాజిక ఐక్యత, పరస్పర గౌరవం, సాంస్కృతిక విలువలే దేశ బలమని పేర్కొంటూ, ఇలాంటి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు సమాజాన్ని ఏకం చేసే వేదికలుగా నిలుస్తాయని చెప్పారు. బంజారా సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎంపీ డా. కడియం కావ్య భరోసా ఇచ్చారు. హనుమకొండ లోని గిరిజన భవన అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోరిక వీరన్న నాయక్, సంగెం మాజీ జెడ్పిటిసి వీరమ్మ, రిటైర్డ్ డిఈఓ జవహర్ లాల్ నాయక్, డీఎంహెచ్వో రవిరాథోడ్, రిటైర్డ్ ఆర్ జె డి వెంకట్రాం, మరియు భోజ్ నాయక్, డాక్టర్ రమేష్ నాయక్, వెంకట్ నాయక్,సర్పంచ్ బానోతు అరుణ రాజేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, అర్హత కలిగిన ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన 16వ జాతీయ ఓటరు దినోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, ఓటు హక్కు ద్వారా ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయగలరని పేర్కొన్నారు. యువత ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకొని ప్రతి ఎన్నికలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా కొత్తగా నమోదైన ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు అందజేయడంతో పాటు, సీనియర్ సిటీజన్ ఓటరులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన బిఎల్ఓ, సూపర్ వైజర్లు, ఆపరేటర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఓటరు అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. అనంతరం ఓటు హక్కు నమోదు, వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. తదుపరి విద్యార్థులచే ఓటు హక్కు అవగహనపై సైకిల్ ర్యాలీ ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి..

77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై రెవెన్యూ, విద్యా, సమాచార అధికారులతో చాంబర్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు(సోమవారం) జిల్లాలోని డా.బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుగనున్నాయని పేర్కొన్నారు. ఈ వేడుకలకు జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమాలు మినిట్ టు మినిట్ జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ హరికృష్ణ, డిపిఆర్వో శ్రీనివాస్, డీఈఓ రాజేందర్, కలెక్టరేట్ ఏఓ మురళీధర్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



## గుడ్డులో పోషకాలు ఎక్కువ

- మాజీ మంత్రి దయాకర్ రావు

**పాలకుర్తి, జనవరి 25(జనంసాక్షి)** అత్యధిక పోషకాలు ఉండే ఆహారం గుడ్డు అని, ఇది అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జాతీయ ఎగ్ కోర్డినేషన్ కమిటి (ఎస్ఈసీసీ) సహాకారంతో 25 మంది చిరువ్యాపారులకు ఎగ్ కార్డులను అందచేశారు. ఈ సందర్భంగా దయాకర్ రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 110 మంది చిరు వ్యాపారులను గురించి ఎగ్ కార్డులను అం దచేస్తున్నట్లు తెలిపారు. పాలకుర్తిలో 25 మంది చిరు వ్యాపారులకు ఎగ్ కార్డులను ఆందచేసినట్లు వెల్లడించారు. ఈ కార్డులను చిరు వ్యాసారులు ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు గుడ్డును తీసుకోవచ్చని అన్నారు. అన్ని రకాల రోగాల నుంచి కాపాడే వ్యాధి నిరోధకతను పెపొందించే పోషకాలు గుడ్డులో పుష్కలంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కమ్మగాని విజయ, పసులాది యాకస్వామి, మహేందర్ నాయక్, అనిత, రేణుక, నాయకులు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నవీన్, సోమేశ్వరరావు, ధనుంజయ, నక్క నగన్న, గణపురం సురేష్, గూడ దామోదర్, కమ్మగాని నాగన్న, గాదెపాక కిరణ్, చింతకింది ఉపేందర్, సతీష్, కత్తి దస్తగిరి పాల్గొన్నారు.

## జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహణ




**వరంగల్ ప్రతినిధి, జనవరి 25 (జనంసాక్షి):** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లాలో విస్తృత స్థాయిలో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బల్దియా కార్యాలయం నుండి ఐఎంఏ హాల్ వరకు ర్యాలీలు నిర్వహించగా, విద్యార్థులతో కలిసి ఎంజీఎం సర్కిల్ వద్ద మానవహారం, ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాలు చేపట్టి ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ స్లొగన్స్, ప్లే కార్డుల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జిడబ్ల్యు ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్పేయి, కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రం, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, ఆర్డీవో వరంగల్ సుమ, స్వీప్ నోడల్ అధికారి, డీఎస్డీవో భాగ్యలక్ష్మి పాల్గొని ఓటు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో, ఓటరు అవగాహన కార్యక్రమాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో ఓటు హక్కు ప్రాధాన్యతపై చైతన్యం కల్పించినందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గారికి ఈ రోజు గవర్నర్ చేతుల మీదుగా విశిష్ట పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం కలెక్టర్ గారికి ప్రత్యేక అభినందనలు తెలిపింది. కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ వి. రామచంద్రం ముఖ్య అతిథిగా పాల్గొని 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950లో జాతీయ ఎన్నికల సంఘం ఏర్పాటు చేయడం జరిగిందని, దాని పురస్కారంగా 2011 నుంచి ప్రతి సంవత్సరం జనవరి 25ను జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ ఏడాది "మై ఇండియా మై లవ్ " అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.ఓటు అనేది ప్రజాస్వామ్య విలువలను పెంపొందించే శక్తివంతమైన ఆయుధమని, ఓటుకు అమ్ముకుని వ్యక్తిత్వాన్ని తాకట్టు పెట్టే పరిస్థితులు రావద్దని హెచ్చరించారు. రాబోయే ఐదు సంవత్సరాల రాష్ట్ర భవిష్యత్ ప్రతి ఓటరు చేతుల్లోనే ఉందని, నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించి తమ ప్రాంతం, గ్రామం, మండలం, జిల్లా అభివృద్ధిలో ముందంజలో నిలిచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడంలో బీఎల్ఓల పాత్ర కీలకమని, ఓటరు జాబితాలో పొరపాట్లు సరిదిద్దడం, మరణించిన వారి పేర్లు తొలగించడం, చిరునామా మార్పులు నవీకరించడం వంటి పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. జడ్పీ సీఈఓ రాంరెడ్డి, డిఆర్ఓ విజయలక్ష్మి, స్వీప్ నోడల్ ఆఫీసర్, డీఎస్డీవో భాగ్యలక్ష్మి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఖిలా వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, ఎల్డీఎం రాజు, ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులు పుష్పితాలయం అందించగా, బీఎల్ఓలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర గవర్నర్ చే జిల్లా కలెక్టర్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు


- ఎన్నికల నిర్వహణలో ఉత్తమ కృషికి ఘన గుర్తింపు..



**వరంగల్ ప్రతినిధి, జనవరి 25( జనంసాక్షి):** జాతీయ ఓటర్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్లను ఆకర్షించే విధంగా గ్రీన్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వినూత్న ఓటర్ అవగాహన కార్యక్రమాల అమలు ద్వారా ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచినందుకు గాను ఈ రాష్ట్ర స్థాయి అవార్డు వరంగల్ జిల్లాకు లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని ప్రశంసలు వెల్లువెత్తాయి. కలెక్టర్ డా. సత్య శారదకు అధికారులు, సిబ్బంది హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## భక్తులకు అసౌకర్యం కలిగించవద్దు

- రామప్ప దుకాణదారులకు ఎస్ఐ కౌన్సిలింగ్
- 320 పోలీసు సిబ్బందితో రామప్పలో భారీ భద్రత



**ములుగు/వెంకటాపూర్, జనవరి 25 (జనంసాక్షి):** రామప్పలో చిరు దుకాణదారులు దేవాలయానికి దర్శించుకునే భక్తులకు ఎటువంటి అసౌకర్యానికి గురి చేయవద్దని ఎస్సై చల్ల రాజు కోరారు.ఆదివారం దుకాణదారులతో మాట్లాడుతూ రోడ్డుమీద ఇరువైపులా ఆటో రిక్షాలు,తోపుడుబండ్ల ద్వారా దుకాణాలను ఏర్పాటు చేసుకుని భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వాటిని తొలగించారు.మళ్లీ పునరావృతం అయితే కేసులు నమోదు చేసి చట్టరీత్య చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. మేడారం జాతర సందర్భంగా రామప్పలో లక్షల మంది భక్తులు వస్తారని అందుకోసం 320 పోలీసు సిబ్బందితో పాటు ఒక డిఎస్పి, నలుగురు సిఐలు, 12మంది ఎస్ఐ,లతో భారీ భద్రత ఉంటుందని ఎస్ఐ పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.ఆదివారం సాయంత్రం నుండి పోలీస్ సిబ్బంది విధులలో పాల్గొంటారని అన్నారు. భక్తుల భద్రత దృశ్య రామప్ప చెరువు కట్ట మీదికి అనుమతి లేదని ఎస్ఐ చల్లరాజు తెలిపారు.

## భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం

- అభివృద్ధిపై దుష్ప్రచారం చేస్తే నమ్మొద్దు
- శిలాఫలకాలను ధ్వంసం చేయాల్సిన అవసరం మాకు లేదు
- బీఆర్ఎస్ నేతలు రాజకీయ పబ్బం గడుపుతున్నారు
- సుభాష్ కాలనీ, రాజీవ్ నగర్ కాలనీలల్లో పల్లె దవాఖానాల ప్రారంభోత్సవాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, అభివృద్ధిపై కొంతమంది బీఆర్ఎస్ నేతలు చేస్తున్న దుష్ప్రచారాలను భూపాలపల్లి ప్రజలు నమ్మొద్దని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు మీకు గుండు సున్నా వేయడం ఖాయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎద్దేవా చేశారు. భూపాలపల్లి మున్సిపాలిటీ లోని సుభాష్ కాలనీ , రాజీవ్ నగర్ కాలనీలల్లో ఎన్ హెచ్ ఎం నిధులు రూ.40 లక్షలతో కొత్తగా నిర్మించిన పల్లె దవాఖాలను ఆదివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ ఇతర నేతలు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న ఈ రెండున్నరేళ్ల కాలంలో చేసిన, చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల మద్దతుతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే ఉద్దేశంతోనే నిరాధార ప్రచారాలు చేస్తున్నారన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనలో గణనీయమైన పురోగతి సాధించామని పేర్కొన్నారు. ఈ అభివృద్ధిని ప్రజలు ప్రత్యక్షంగా చూస్తుండటంతోనే, రాజకీయ లబ్ధి కోసం కొందరు అసత్య ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, ఆధారాల్లేని ఆరోపణలను ప్రజలు నమ్మబోరని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అభివృద్ధి ప్రయాణం ఇలాగే కొనసాగుతుందని, భూపాలపల్లిని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు తాను కట్టుబడి ఉన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అబద్దాలను ప్రచారం చేస్తూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్న వారికి భూపాలపల్లి మునిసిపాలిటీలోని 30 వార్డుల ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే అన్నారు.

### భూపాలపల్లి బస్టాండ్ లో మేడారం బస్సు పాయింట్ ప్రారంభం

భూపాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ లో మేడారం బస్సు పాయింట్ ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, డిపో మేనేజర్ ఇందూ తో కలిసి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూపాలపల్లి డిపో నుండి మొత్తం 80 సర్వీసులు మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు నడుపుతున్నట్లు తెలిపారు. మొత్తం నాలుగు పాయింట్లు భూపాలపల్లి నుండి 40 బస్సులు, సిరొంచ నుండి 20 బస్సులు, కాటారం నుండి 10 బస్సులు, కాళేశ్వరం నుండి 10 బస్సు సర్వీసులు నడుస్తున్నట్లు తెలిపారు.జాతరకు వెళ్ళే భక్తులు ఆర్టీసీ సేవలు తప్పక సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరకాల భూపాలపల్లి డిపోలు సంయుక్తంగా చిట్యాల, గణపురం , రేగొండలో బస్సు పాయింట్లు ఏర్పాటు చేస్తున్నాయని, మేడారం వెళ్లే భక్తులకు మహాలక్ష్మి పథకం కూడా వర్తిస్తుందని భక్తులు అమ్మవార్లను దర్శించుకుని సురక్షితంగా ఇంటికి చేరాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైద్యాధికారులు, మాజీ కౌన్సిలర్ ముంజాల రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ లీడర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కర్ల రాజేష్ మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్

**హుజూర్‌నగర్, జనవరి 25 (జనంసాక్షి) :** కర్ల రాజేష్ మృతి కేవలం పోలీసుల అక్రమ నిర్బంధం వల్లే జరిగిందని, కర్ల రాజేష్ మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం హుజూర్ నగర్ పట్టణంలోని పద్మశాలి భవనంలో నిర్వహించిన అఖిలపక్ష నాయకుల సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ కోదాడ పట్టణానికి చెందిన కర్ల రాజేష్ మృతికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని బాధితుల తరపున నాయకులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై తక్షణమే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (ఎస్ఐటి) ఏర్పాటు చేసి పోలీస్ శాఖ గౌరవాన్ని కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

### దర్యాప్తులో పారదర్శకత ఉండాలి

ఈ కేసు విచారణలో పారదర్శకత ఉండాలంటే, సూర్యాపేట జిల్లాకు చెందిన ఏ ఒక్క పోలీస్ అధికారి (హోంగార్డ్ నుండి ఎస్పీ వరకు) సిట్ బృందంలో ఉండకూడదని వారు డిమాండ్ చేశారు. ఇతర జిల్లాలకు చెందిన నిష్పక్షపాత అధికారులతో విచారణ జరిపించాలని డిజిపిని కోరారు. అలాగే, ప్రభుత్వం బాధ్యత తీసుకొని ఈ ఘటనపై జుడిషియల్ ఎంక్వయిరీ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మౌనం వీడాలి



సూర్యాపేట జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని వారు ప్రశ్నించారు. గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఆయన ఉన్నప్పుడు, ఆయన గెలుపు కోసం తామంతా ఎంతో కృషి చేశామని గుర్తు చేశారు. గతంలో మరియమ్మ లాకప్ డెత్ జరిగినప్పుడు ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి పోలీసుల అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడామని, గవర్నర్ , ముఖ్యమంత్రికి లేఖలు కూడా రాశామని పేర్కొన్నారు. అప్పుడు స్పందించిన మంత్రి, ఇప్పుడు తన సొంత జిల్లాలో ఒక యువకుడు మృతి చెందితే ఎందుకు ఖండించడం లేదని మండిపడ్డారు.

### కుల వివక్షపై ఆరోపణలు

రాజేష్ మృతికి కారణమైన ప్రధాన నిందితుడు సురేష్ రెడ్డిని కాపాడే ప్రయత్నం జరుగుతోందని వారు ఆరోపించారు. "బీసీ"సామాజిక వర్గానికి చెందిన సీఐని వెంటనే సస్పెండ్ చేసిన అధికారులు, ప్రధాన నిందితుడు ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. అదేవిధంగా, స్థానిక ఎమ్మెల్యే పద్మావతి కూడా ఈ ఘటనపై ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకరమన్నారు.

### ప్రధాన డిమాండ్లు..

సురేష్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి. బాధితులకు ప్రభుత్వం అండగా ఉండి న్యాయం చేయాలి. ఒకవేళ ప్రభుత్వం త్వరితగతిన స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శానంపూడి సైదిరెడ్డి, బొబ్బ భాగ్యరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు జక్కుల నాగేశ్వరావు, బెల్లంకొండ అమర్ గౌడ్, బీసీ జిల్లా నాయకులు ధూళిపాళ శ్రీనివాస్, సిపిఐ, సిపిఎం నాయకులు పల్లె వెంకట్ రెడ్డి, మురళి, ఏం ఆర్ పీఎస్, ఏం ఎస్పీ సూర్యాపేట జిల్లా ఇంచార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి, ఏపూరి రాజు, హుజూర్ నగర్ నియోజకవర్గ ఇంచార్జీ బచ్చలకూరి ప్రసాద్, ఏం ఆర్ పీఎస్ పట్టణ అధ్యక్షుడు మంద నాగరాజు, సీనియర్ నాయకులు, చింత్రియాల నాగయ్య, రేడపంగు వెంకటేశ్వర్లు, ఎం జె ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఒగ్గు విశాఖ, చింత్రియాల బాల చంద్రుడు, మంద వెంకటేశ్వర్లు, యడవల్లి చంద్రయ్య, ఇంజమూరి మల్లయ్య, మీసాల శరత్, ఎం ఎస్ పి గుండె పశీగు బాబు, మండలాల అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు యాతవకిలరాజయ్య, బకరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వాస్తవాలు ప్రతిభింబించే పత్రిక "జనంసాక్షి"

- జనంసాక్షి ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాల అంచనాలు ఎప్పుడూ తప్పు కాలేదు..
- ఎస్ఐ మేడా ప్రసాద్



**బూర్గంపహాడ్, జనవరి 25 (జనంసాక్షి) :** వాస్తవాలు ప్రతిభింబించే దిన పత్రిక జనంసాక్షి ఒక్కటేనని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న స్వరాష్ట్ర సమరయోధ దినపత్రిక జనంసాక్షి పత్రికని స్థానిక ఎస్సై మేడ ప్రసాద్ అన్నారు. 'జనంసాక్షి' దిన పత్రిక 2026 సంవత్సర క్యాలెండర్ ను స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్ ఐ మేడా ప్రసాద్, అదనపు ఎస్ఐ నాగబిక్షం, బూర్గంపహాడ్ ఉపసర్పంచ్ గుండె వెంకన్న, నియోజకవర్గ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, బూర్గంపహాడ్ ప్రెస్ క్లబ్ కార్యదర్శి సీనియర్ పాత్రికేయులు గుద్దేటి ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజా సమస్యలను వెలికి తీయడంతో పాటు రాజకీయ పార్టీల సర్వేలలో నిష్పక్షపాతంగా ఫలితాలను ముందుగానే బయట పెట్టేది జనంసాక్షి పత్రికేనని అన్నారు. జనంసాక్షి ఫలితాల అంచనాలు ఎప్పుడూ తప్పు కాలేదని, ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో నిర్వహించిన సర్వేలో జనంసాక్షి సర్వే ఫలితాలు మరోసారి రుజువు చేశాయన్నారు. నిష్పక్షపాతంగా వార్తలు సేకరిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనంసాక్షి దినపత్రిక పాత్రికేయులు శ్రీనివాసచారి పాల్గొన్నారు.

## కల్లూరులో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఉత్సాహంగా జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు



**కల్లూరు, జనవరి 25 (జనం సాక్షి) :** కల్లూరు మండల తాసిల్దార్ పులి సాంబశివుడు, ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖకు చెందిన పలువురు అధికారులు కార్యాలయ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు ,పాఠశాల విద్యార్థుల తో కలసి తాసిల్దార్ కార్యాలయం నుంచి యన్ ఎస్ పి వరకు ఆదివారం ఉత్సాహంగా 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎన్నికలలో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థులకు ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ సుజాత, పలువురు అధికారులతో పాటు వివిధ శాఖలకు సంబంధించిన సిబ్బంది అంగన్వాడీ టీచర్లు, పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

**హాలియా, జనవరి 25 (జనం సాక్షి) :** హాలియా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి సహకారంతో, రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, జిల్లా ఇంచార్జి పొన్నం తరుణ్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి ఆదేశానుసారం ఈ సమావేశం జరిగింది. నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్రెడ్డి భాను చందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో త్వరలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులు కాంగ్రెసు అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని తీర్మానించారు. అదేవిధంగా మండల స్థాయిలో యువజన కమిటీలు, గ్రామ స్థాయిలో బూతు కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉపాధి హామీ పథకంలో మహాత్మా



గాంధీ పేరు తొలగించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం యువజన కాంగ్రెస్ తరపున సర్పంచులుగా, వార్డు సభ్యులుగా ఎన్నికై విజయం సాధించిన వారికి సన్మానం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మేకల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కమతం జగదీశ్ రెడ్డి, అయితగోని మధు గౌడ్, అలుగుబెల్లి సందీప్ రెడ్డి, వసంత్ కుమార్, మండల యువజన అధ్యక్షులు బొంగరాల జానయ్య, కొత్త నాగరాజు, వేణు గౌడ్, రేపాకుల సాయి, బొమ్ము సాయి, సోషల్ మీడియా ఇంచార్జి మద్దాల భాను, పోలె మధు, కట్ట రాకేష్ రెడ్డి, వల్కి ప్రభాకర్, ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు ఎడవల్లి రంజిత్, అజ్జు, మహేష్ యాదవ్, వేణు, కొండా మధు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలల హక్కుల రక్షణే ధ్యేయం



**చౌటుప్పల్, జనవరి 25 (జనం సాక్షి) :** సమాజంలో బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలలపై జరుగుతున్న హింసను అరికట్టడమే తమ ప్రధాన ధ్యేయమని స్కోప్ స్వచ్ఛంద సంస్థ జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్' ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వి. సోమ నరసయ్య అన్నారు. స్కోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్' ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాలల రక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముందస్తు సమాచారంతో అనేక వివాహాలను అడ్డుకుని బాలికలకు పునరావాసం కల్పించామన్నారు. పనుల్లో ఉన్న పిల్లలను విడిపించి తిరిగి పాఠశాలల్లో చేర్పించామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాలల హక్కులపై నిరంతరం చైతన్యం తీసుకువస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, నరసింహారాజు, యాదయ్య, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించండి



**కూసుమంచి, జనవరి 25 (జనం సాక్షి) :** రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించినట్లయితే రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని ఎస్ఐ దివ్యశ్రీ సూచించారు. ఆదివారం రోజున రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో నిర్వహించిన భద్రతా వారోత్సవాల శిబిరాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క పౌరుడు తమ వాహనాన్ని ఉపయోగించే ముందు రోడ్డు భద్రత నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని దానిలో భాగంగా తలకు హెల్మెట్, వాహనానికి నంబర్ ప్లేట్, వాహనానికి ఇన్సూరెన్స్ తప్పకుండా ఉండాలని నంబర్ ప్లేట్ ఉండడం వలన చైన్స్ దొంగతనం చేసే వాళ్ళని ఈజీగా గుర్తుంచడానికి వీలవుతుందని అలాగే మైనర్ యువకులకు తమ వాహనాలను ఇచ్చినట్లయితే ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే దానికి పూర్తి బాధ్యత ఆ వాహనదారుడే బాధ్యత వహించాల్సి వస్తుందని వాహనదారులతోపాటుగా వాహనం నడిపిన యువకుల పై కూడా కేసులు నమోదు అవుతాయని ఆమె భద్రతా శిబిరాన్ని ఉద్దేశించి తెలిపారు ఎప్పుడైనా ఎక్కడైనా ప్రమాదం జరిగితే ప్రాణ నష్టం జరగకుండా విధిగా వెంటనే వైద్య సేవల కోసమై వారి కుటుంబానికి మరియు 108 కి ఫోన్ చేసినట్లయితే ప్రమాదాలు నివారించవచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కంచరి సైదమ్మ కొండల్, ఉప సర్పంచ్ మారోజు భీష్మాచారి, మండల పరిషత్ మాజీ సభ్యులు కొమురవెల్లి ఆలింగా గోవిందరెడ్డి, మండల పరిషత్ మాజీ సభ్యులు సింగం దామోదర్, కంచరి కొండల్ గొల్లపూడి వీరన్న, కంచర్ల నరేందర్ రెడ్డి కూసుమంచి ఠానా సిబ్బంది శ్రీను, బ్రహ్మం, రమేష్ మరియు గ్రామ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా 16వ జాతీయ ఓటర్ దినోత్సవం

**మణుగూరు, జనవరి 25 (జనం సాక్షి) :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుని అత్యంత విలువైన హక్కు. మనం వేసే ఒక్క ఓటే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తహసిల్దార్ అద్దంకి నరేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు విద్యార్థులు అధికారులు ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ... జాతీయ ఓటర్ దినోత్సవం మనకు మన బాధ్యతను గుర్తుచేసే రోజు. ఓటు హక్కును వినియోగించుకోవడం మాత్రమే కాదు, అది నిజాయితీగా, భయమూ, ప్రలోభాలూ లేకుండా వినియోగించడమే నిజమైన ప్రజాస్వామ్యం. ముఖ్యంగా యువత ముందుకు వచ్చి ఓటరుగా నమోదు చేసుకుని ప్రతి ఎన్నికలో




తప్పకుండా ఓటు వేయాలి. అప్పుడే బలమైన, పారదర్శకమైన పాలన సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిటి (ఎన్నికలు) అనూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఎంపీఓ వెంకటేశ్వర రావు, డిటి రామారావు, ఆర్ ఐ గోపి, రెవిన్యూ సిబ్బంది ఎస్సై, కానిస్టేబుల్స్, మరుగురు మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, టౌన్ ప్రెసిడెంట్ శివ సైదులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బొల్లం దిష్టిబొమ్మ దగ్ధం

- గుడిబండలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన..
- హద్దు మీరితే సహించం, ఖబర్దార్ బొల్లం
- బొల్లంకు తూమాటి నాగిరెడ్డి హెచ్చరిక



**కోదాడ, జనవరి 25 (జనం సాక్షి) :** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గుడిబండలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. సీనియర్ నాయకులు తూమాటి నాగిరెడ్డి నేతృత్వంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కోదాడ, మేళ్లచెరువు రహదారిపై బొల్లం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు సరికాదని, సభ్య సమాజం తలదించుకునేలా బొల్లం మాట్లాడటం విచారకరమన్నారు. తక్షణమే ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని కాంగ్రెస్ శ్రేణులు హెచ్చరించారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించే దమ్ము లేకనే బొల్లం ఇటువంటి నీచమైన రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యక్తిత్వాన్ని విమర్శించే స్థాయి బొల్లంకు లేదని ఎద్దేవా చేశారు. మరలా ఇటువంటివి పునరావృతం అయితే ఖబర్దార్ అంటూ గట్టిగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరుకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి,కుక్కడపు నాగరాజు గౌడ్, పులి వెంకటేశ్వర్లు, వాచేపల్లి వెంకటేశ్వర రెడ్డి, నరోత్తం రెడ్డి, నర్సిరెడ్డి, సిద్దయ్య, రాములు, వీరారెడ్డి, అఖిల్, పవన్, కుమార్ హేమంత్ అసన్ హాలీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం పీర్సీని వెంటనే అమలు చేయాలి

- రాష్ట్ర ఆడిట్ కమిటి కన్వీనర్ జె.యాకయ్య



**భువనగిరి, జనవరి 25 (జనం సాక్షి) :** పిఆర్సీ కమిటీ వేసి రెండున్నరు సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ కమిటీ నివేదిక తెప్పించికొని ప్రభుత్వం అమలు చేయకపోవడం సరైన విధానం కాదని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే అమలు చేయాలనీ ఈరోజు భువనగిరిలోనే గోపి విజ్ఞాన కేంద్రంలో జరిగిన టీఎస్ యుటిఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొనిన టి ఎస్ యు టి ఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటి కన్వీనర్ జె యాకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జి వో 25 ను సవరించిన తర్వాతనే రేషన్లైజేషన్ అమలు చేయాలని, బిల్లుల బకాయిలను వెంటనే చెల్లించాలని, డి ఏ బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ముక్కెర్ల యాదయ్య, ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు, ఉపాధ్యక్షులు కే మమత కోశాధికారి బి ముత్యాలు, జిల్లా కార్యదర్శులు డి స్వామి, పి వెంకటరెడ్డి కె రవికుమార్, జివి రమణారావు , కెబివి మేరీ, సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణరక్షణే పరమావధిగా వైద్య సేవలు

- యశోద ఆసుపత్రి సేవలు-ఓ రోగికి పునర్జన్మనిచ్చింది

**కనగల్లు, జనవరి 25 (జనం సాక్షి) :** క్లిష్టమైన విపుల్ శస్త్ర చికిత్స ద్వారా హైదరాబాదులోని మలకపేట యశోద ఆసుపత్రిలో రోగి ప్రాణాలను కాపాడినట్లు యశోద హాస్పిటల్ వైద్య బృందం తెలిపారు.ఆదివారం మనోరమ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ శ్రీపతి మాట్లాడుతూ.. శాస్త్ర చికిత్స కు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ జిల్లాలోని షాపల్లికి గ్రామానికి చెందిన ఉపేందర్ అనే వ్యక్తికి ఇమేజింగ్ , ప్యాంక్రియా సిస్ వల్ల తల భాగంలో గడ్డ ఏర్పడి విత్తనాలం ఒత్తిడికి లోనై పిత్తరసం ఆగిపోయినట్లు తెలియజేశారు. ఈ వ్యాధి తీవ్రతతో అబ్స్ట్రాక్టివ్ జాండీస్ ఏర్పడి రోగికి టైప్ 2 డయాబెటిస్ హైపర్ టెన్షన్ స్వాత శ్వాస సంబంధించిన సమస్యలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో గ్యాస్ట్రోఎంటరాలజీ , అంకాలజీ, అనస్తీసియా వైద్య బృందం ఒక నిర్ధారణకు వచ్చి ఇందుకుగాను విపుల్ శస్త్ర చికిత్స మార్గమని భావించి రోగి ప్రాణాలను కాపాడేందుకు అణస్తీసియా ఇచ్చి ప్యాంక్రియా టికోడ్యూడే నెక్టమి నిర్వహించి క్లిష్టమైన పరిస్థితిలో శస్త్ర చికిత్స చేసి తల భాగంలో ఉన్న గడ్డతోపాటు పిత్తనాలను తొలగించినట్లు పేర్కొన్నారు. సాధసాధారణంగా ప్యాంక్రియాస్ (అగ్నాశయం) సంబంధిత వ్యాధులు ప్రారంభ దశలో ఎక్కువగా లక్షణాలు చూపించకపోయినా, కీలక అవయవాలను ప్రభావితం చేసినప్పుడు అకస్మాత్తుగా ప్రాణాపాయ స్థితికి దారి తీస్తాయన్నారు. ముఖ్యంగా ప్యాంక్రియాస్ తల భాగంలో ఏర్పడే గడ్డ లేదా కణితి, కాలేయం నుంచి పిత్తరసం ప్రవహించే నాళాన్ని అడ్డుకోవడం వల్ల అబ్ స్ట్రక్టివ్ జాండీస్ ఏర్పడుతుందని తెలిపారు. ఈ పరిస్థితిని సకాలంలో గుర్తించి చికిత్స చేయకపోతే తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, అవయవ వైఫల్యం, కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం కూడా సంభవించే అవకాశం ఉంటుందని అన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో తొందరగా నిర్ధారణ, ఆధునిక ఇమేజింగ్ పరీక్షలు మరియు సమయానికి జరిగే క్లిష్టతరమైన శస్త్రచికిత్సే ప్రాణాలను కాపాడ గలగడమే మార్గమని, ఇలాంటి అత్యంత క్లిష్టమైన మరియు అధిక ప్రమాద స్థితిలో, యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్?పేట్ వైద్యులు ఒక మధ్య వయస్కుడైన రోగి ప్రాణాలను విపుల్ ప్యాంక్రియాటికోడ్యూడెనెక్టమీ అనే అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా కాపాడినట్లు



తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి మరియు ముందే ఉన్న ఇతర వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ఐసీయూలో ఉంచి సన్నిహిత పర్యవేక్షణ చేస్తున్న సందర్భంలో శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తడంతో వెంటిలేటర్ సహాయం, ఆక్సిజన్ థెరపీ, యాంటీబయోటిక్స్, నొప్పి నివారణ, పోషకాహార సహాయం మరియు నిరంతర క్రిటికల్ కేర్ అందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర, ఎ. వాసుకిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







## కోటక్ మహీంద్రా బ్యాంక్ లాభం రూ.3,446 కోట్లు

**ఢిల్లీ:** కోటక్ మహీంద్రా బ్యాంక్ 2025-26 అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో రూ.3,446 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని ప్రకటించింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.3,305 కోట్లతో పోలిస్తే ఇది 4 శాతం ఎక్కువ. ఇదే కాలంలో మొత్తం ఆదాయం రూ.16,050 కోట్ల నుంచి రూ.16,741 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.13,428 కోట్ల నుంచి రూ.13,903 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.7,196 కోట్ల నుంచి రూ.7,565 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 4.93 శాతం నుంచి 4.54 శాతానికి తగ్గింది. ఏకీకృత ప్రాతిపదికన బ్యాంక్ లాభం రూ.4,701 కోట్ల నుంచి 5 శాతం పెరిగి రూ.4,924 కోట్లకు చేరింది.ఆస్తుల నాణ్యతకొస్తే స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.5 శాతం నుంచి 1.3 శాతానికి మెరుగైంది. నికర ఎన్పీఏ నిష్పత్తి సైతం 0.41 శాతం నుంచి 0.31 శాతానికి తగ్గింది. కేటాయింపులు మాత్రం రూ.794 కోట్ల నుంచి రూ.810 కోట్లకు పెరిగాయి. బ్యాంక్ మూలధన కనీస నిష్పత్తి 22.79 శాతం నుంచి 22.63 శాతానికి చేరింది. 2025 డిసెంబరు 31 నాటికి మొత్తం ఖాతాదార్ల ఏయూఎం (నిర్వహణలోని ఆస్తులు) రూ.7,87,950 కోట్లకు చేరింది. ఏడాది క్రితం ఇదే సమయంలో ఇవి రూ.6,85,134 కోట్లుగా ఉన్నాయి.'క్రెడిట్ కార్డు విభాగంలో వార్షిక ప్రాతిపదికన ప్రతికూల వృద్ధి నమోదైంది. మొత్తం వ్యాపారాన్ని సమీక్షిస్తున్నాం. కొత్త ఉత్పత్తులు ఆవిష్కరిస్తున్నాం. నిర్మాణ సామగ్రి పరిశ్రమ నెమ్మదించింది. పరిశ్రమ స్థాయిలోనే మా వృద్ధి కూడా నమోదైంది. స్టాండర్డ్ ఛార్టర్డ్ నుంచి కొనుగోలు చేసిన వ్యక్తిగత రుణ పోర్ట్‌ఫోలియో ఊహించిన దాని కంటే మెరుగ్గా ఉంద'ని కోటక్ మహీంద్రా ఎండీ, సీఈఓ అశోక్ వాస్వానీ ఫలితాలు ప్రకటించిన అనంతరం వెల్లడించారు.

# వెండి కొండ పెరుగుతోంది

- పారిశ్రామిక గిరాకీ తగ్గే ప్రసక్తే లేదు
- ఈ లోహానికి ప్రత్యామ్నాయం కష్టమే
- ధర హెచ్చుతగ్గులు తప్పవు
- కొనుగోళ్లకు 'ట్రైపాడ్' విధానం మంచిది
- విశ్లేషకుల అభిప్రాయాలు

**న్యూఢిల్లీ:**ఏ రోజుకారోజు పెరుగుతున్న వెండి ధరలను చూసి మదుపర్లకు పాలుపోవడం లేదు. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాములు) వెండి ధర తొలిసారిగా 100 డాలర్లను అధిగమించింది. దేశీయంగానూ కిలో రూ.3,33,000కు పైగా చేరింది. ఈ సమయంలో మరింతగా ధర పెరుగుతుందా, లేదంటే వెనక్కి వస్తుందా అని మదనపడుతున్నారు. ఇప్పటికే కొనుగోళ్లు చేసినవారు ఏం చేయాలి. అమ్మాలా ఇంకా కొనుగోలు చేయాలా? కొత్తగా వెండి కొనుగోలు చేసే వారు సైతం ముందడుగు వేయాలా. కాస్త ఆగాలా అని ఆలోచిస్తున్నారు. మరి విశ్లేషకులు ఏమంటున్నారు? గత 5 దశాబ్దాలుగా వెండి ధర స్తబ్దుగానే ఉంటోంది. చాలా కాలంగా దాని వాస్తవ ధర కంటే దిగువనే చలిస్తూ వస్తోంది. ఇప్పటికి ఒక శక్తిమంత, వ్యూహాత్మక, భర్తీ చేయలేని పారిశ్రామిక లోహంగా మారింది. ఆర్థిక వ్యవస్థలో మిళితమై సరికొత్త సాధనంగా నిలిచిందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.హరిత ఇంధన, సౌర పీవీ, విద్యుత్ మౌలిక వసతులు, ఎలక్ట్రానిక్స్-సెమికండక్టర్స్, ఈవీలు, బ్యాటరీలు, ఇలా పలు రంగాల్లో కీలక లోహంగా ఇది మారింది. అప్పట్లో కృత్రిమంగా తక్కువ ధరల్లో కొనసాగిన వెండి ధర ఇపుడు సర్దుబాటు అవుతోంది. ఇందుకు గత అయిదు సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తున్న కొరత కూడా కలిసివచ్చింది. సరఫరాతో పోలిస్తే గిరాకీ భారీగా ఉండడంతో ధర భగ్గుమనడానికి కారణమైంది. దీంతో అంతర్జాతీయంగా పలు దేశాలు పరోక్షంగానో, ప్రత్యక్షంగానో వెండి నిల్వలను అట్టేపెట్టిఉంచుకుంటున్నాయి. తద్వారా సరఫరా వ్యవస్థకు భంగం కలగకుండా చూసుకుంటున్నాయి. జాతీయ భద్రత, ఇంధన స్వాతంత్ర్యం, సాంకేతిక సార్వభౌమత్వానికి ఇది ఒక కేంద్ర బిందువుగా మారడం ఇందుకు కారణం.

గిరాకీ తగ్గుతుందా?



ప్రభుత్వాలతో పాటు సంస్థలు, వ్యక్తులు కూడా హెడ్జింగ్ కోసం వెండిని కొంటున్నారని 'ఈనాడు'తో కోటక్ సెక్యూరిటీస్ హెడ్ ఆఫ్ కమొడిటీ, కరెన్సీ రీసెర్చ్ అనింద్య బెనర్జీ తెలిపారు. 'పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యీకరణ నిమిత్తం వెండినీ చేర్చుకుంటున్నారు. కంపెనీలైతే ధరలు మరింత పెరుగుతాయేమోనన్న భయంతో నిల్వలు పెంచుకుంటున్నాయి. ముఖ్యంగా భారీ స్థాయి ప్రైవేటు ఇన్వెస్టర్లు అధిక మొత్తంలో భౌతిక వెండిని తక్కువ ధరల్లో కొని పెట్టుకుని ఉన్నార'ని చెప్పారు. ఇక ఈ సమయంలో గిరాకీ తగ్గుతుందా అన్న అనుమానాలు రావొచ్చు. అయితే..పరిశ్రమలు ఎన్నటికీ వినియోగాన్ని తప్పించుకోలేవు.
ఆధునిక సాంకేతికతలో వెండి తప్పనిసరిగా మారింది. అంతర్జాతీయ మందగమనం వంటిదేదో ఎదురైతే తప్ప గిరాకీ తగ్గే ప్రసక్తే లేదని విశ్లేషకులు అంటున్నారు.

**ఇపుడు కొనాలా.. వద్దా?**

'వెండి ధరపై దీర్ఘకాలంలో బులిష్‌గానే ఉన్నాం. అయితే ఊగిసలాటలు మాత్రం తప్పవ'ని బెనర్జీ తెలిపారు. 'దిద్దుబాటు 10-15% వరకు కనిపించడం సాధారణమే. ఒక వేళ అనిశ్చితులు పెరిగితే 20-25% వరకూ పతనం కొనసాగొచ్చు. మదుపర్లు సరైన సమయం కోసం ఎదురుచూడడం కంటే 'ట్రైపాడ్' వ్యూహం అవలంబించడం మంచిది. అంటే ఒక భాగం ప్రస్తుతం, క్రమంగా కొద్ది కాలం పాటు ఇంకో భాగం, మూడో భాగం భారీ దిద్దుబాటు కోసం అట్టేపెట్టిఉంచుకోవడం మంచిది. ఇక పోర్ట్‌ఫోలియోలో వెండినీ జత చేసుకోవాలి. అంతే తప్ప దానిని మాత్రమే పరిగణించరాదు. మొత్తం పోర్ట్‌ఫోలియోలో వెండి, బంగారం 25-30% వరకు కేటాయించుకోవచ్చు. ఇందులోనూ బంగారం, వెండిని 60:40/70:30 నిష్పత్తిలో ఉంచుకోవచ్చ'న్నారు.

**ఏటా సమీక్ష తప్పనిసరి..**

'వెండికి ఉన్న 'హైబీటా' తత్వం వల్ల ఊగిసలాటలు అధికంగా ఉంటాయి. కాబట్టి ఆ నిష్పత్తులు సరిపోతాయ'ని వివరించారు. ప్రస్తుతం రికార్డు గరిష్ఠాలకు వెండి చేరింది కదా అని స్వల్పకాల లాభాల స్వీకరణపై దృష్టి పెట్టడం మంచిది కాదు. అసెట్ అలొకేషన్, పీరియాడిక్ రీబ్యాలెన్సింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. డీ డాలరైజేషన్ వేగవంతమవుతోన్నం దున అన్ని అసెట్ విభాగాల్లోనూ ఊగిసలాటలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏటా పోర్ట్‌ఫోలియోను సమీక్షించుకోవడం తప్పనిసరనీ తెలిపారు.వెండి అనేది నిర్మాణాత్మకంగా బలంగా కనిపిస్తున్నా.. ఊగిసలాటలు భారీగా ఉంటాయి. అందుకే భావోద్వేగ నిర్ణయాల కంటే, క్రమశిక్షణతో కేటాయింపులు చేసుకోవడం మంచిది.

## గృహ రుణ వడ్డీ మినహాయింపు రూ.5 లక్షలకు పెంచాలి

ప్రభుత్వానికి క్రెడాయ్ వినతి

**న్యూఢిల్లీ:**దేశంలో వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ, పెరుగుతున్న వలసల నేపథ్యంలో రానున్న కేంద్ర బడ్జెట్‌లో జాతీయ అద్దె గృహాల మిషన్ (నేషనల్ రెంటల్ హౌసింగ్ మిషన్)ను ప్రారంభించాలని నిర్మాణ రంగ సంస్థల సమాఖ్య క్రెడాయ్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మిషన్ కింద కేవలం డెవలపర్లకే కాకుండా, అద్దెదారులకూ పన్ను ప్రోత్సాహకాలు కల్పించాలని విజ్ఞప్తి చేసింది. అంతేకాకుండా, గృహరుణాలపై ప్రస్తుతం ఉన్న వడ్డీ మినహాయింపు పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని సూచించింది.పట్టణీకరణ కారణంగా నగరాలకు వలసలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, దేశంలో వ్యవస్థీకృత అద్దె గృహాల విభాగం ఇంకా అభివృద్ధి చెందలేదని క్రెడాయ్ పేర్కొంది. ఈ నేపథ్యంలో మొదటి, రెండో శ్రేణి నగరాల్లో భారీ ఎత్తున అందుబాటు ధరల్లో అద్దె ఇళ్లను నిర్మించేందుకు నేషనల్ రెంటల్ హౌసింగ్ మిషన్‌ను ఏర్పాటు చేయాలని తెలిపింది. డెవలపర్లకు ఆర్థిక ప్రోత్సాహకాలు, అద్దెదారులకు పన్ను వెసులుబాట్లు కల్పించడం ద్వారా అద్దె మార్కెట్‌ను క్రమబద్ధీకరించేందుకు వీలవుతుందని పేర్కొంది. దీనిద్వారా అసంఘటిత నివాసాలను అరికట్టేందుకు వీలవుతుందని, ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారికి ఇది ఎంతో మేలు చేస్తుందని వివరించింది. ఆర్థిక వృద్ధికి, ఉపాధి కల్పనకు గృహ నిర్మాణ రంగం చోదక శక్తిగా ఉందని క్రెడాయ్ అధ్యక్షుడు శేఖర్ పటేల్ తెలిపారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా 'అందుబాటు ధరల గృహాల' అర్హత ప్రమాణాలను సవరించాలని అన్నారు

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.00 | ₹ 5.02 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,41,450 (22 క్యారెట్లు) | ₹ 1,54,310 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 3,40,000

## అల్ట్రాటెక్ సిమెంట్ లాభం రూ.1,729.44 కోట్లు

**ఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి అల్ట్రాటెక్ సిమెంట్ ఏకీకృత ప్రాతిపదికన రూ.1,729.44 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో నికర లాభం రూ.1,363.44 కోట్లుగా నమోదైంది. కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.17,778.83 కోట్ల నుంచి రూ.21,829.68 కోట్లకు చేరింది. ఇండియా సిమెంట్స్, బిర్లా వైట్ వాల్‌కేర్ (ఇంతకుమునుపు వండర్ వాల్‌కేర్), యూఏఈకి చెందిన ఆర్ఏకేడబ్ల్యూసీటీలను కొనుగోలు చేయడం వల్ల 2025-26 అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలను ఏడాదిక్రితం ఇదే సమయం నాటి ఆర్థిక ఫలితాలతో పోల్చిచూడలేమని కంపెనీ వెల్లడించింది. అల్ట్రాటెక్ సిమెంట్‌లో కేశోరామ్ ఇండస్ట్రీస్‌కు చెందిన సిమెంట్ వ్యాపార విలీనం 2025 మార్చి 1 నుంచి అమల్లోకి రావడం కూడా ఇందుకు మరో కారణంగా పేర్కొంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో ఇతర ఆదాయంతో కలిపి కంపెనీ మొత్తం ఏకీకృత ఆదాయం 15 శాతం పెరిగి రూ.21,965.26 కోట్లకు చేరింది. విక్రయాలు 15 శాతం అధికమై 33.85 మెట్రిక్ టన్నులుగా నమోదయ్యాయి. కేబుళ్లు, వైర్ల వ్యాపారంలోకి వచ్చే ప్రణాళిక పైనా కసరత్తు చేస్తున్నామన్నారు.

# తేనెటీగల విషం... కిలో రూ.కోటి!

**న్యూఢిల్లీ:**తేనెటీగల పేరుచెబితే తియ్యని తేనే గుర్తొస్తుంది మనకు. అంత తియ్యని తేనెను పంచే తేనెటీగలు విషాన్ని కూడా తయారుచేస్తాయి... అదే 'బీ వీనమ్'. కిలో బీ వీనమ్ ధర రూ. కోటి పైమాటే. ఏంటీ విషాన్ని కోటి పెట్టి కొంటారా... ఎందుకూ అనుకుంటున్నారు కదా? ఎందుకో తెలుసుకుందాం తేనె... ఆ పేరు వింటేనే తీయదనం మనసులో మెదులుతుంది. అదే దాన్ని తయారుచేసే తేనెటీగల పేరుచెబితే మాత్రం వణికిపోతాం... ఎందుకంటే అవి కుడితే నొప్పితో విలవిల్లాడాల్సిందే! ఆ నొప్పికి కారణం తేనెటీగలు కుట్టినప్పుడు వాటి ముల్లుని మన శరీరంలోకి దించి విషాన్ని విడుదల చేస్తాయి. దీన్నే 'బీ వీనమ్' లేదా 'ఎపిటాక్సిన్' అంటారు. కిలో తేనె సుమారుగా ఐదొందలలో, మరీ నాణ్యమైనదైతే వెయ్యో, రెండువేల వరకూనో ఉండొచ్చు. కానీ ఈ బీ వీనమ్ ధర వింటే మాత్రం ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే కిలో బంగారం ధర కన్నా, కిలో తేనెటీగల విషం ధరే ఎక్కువ కాబట్టి. తేనెటీగల నుంచి ప్రత్యేక పద్ధతిలో సేకరించిన బీ వీనమ్ ధర గ్రాము పదివేల నుంచి పాతికవే?ల రూపాయల వరకూ ఉంది. అంటే కిలో రూ.కోటిపైమాటే! ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే... తేనెటీగలు కుట్టినప్పుడు మనల్ని బాధించే ఆ విషాన్నే నొప్పి నివారణ మందుల్లోనూ, వయసుని తగ్గించే యాంటీ ఏజింగ్ క్రీముల్లోనూ, ఎపీ థెరపీ వంటి వైద్య ప్రక్రియల్లోనూ విరివిగా వాడుతున్నారు.

ఈ విషంలో ఏముంది...

బీ వీనమ్ లేదా ఎపిటాక్సిన్... చూడ్డానికి తెల్లని పాలపొడిలా ఉంటుంది. ఇక, దీన్ని ఎలా సేకరిస్తారంటే... తేనె కోసం తోటలూ, చెట్ల మధ్యలో పెట్టెలు పెట్టి ప్రత్యేక పద్ధతుల్లో తేనెటీగల్ని పెంచుతారు కదా! దానికే మరికొన్ని ఏర్పాట్లు అదనంగా చేసి ఈ వీనమ్‌ని సేకరిస్తారు. 'తేనెటీగలు అవి తమ గూట్లోకి వెళ్లే దారిలో ఒక పలకలాంటి దాన్ని ఏర్పాటు చేస్తారు.



దీన్నే వీనమ్ ఎక్స్‌ట్రాక్టర్ అంటారు. ఇది అతి తక్కువ కరెంట్తో పనిచేస్తుంది. దీని సాయంతో తేనెటీగలకి చిన్నపాటి షాక్ ట్రీట్మెంట్ ఇస్తారు. ఆ సమయంలో అవి తమని తాము రక్షించుకోవడానికి విషాన్ని విడుదల చేస్తాయి. సాధారణంగా తేనెటీగలు వాటి ముల్లుతో మనల్ని గుచ్చిన తర్వాత అవి కూడా చనిపోతాయి. కానీ ఈ విధానంలో వాటికి ఏ హానీ ఉండదు. అలా... అవి విడుదల చేసిన విషం కాసేపటికే తెల్లని క్రిస్టల్ పొడిలా మారుతుంది. చిన్న బ్లేడ్‌లాంటి పరికరంతో ఆ పొడినంతా ఒక్కచోటుకి తీసుకొస్తారు. అదే బీ వీనమ్ లేదా ఎపిటాక్సిన్' అంటూ చెబుతారు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా అగ్రికల్చర్ యూనివర్సిటీలో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ వి.సునీత. పెద్దగా పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు, ఉత్పత్తీ కష్టం కాదు కాబట్టి అందరూ కిలోల లెక్కన దీనిని సేకరించవచ్చు కదా అని మీరు అనుకోవచ్చు. కానీ ఇదేమీ అనుకున్నంత సులువైన పనికాదు, చాలా ఓపికతో ఎదురుచూడాల్సిన వ్యవహారం. ఎందుకంటే ఒక్కో తేనెటీగ తడవకి 0.1మిల్లీల వీనమ్‌ని మాత్రమే విడుదల చేస్తుంది. అలాగే ఈ సేకరణ వారంలో ఒక్కసారి మాత్రమే చేయాల్సి ఉంటుంది. ఇరవై పెట్టెలు ఉంటే 1గ్రాము వీనమ్ మాత్రమే తయారవుతుంది. ఇంత శ్రమ ఉంటుంది కాబట్టే అంత ఖరీదు! ఈ వీనమ్ తయారీలో అమెరికా, చైనా రైతులు ముందుంటే ఇప్పుడిప్పుడే మన దేశ రైతులూ చురుగ్గా అడుగులు వేస్తున్నారు. గుడ్‌గావ్, కేరళ, కర్ణాటక రైతులు ఈ వీనమ్ తయారుచేసి సగటున ఏడాదికి రెండు కోట్ల




వరకూ సంపాదిస్తుంటే మన తెలుగు రాష్ట్రాల్లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా అగ్రికల్చర్ యూనివర్సిటీ నుంచీ, ఆంధ్రప్రదేశ్‌లోని కృషి విజ్ఞాన్ కేంద్రాల నుంచీ దాదాపు ఐదొందలమంది రైతులు శిక్షణ పొంది వీనమ్ తయారీలో అడుగుపెట్టారు.

కాస్మెటిక్స్ తయారీలో...

ఇంతకీ ఇంత ఖర్చు పెట్టి కొనే వీనమ్‌లో ఏముంటుంది, ఎక్కడెక్కడ వినియోగిస్తారనే సందేహం రావొచ్చు. ఈ వీనమ్‌లో మెలిటిన్ అనే శక్తిమంతమైన పెప్టైడ్ ఉంటుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఏజింగ్ గుణాలవల్లనే క్యాన్సర్ నివారణలోనూ, ఆర్థరైటిస్ వంటి వ్యాధులని నయం చేయడానికీ ఉపయోగిస్తున్నారు. పెయిన్‌కిల్లర్స్, యాంటీఏజింగ్ క్రీమ్‌లూ, సీరమ్‌ల తయారీలో ప్రధానంగా వాడుతున్నారు. బీ వీనమ్‌తో తయారుచేసిన మాయిశ్చరైజర్లూ, పెయిన్ రిలీఫ్ క్రీమ్‌లూ, టూత్‌పేస్ట్‌లూ, ఫేస్‌మాస్క్‌లూ, ప్యాచ్‌ల వంటివీ లభ్యమవుతున్నాయి. వైద్యుల పర్యవేక్షణలో వీటిని వాడితే మెరుగైన ప్రయోజనాలు ఉంటాయని అంటున్నారు డెర్మటాలజిస్టులు.

## భార్య కోసం.. 600 కి.మీ. రిక్షా తొక్కిన 70 ఏళ్ల వృద్ధుడు

**న్యూఢిల్లీ:**కటిక పేదరికం వెంటాడుతోంది. వయసు సహకరించడం లేదు. మరోవైపు అనారోగ్యం బారిన పడ్డ భార్య. ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లడానికి చేతిలో చిల్లి గవ్వ లేదు. కానీ ఆమెను కాపాడుకోవాలనే సంకల్పం బలంగా ఉంది. ఇందుకోసం ఏకంగా 600 కిలోమీటర్లు రిక్షా తొక్కి భార్యకు చికిత్స అందించాడు 70 ఏళ్ల వృద్ధుడు. ఈ ఘటన ఒడిశాలో చోటుచేసుకుంది.సంబల్‌పుర్‌కు చెందిన లోహార్ రిక్షా తొక్కుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య జ్యోతి గత ఏడాది అనారోగ్యం బారిన పడ్డారు. మెరుగైన వైద్యం కోసం కటక్‌లోని ప్రభుత్వ ఎస్‌సీబీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని స్థానిక వైద్యులు సూచించారు. అంబులెన్స్, ఇతర వాహనాల ద్వారా వెళ్లేందుకు డబ్బుల్లేవు. కానీ ఎలాగైన భార్యకు చికిత్స అందించాలని ముందడుగు వేశాడు. ఇందుకోసం భార్యను రిక్షాలో తీసుకొని బయలుదేరాడు. రోజుకు దాదాపు 30 కిలో మీటర్లు రిక్షా తొక్కుతూ తొమ్మిది రోజులకు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న కటక్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నాడు. ఆమెకు ఆసుపత్రిలో రెండునెలల పాటు చికిత్స అందించారు. అనంతరం.. మళ్లీ అదే రిక్షాలో ఇంటికి తిరుగు ప్రయాణం ప్రారంభించాడు. మార్గమధ్యంలో ఓ వాహనం రిక్షాను ఢీకొంది. ఆ సమయంలో జ్యోతి తలకు స్వల్ప గాయమైంది. ఆమెకు చికిత్స అందించి సాయంగా నిలుస్తామని స్థానిక పోలీసులు హామీ ఇచ్చిన లోహార్ సున్నితంగా తిరస్కరించాడు. తన సతీమణి, రిక్షాతో స్వస్థలానికి చేరుకున్నాడు. భార్య కోసం ఏకంగా 600 కిలో మీటర్లు రిక్షా తొక్కి తన ప్రేమను చాటుకున్నాడు లోహార్. వయసు శరీరానికే కానీ ప్రేమకు అడ్డుకాదని నిరూపించాడు.'నాకంటూ ఉన్నది ఇద్దరే. ఒకరు నా భార్య, మరొక రిక్షా.'అని లోహార్ తెలిపారు.



## ఒంటరి పోరాటం చేస్తాం



తెలిసిందే. దీన్ని ఆయన ఇక్కడ ఆవిష్కరించారు. 'తమిళ నాడు ఎన్నికల్లో ఒంటరిగానే విజయం సాధిస్తాం. అందుకు తగ్గ సైన్యం మావద్ద ఉంది. ఇది ఎన్నికల పోరు కాదు.. ప్రజాస్వామ్య యుద్ధం. అన్నాడీఎంకే ప్రత్యక్షంగా.. డీఎంకే పరోక్షంగా భాజపాకి సరెండర్ అయ్యాయి. టీవీకే ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గదు. డీఎంకే ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం వచ్చింది.ఎవరికీ తలవంచం.. దేనికీ రాజీపడే ప్రసక్తే లేదు. మనమందరం కలిసికట్టుగా ఉంటే విజయం మనదే. రాష్ట్రంలో అవినీతి అంతానికి సమయం ఆసన్నమైంది' అని విజయ్ అన్నారు. దుష్ట శక్తులను, అవినీతిపరులను ఎదుర్కొనే ధైర్యం తమ పార్టీకి మాత్రమే ఉందన్నారు.

## భారతీయ ఉద్యోగులే నైపుణ్యాల్లో భేష్..

- అసంతృప్తి ఉన్నా.. ఉద్యోగాన్ని వదలరు
- మ్యాన్‌పవర్ గ్రూపు నివేదిక

**హైదరాబాద్:** 'తమకున్న నైపుణ్యాలపై భారతీయ ఉద్యోగులు ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. అదే సమయంలో.. తీవ్రమైన పని ఒత్తిడి, అనిశ్చితితో సతమతమవుతున్నారు' అని మ్యాన్‌పవర్ గ్రూప్ గ్లోబల్ టాలెంట్ బారోమీటర్-2026 నివేదిక వెల్లడించింది. ఉద్యోగుల శ్రేయస్సు సూచీలో భారత్ 77 శాతంతో అగ్రస్థానంలో నిలిచినా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అంత ఆశాజనకంగా లేదని పేర్కొంది. తమ విధులను నిర్వర్తించడంలో తమకున్న పట్టుపై 95 శాతం మంది భారతీయ ఉద్యోగులు పూర్తి విశ్వాసంతో ఉన్నారు. ఇది ప్రపంచ సగటు కంటే చాలా ఎక్కువ. ఇక కృత్రిమ మేధ (ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంలోనూ 90 శాతం మంది తమ సంసిద్ధతను వ్యక్తం చేశారు. వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కోవడంలో తాము ఎవరికీ తీసిపోమని భారతీయ ఉద్యోగులు నిరూపిస్తున్నారు. ఈ విశ్వాసం ఉద్యోగ సంతృప్తిగా మారడం లేదు. కేవలం 64 శాతం మందే తమ ప్రస్తుత ఉద్యోగంపట్ల సంతృప్తిగా ఉన్నారు. నైపుణ్యాలు, పని సామర్థ్యం విషయంలో ధీమాగా ఉన్న ఉద్యోగులు, పనిభారం విషయంలో మాత్రం ఏకంగా 75 శాతం మంది తాము తీవ్రమైన మానసిక, శారీరక అలసట అంచున ఉన్నట్లు తెలిపారు. మితిమీరిన వేళలు, పనిభారం ఇందుకు ప్రధాన కారణాలు. దాదాపు 53 శాతం మంది ఉద్యోగులు ప్రతి రోజూ మోస్తరు పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని అంగీకరించారు. ముఖ్యంగా జెన్-జీ



మహిళా ఉద్యోగుల్లో ఈ ఒత్తిడి తీవ్రత మిగతా వారికంటే ఎక్కువగా ఉంది. ప్రస్తుతం కార్పొరేట్ వర్గాల్లో 'జాబ్ హగ్గింగ్' అనే కొత్త ధోరణి కనిపిస్తోంది. చేస్తున్న ఉద్యోగం పట్ల అసంతృప్తి ఉన్నప్పటికీ, ఆర్థిక అనిశ్చితి భయంతో ఉద్యోగాన్ని వదలకుండా అందులోనే కొనసాగడాన్ని ఇలా పిలుస్తున్నారు. సుమారు 48 శాతం ఉద్యోగులు ఇదే తరహా ఆలోచనతో ఉన్నారని నివేదిక పేర్కొంది. అదే సమయంలో 84 శాతం మంది తాము ఉద్యోగాన్ని మారేందుకు ఉన్న అవకాశాలను చూస్తున్నామని తెలిపారు. అంటే, ఉద్యోగులు సంస్థలో ఉంటున్నారే తప్ప, మనసు పెట్టి పనిచేయడం లేదని నివేదిక వెల్లడించింది.

**ఐటీలోనే ధీమా..**

రాబోయే ఆరు నెలల్లో మరో ఉద్యోగం దొరుకుతుందనే నమ్మకం ఐటీ, పరిశ్రమల రంగాల ఉద్యోగుల్లో ఎక్కువగా ఉంది. అదే సమయంలో ఆరోగ్య సంరక్షణ, స్థిరాస్తి, ఆర్థిక సేవల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మాత్రం తమ ఉద్యోగ భద్రతపై తీవ్ర ఆందోళనలో ఉన్నారు. దాదాపు 41 శాతం మంది తమ ఉద్యోగం ఏ క్షణమైనా పోవచ్చనే భయంతో ఉన్నట్లు సర్వే వెల్లడించింది. బ్లూ కాలర్ ఉద్యోగుల్లో శ్రేయస్సు స్కోరు అత్యల్పంగా 68 శాతమే నమోదైంది. పనికి తగిన గుర్తింపు లేకపోవడంతోపాటు, ఆధునిక సాంకేతికతలు తమ ఉద్యోగాలను తీసేసుకుంటాయన్న భయం 62 శాతం మందిలో ఉంది. అంతర్జాతీయ నైపుణ్యాల హబ్‌గా భారత్ మారుతున్న తరుణంలో ఉద్యోగుల మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించకపోతే ఉత్పాదకత దెబ్బతింటుందని మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా ఎండీ సందీప్ గులాటి తెలిపారు. ఉద్యోగుల్లో విశ్వాసం ఉన్నప్పటికీ, సంస్థలు వారి శ్రేయస్సును పట్టించుకోవాలని సూచించారు. పని-జీవిత సమతుల్యత, ఉద్యోగంలో వృద్ధి తదితరాలపై సంస్థలు ఉద్యోగులకు తగిన విధంగా మార్గనిర్దేశం చేయాలన్నారు.

# ఆత్మహత్య.. హత్య

- అనుమానస్పద స్థితిలో రైతు దంపతుల మృతి
- బంట్వారం మండలం యాచారంలో ఘటన
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న బంటారం పోలీసులు
- వీడని దంపతుల మృతి మిస్టరీ





**వికారాబాద్ జిల్లా బ్యూరో జనవరి 25 (జనం సాక్షి):** ఇద్దరు రైతు దంపతులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. వారి మృతి మిస్టరీగా మారింది. వారి మృతికి గల కారణాలు తెలియ రాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా బంట్వారం మండలంలోని యాచారం గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు బంటారం పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. యాచారం గ్రామానికి చెందిన రైతు దంపతులు నక్కలి దశరథ్(58) నక్కలి లక్ష్మి(54) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతుల కొడుకు నక్కలి అశోక్ ఫిర్యాదు మేరకు బంటారం పోలీసులు అనుమానస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైతు దంపతుల మృతిపై గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. రైతు దంపతులు ఇద్దరు విషం తీసుకొని ఆత్మహత్య చేసుకున్నారా లేక వారిపై విష ప్రయోగం జరిగిందా అనే విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామస్తులు కూడా ఇదే అనుమానాన్ని వ్యక్తం చేశారు. వారు ఏదైనా విషయం తీసుకొని ఉంటే ఇంట్లో దానికి సంబంధించిన ఆనవాలేమైనా దొరికేవని అలాంటివి ఏమి ఇంట్లో దొరకని కారణంగా పురుగుల మందు తాగి మృతి చెందలేదన్న విషయాన్ని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. మృతుల ఇంట్లో ఇంజక్షన్‌కు సంబంధించిన రెండు నీడిల్స్ దొరకడంతో వారిపై విష ప్రయోగం జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఈ విష ప్రయోగాన్ని బయట వ్యక్తులు ప్రయోగించారా లేక ఇంకేమైనా కారణం ఉందా అనే విషయంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రైతు దంపతులకు ప్రైవేట్ ప్రభుత్వ బ్యాంకుల్లో దాదాపు 5 లక్షల పైబడి అప్పు ఉంది. అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటే పురుగుల మందు డబ్బాలు దొరికేవని గ్రామస్తులు అంటున్నారు. కానీ అలాంటివేమీ



దొరకకపోవడంతో విష ప్రయోగం జరిగి ఉంటుందని అనుమానాలు బలపడుతున్నాయని గ్రామస్తులు తెలియజేశారు. కాగా ఈ విషయమై బంటారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం శవాలను మర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం శవాలను బంధువులకు అప్పగించారు.

## యాచారంలో తాగుబోతుల వీరంగం

**డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో ఎస్ఐని కారుతో ఢీకొట్టి అర కి.మీ. ఈడ్చుకెళ్లిన దుండగులు**

**యాచారం, జనవరి 25 (జనం సాక్షి):** రంగారెడ్డి జిల్లా యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఎస్ఐ మధును ఓ కారు వేగంగా ఢీకొట్టి దూసుకెళ్లింది. కారు బానెట్‌పై పడిన ఎస్ఐని అర కిలోమీటర్ మేర ఈడ్చుకెళ్లిన ఈ ఘటన రోడ్డు భద్రతపై తీవ్ర ఆందోళన కలిగించింది. 100 కి.మీ.కు పైగా స్పీడ్‌తో వాహనం నగరం వైపు పరుగెత్తడంతో ఎస్ఐ ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయి.

తనిఖీ సమయంలో వాహనదారులను ఆపి మద్యం పరీక్షలు చేస్తున్న ఎస్ఐ మధు వద్దకు వేగంగా వచ్చిన కారు ఆగకుండా ఢీకొట్టింది. బలమైన ఢీకొట్టుడుతో ఎస్ఐ కారు బానెట్‌పై పడగానే వాహనం ఆగకుండా ముందుకు దూసుకెళ్లింది. అర కిలోమీటర్ మేర ఈడ్చుకెళ్లిన తర్వాతే కారు ఆగిపోయింది. ఈ ఘటనలో ఎస్ఐ మధు తీవ్ర గాయాలపాలయ్యారు. ధూమల్‌లోని పీపుల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయన తర్వాత పోలీస్ స్టేషన్ చేరుకున్నారు. కారును ఇబ్రహీంపట్నంలో పట్టుకున్న పోలీసులు నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ప్రాథమిక విచారణలో నిందితులు మద్యం సేవించి వాహనం నడిపినట్లు తేలింది. ఈ ఘటనను హత్యాయత్నంగా లేదా తీవ్ర గాయపరిచే ఉద్దేశంతో జరిగిన దాడిగా పరిగణిస్తూ కేసు నమోదు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టడానికి మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ఈ ఘటన మరోసారి హెచ్చరికగా మారింది. పోలీసులు ఈ కేసుపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితుల నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



## లీలా స్పెషాలిటీ క్లినిక్స్ ప్రారంభం

హైదరాబాద్ : నార్సింగి రిజిస్ట్రేషన్ ఆఫీస్ రోడ్డులో లీలా స్పెషాలిటీ క్లినిక్స్ ను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన వైద్యం అందించడంలో లీలా స్పెషాలిటీ క్లినిక్స్ క్రమశిక్షణతో, స్థిరత్వంతో ముందుకు సాగాలని' తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ జి తో పాటు నార్సింగి మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకుడు అశోక్ యాదవ్, బీజేపీ మునిసిపల్ అధ్యక్షుడు నగేశ్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు వేణు, ఆదిత్య రెడ్డి, పత్తి ప్రవీణ్, బీజేపీ నాయకులు అంజన్ కుమార్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# సమస్యలతో స్వాగతం

## షాద్ నగర్ మున్సిపాలిటీలో తిష్ట వేసిన సమస్యలు

- ప్రాథమిక సబ్ సెంటర్లు లేక చెట్లకిందే వైద్యం
- పూర్తి కానీ చటాన్ పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం
- బైపాస్ బాట పట్టిన ఆర్టీసీ బస్సులు
- డంపింగ్ యార్డు కాలుష్యంతో సోలిపూర్ గ్రామస్తుల ఉక్కిరిబిక్కిరి
- నగరం నడి బొడ్డున అక్రమ కట్టడాలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు కావడంతో పట్టణంలో చర్చ మొదలైంది పార్టీలకు అతీతంగా ఒక్కో వార్డులో ఇద్దరు ముగ్గురు పోటీలో ఉండేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నరు ఇది ఇలా ఉంటే పట్టణంలో చాలా కాలంగా పరిష్కారం కానీ సమస్యలు మున్సిపాలిటీ ఎన్నికలకు స్వాగతం పలుకుతున్నాయి పట్టణంలోని 28 వార్డులలో ఎక్కడ కూడా ఇప్పటి వరకు ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్లు లేక గర్భిణీ స్త్రీలకు చిన్నారులకు ఇచ్చే టీకాలు చెట్ల కిందనే వైద్యం అందిస్తున్నారు వైద్య సిబ్బంది వర్షానికి ఎండకు తీవ్ర ఇబ్బందులు పడుతూ వైద్యం అందిస్తున్నామని తెలిపారు వైద్య సిబ్బంది పట్టణంలోని చటాన్ పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చాలా కాలంగా పెండింగ్‌లోనే ఉండిపోయింది ఇప్పటి వరకు ఆ పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగడం లేదనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి దానికి తోడు వివిధ గ్రామాల నుండి పట్టణానికి వచ్చిపోయే రైతులు ప్రజలు రైల్వేగెట్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నరు ఇక ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన వివిధ ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులు ఏవి కూడా షాద్ నగర్ డిపోకు రాకుండా బైపాస్ లో వెళ్లడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు హైదరాబాదు నుండి బైపాస్ నుండే వెళ్తున్నాయి తప్ప షాద్ నగర్ డిపోకు రావడం లేదని రాత్రి తొమ్మిది అయ్యిందంటే చాలు ఒక్క బస్సు కూడా షాద్‌నగర్ డిపోకు రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు హైదరాబాద్ శంషాబాద్ వెళ్లాల్సి వస్తె బైపాస్ కు వెళ్లి మరి బస్సులు ఎక్కల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు పట్టణ ప్రజలు పట్టణంలోని కొన్ని వార్డులలో ఇప్పటివరకు సిసి రోడ్ల నిర్మాణం పూర్తి స్థాయిలో జరగకపోవడంతో ఆయా కాలనీవాసులు సిసి రోడ్లు నిర్మాణం అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభించాలని కోరుతున్నారు ఇది ఇలా ఉంటే సోలిపూర్ డంపింగ్ యార్డ్ వల్ల దుర్వాసన కాలుష్య సమస్యతో సోలిపూర్ గ్రామస్తులు అక్కడి నుండి డంపింగ్ యార్డు ను మార్చాలని కోరుతున్నారు పట్టణం నుండి ప్లాస్టిక్ కవర్లతో పాటు చెత్త చెదారంను తెచ్చి తమ గ్రామ శివారులో పోసి తగలబెడుతున్నారని దాంతో నెల రోజుల పాటు పోగ దుర్వాసన వచ్చి కాలుష్యం బారిన పడుతున్నామని రోగాలకు గురవుతున్నామని అంటున్నారు సోలిపూర్ గ్రామస్తులు అదేవిధంగా మున్సిపాలిటీ మురుగు నీరు మొత్తం సోలిపూర్ పంట పొలాల్లోకి వెళ్లడంతో పంటలు పండక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఇక పట్టణ చౌరస్తా విస్తరణ లేక పోవడం వల్లన ప్రమాదాలు జరిగి వాహనదారుల ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు ఎన్నో ఉన్నాయని పెరుగుతున్న ట్రాపిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని చౌరస్తా విస్తరణతో మెయిన్ రోడ్డు వెడల్పు చెయ్యాలని కోరుతున్నారు ప్రజలు ఇక పట్టణంలోని నగరం నడిబొడ్డున అక్రమ కట్టడాలు నిర్మాణాలు జరుగుతున్న మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి కొంతమంది మధ్యవర్తుల జోక్యంతో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని సంబంధిత శాఖ అధికారులకు తెలిసిన కూడా చర్యలు తీసుకోవడం లేదనే చర్చ జోరుగా కొనసాగుతుంది ప్రతి వార్డులో కాలనీలలో ఉన్న పదిశాతం వదిలిన స్థలాలు కూడా కబ్జాకు గురయ్యాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి..






## కొడుకును చంపిన తల్లి

**నస్పూర్(జనంసాక్షి):** కన్న కొడుకును చంపిన తల్లి సంఘటన నస్పూర్ మండలంలోని ప్రశాంత్ నగర్‌లో చోటుచేసుకుంది. మంచిర్యాల రూరల్ సిఐ ఆకుల అశోక్ తెలిపిన వివరాల ప్రకారం ప్రశాంత్ నగర్ లో నివాసం ఉంటున్న బోయిని శ్రీనివాస్ వయస్సు 37 సంవత్సరాలు కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడని, గత కొన్ని రోజులుగా తాగుడుకు బానిస అయ్యి తల్లిని, చెల్లిని కొడుతుండే వాడని అతని ప్రవర్తన భరించలేక ఈనెల 24 తారీఖున రాత్రి 11 గంటలకు తల్లి శంకరమ్మ రోకలి దొడ్డుతో తలపై కొట్టగా తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మరణించాడని,మృతుడి అక్క ముప్పు వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

## మహా సాంస్కృతిక మహోత్సవం 'రామాయణ కల్పవృక్షం'



**హైదరాబాద్ జనవరి 25 (జనం సాక్షి):** భారతీయ సనాతన ధర్మం, కళలు, సంస్కృతికి అద్దం పట్టే ప్రతిష్ఠాత్మక 'రామాయణ కల్పవృక్షం' తన నాలుగో సంచికతో సిద్ధమైంది. ప్రఖ్యాత నర్తకి, పద్మశ్రీ ఆనంద శంకర్ జయంత్ ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు హైదరాబాద్లోని సీసీఆర్టీ క్యాంపస్‌లో ఈ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. శంకరానంద కళాక్షేత్ర, నాట్యారంభ, బృహత్ క్రియేటివ్ సహకారంతో భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ మద్దతుతో ఈ మూడు రోజుల వేడుక జరగనుంది. ఈ సందర్భంగా రామాయణ కల్పవృక్షం సృష్టికర్త ఆనంద శంకర్ జయంత్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రామాయణ కల్పవృక్షం నగరంలో ఎంతో ఆసక్తిగా ఎదురు చూసే సాంస్కృతిక సంగమంగా నిలిచిందన్నారు. ఎంతో మంది కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకునే విభిన్న ప్రదర్శనలు, ప్రవచనాలు, పండితుల సంభాషణలు, శిల్పులు, కార్మికుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళా గ్రామం ప్రతి ఒక్కరికి ఏదో ఒక అనుభూతిని అందిస్తుందని చెప్పారు. ఈ అనుభూతిలో జ్ఞానం, కళ, సంస్కృతి, ఆధ్యాత్మికత ఉంటుందన్నారు. ఇదే రామాయణ కల్పవృక్షానికి ఒక ప్రత్యేకతను తీసుకువస్తుందన్నారు. ఇటువంటి వేడుకలు చాలా అరుదుగా జరుగుతాయన్నారు.

ఈ ఉత్సవం ప్రారంభ ఎడిషన్‌కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విచ్చేశారని తెలిపారు. ఇప్పుడు ఇది ఒక ముఖ్యమైన సాంస్కృతిక ఉద్యమంగా ఎదగడానికి నాంది పలికారన్నారు. ఇప్పుడు రామాయణ కల్పవృక్షం సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఒక దీపస్తంభంగా నిలిచిందన్నారు. ఈ వేడుకలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు, 'సీతా రామ కళ్యాణం', 'హనుమత్ దర్శనం' ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని పేర్కొన్నారు. చెన్నై, భువనేశ్వర్, ముంబై, బెంగళూరు, భోపాల్, రాజస్థాన్ నుంచి వచ్చిన పురస్కార గ్రహీతలు, కళాకారుల సంగీతం, నృత్యం, కథన ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయనున్నాయన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతులు, ప్రొఫెసర్లు, రచయితలు, పండితులు, వక్తల ఉపన్యాసాలు కలవన్నారు. ప్రత్యేక ఆకర్షణగా భోపాల్‌కు చెందిన లిటిల్ బాలే థియేటర్ అందించే బొమ్మలాట రామాయణ ప్రదర్శన కలదన్నారు. ఇది హైదరాబాద్‌లో మొదటిసారి అన్నారు. ముగింపులో 'కర్ణాటిక్ 2.0' అనే ఫ్యూజన్ ఎన్‌సెంబుల్ ప్రదర్శన ద్వారా 'మర్యాద, ధర్మం: రామాయణం అందించే శాశ్వత సందేశం' అనే భావనను కళాత్మకంగా ఆవిష్కరించనున్నారని తెలిపారు. కర్ణాటక సంగీత తార సందీప్ నారాయణ్, ప్రముఖ ఒడిస్సీ నర్తకీమణులు సుజాత మోహపాత్రా, ప్రీతిషా మోహపాత్రా, రాజస్థాన్‌కు చెందిన బుంగార్ ఖాన్ బృందం అందించే మాంగణియార్ మేజిక్ తదితర విశిష్ట కళాకారులు ఉన్నారన్నారు.

## ముగిసిన అడవుల్లో జంతు గణన

- వారం రోజులపాటు అడవుల్లో అన్వేషణ
- కవ్వాల్ అభయారణ్యంలో పులి అడుగులు గుర్తించిన వాలెంటీర్లు



**ఆదిలాబాద్, జనవరి 25 (జనం సాక్షి):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వన్యప్రాణు ల లెక్కింపు (జంతు ఘణన) ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. మంచిర్యాల జిల్లాలోని కవ్వాల్ అభయారణ్యంలో వారం రోజుల పాటు దట్టమైన అడవుల్లో కాలినడకన తిరిగి వాలెంటీర్లు పులి అడుగులను గుర్తించారు. ఈ లెక్కింపులో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వాలెంటీర్లు, వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. కవ్వాల్ అభయారణ్యంలో ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ రాం మోహన్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుష్మారావ్, బీట్ ఆఫీసర్లు, వాచర్లు, వాలెంటీర్లతో కలిసి అడవుల్లో అన్వేషణ జరిగింది. పులి అడుగులతో పాటు వివిధ రకాల చెట్లను కనుగొన్నారు. అడవులు, పులులు, వన్యప్రాణుల ఆవశ్యకత గురించి వాలెంటీర్లకు ఎఫ్‌డీఓ రాం మోహన్ వివరంగా తెలియజేశారు. అడవి అనంతమైనదని, ఎంత తెలుసుకున్నా ఇంకా తక్కువే అని, అడవి రోజురోజుకూ కొత్త రూపు దాల్చుకుంటుందని రాం మోహన్ తెలిపారు. పులి ఉంటేనే అడవి సురక్షితంగా ఉంటుందని, పులిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. పులులు, వన్యప్రాణుల గురించి భావి తరాలకు తెలియజేయడానికి, ప్రస్తుత అడవులను కాపాడటం అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ జంతు ఘణనలో పాల్గొన్న వాలెంటీర్లు అడవుల్లో తిరిగి పులి అడుగులు గుర్తించడంతో పాటు అడవి వన్యప్రాణుల పరిరక్షణ పట్ల మరింత అవగాహన పెంచుకున్నారు. అభయారణ్యంలో పులుల సంఖ్య, వాటి కదలికలు, ఇతర వన్యప్రాణుల సమాచారం సేకరణ ఈ లెక్కింపు ద్వారా సాధ్యమైంది. వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలందరూ సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

## మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**



**బెల్లంపల్లి, జనవరి 25, (జనంసాక్షి) :** మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం ఆయన బెల్లంపల్లి మండలం పెర్కపల్లిలో 10లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామైఖ్య సంఘ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే హామీకి కట్టుబడి ఉందని అన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ కోరిక అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని అన్నారు. గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రతి గ్రామైఖ్య సంఘానికి పది లక్షల నిధులతో భవనాలు మంజూరు చేసిందన్నారు. గ్రామైక్య సంఘాల భవనాల నిర్మాణం ద్వారా మహిళా సంఘాలకు మరింత బలమొచ్చి, స్వయం ఉపాధి కార్యక్రమాలు విస్తరిస్తాయని తెలిపారు. గ్రామీణ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్, ఎంపీడీవో మహేందర్, టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ సేవలు

పెద్దపల్లి,జనవరి 25(జనంసాక్షి) : మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు పెద్దపల్లి నుండి ఆర్టీసీ సేవలు అందిస్తున్నట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. పెద్దపల్లి నుండి మేడారం జాతరకు భక్తుల ప్రయాణ, రవాణా సౌకర్యాలు మెరుగు పరిచేందుకు 175 బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం జాతర బస్సు సేవలను ఎమ్మెల్యే విజయ రమణారావు ఆర్టీసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ జిల్లా ప్రజల చిరకాల వాంఛ పెద్దపల్లిలో బస్సు డిపో ఏర్పాటు చేయించామని చెప్పారు. డిపో పనులు శరవేగంగా సాగుతున్నాయని, అతి త్వరలోనే డిపో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఎక్కువ బస్సులు డిపో వద్ద అందుబాటులో ఉంచామని, భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని తెలిపారు. జాతరకు వెళ్లే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వర్తిస్తుందని ప్రకటించారు. పెద్దపల్లి నుండి జాతరకు బస్సులు నడుపుతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు డిప్యూటీ ఆర్ ఎం భూపతి రెడ్డి,, జగిత్యాల డిపో మేనేజర్ పెద్దపల్లి సెంటర్ ఇన్చార్జి కల్పన, బస్టాండ్ స్టేషన్ మేనేజర్ రాంగోపాల్ రెడ్డి, కంట్రోలర్ కలవల రామన్న, ధర్మారం కంట్రోలర్ రామన్న,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం**

- పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావు
- పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి రూ.16.80 కోట్లతో శంకుస్థాపనలు





**పెద్దపల్లి,జనవరి 25(జనంసాక్షి) :** పెద్దపల్లి, జనవరి 25: పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు చేస్తున్న ప్రజా సేవలకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై 150 మందికి పైగా వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెద్దపల్లి మున్సిపల్‌లోని 31వ వార్డుకు చెందిన మంథని నర్సింగ్, 20వ వార్డుకు చెందిన బండి అనిల్‌తో పాటు మంథని వెంకటేశ్వర్లు, సోహెల్, భరత్, మహేష్, సంతోష్, మహేందర్, శ్రీనివాస్, సృజన్, విజయ్, ప్రశాంత్ గౌడ్, శ్రీను, ప్రశాంత్ యాదవ్, అడప సంతోష్, బిట్టు, సంజీవ్, రాకేష్, మర్రిపెల్లి మహేందర్, గణేష్, వివేక్, వృద్వి, ప్రవీణ్ సింగ్, అరుణ్, మహేందర్, గాండ్ల సతీష్, లక్ష్మణ్, కల్పన, జ్యోతి, వసంత, అను, రమేష్, అశోక్, గౌస్, ఓదమ్మ, లక్ష్మి, శ్రవణ్, గట్టయ్య, లక్ష్మి, రమాదేవి, రాహుల్, అనూష, ప్రమీల, రాజయ్య, తిరుపతి, స్వరూప, మల్లయ్య తదితరులు, 25వ వార్డుకు చెందిన పలువురు ముస్లిం మైనారిటీ సోదర సోదరీమణులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెద్దపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజయరమణ రావు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వ పాలనకు స్వస్తి పలికి ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిందని తెలిపారు. అధికారం చేపట్టిన సంవత్సరాన్నర కాలంలోనే హామీలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారని, గత పాలకులు చేసిన అప్పులను తీరుస్తూనే ప్రజల కలలను సాకారం చేస్తున్నారని పేర్కొన్నారు. పెద్దపల్లి పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామని, గత ప్రభుత్వం పట్టణాన్ని దోచుకుని అభివృద్ధిని మర్చిపోయిందని విమర్శించారు.

కాంగ్రెస్ అంటే పేదల ప్రభుత్వమని, నిరుపేదలకు అండగా ఉంటుందని తెలిపారు. పెద్దపల్లి పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, గతంలో నిర్వీర్యమైన పనులు కాంగ్రెస్ హయాంలో సుందరంగా మారుతున్నాయని గుర్తుచేశారు. నూతన బస్సు డిపో, బైపాస్ రోడ్డు, 50 నుంచి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, నూతన కోర్టు భవనం వంటి ప్రాజెక్టులు చేపడుతున్నామని వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 10 లక్షల ఆరోగ్యశ్రీ, సన్న బియ్యం, రేషన్ కార్డులతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

**పెద్దపల్లి మున్సిపల్‌లో రూ.16.80 కోట్లతో అభివృద్ధి శంకుస్థాపనలు**

పెద్దపల్లి పట్టణంలో ఆదివారం వివిధ వార్డుల్లో రూ.16.80 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు ఎమ్మెల్యే విజయరమణ రావు. 7వ వార్డు రూ.1.01 కోట్లు, 10వ వార్డు రూ.3.24 కోట్లు, 13వ వార్డు రూ.76.14 లక్షలు, 17వ వార్డు రూ.1.01 కోట్లు, 18వ వార్డు రూ.1.31 కోట్లు, 21వ వార్డు రూ.1.46 కోట్లు, 22వ వార్డు రూ.76.44 లక్షలు, 23వ వార్డు రూ.90.52 లక్షలు, 24వ వార్డు రూ.80.49 లక్షలు, 28వ వార్డు రూ.1 కోట్లు, 29వ వార్డు రూ.76.10 లక్షలు, 36వ వార్డు రూ.64.95 లక్షలు, 17, 19, 21, 22 వార్డుల బీటీ రోడ్లకు రూ.3.12 కోట్లతో శంకుస్థాపనలు జరిగాయి.

ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో పెద్దపల్లి మున్సిపల్‌లో ఇసుక ఇబ్బందులు, అభివృద్ధి లేకుండా ఉండేదని, తాను ఎన్నికైన తర్వాత ఇసుక సమస్య పరిష్కరించామని తెలిపారు. ఇప్పటికే 40 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, బీటీ రోడ్లు పూర్తి చేశామని, ప్రస్తుతం రూ.63 కోట్లు మంజూరు చేశామని, మొత్తం రూ.78 కోట్లతో టెండర్లు పిలిచామని వివరించారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి చేస్తామని, పట్టణం సుందరంగా మారుతుందని హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# చెరువుల రక్షణలో హైడ్రా దూకుడు తగ్గదు

- పేదల గృహాలను కూల్చే ఉద్దేశం హైడ్రాకు లేదు
- పేదలను ముందు పెట్టి కబ్జాలకు పాల్పడే పెద్దలను వదిలిపెట్టమన్న హైడ్రా కమిషనర్




**హైదరాబాద్, హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి) :** చెరువుల పరిరక్షణలో హైడ్రా మరింత దూకుడుగా వ్యవహరిస్తుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. ఆక్రమణలను అడ్డుకోవటమే కాదు వాటిని ఆరోగ్యకరమైన ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామన్నారు. చెరువులు ఇకపై పిల్లలకు యువతకు పెద్దల ఆరోగ్యానికి క్రీడలకు ఆలవాలంగా మారుస్తామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, చెరువుల అక్రమణుల తొలగింపులు హైడ్రా ఇక ముందు కూడా దూకుడుగానే ముందుకు పోతుందని అన్నారు పేదల ఇళ్లను హైడ్రా కూల్చదని అదే సమయంలో పేదలను ముందు పెట్టి ఆక్రమణలు చేసే పెద్దలను వదిలిపెట్టే సమస్య లేదని హైడ్రా కమిషనర్ ఏ .వి.రంగనాథ్ స్పష్టం చేశారు ఆదివారం హైదరాబాదులో రెడ్ హిల్స్ లో హరిత చైతన్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి మాజీ ఉద్యోగుల సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల్లో ఆక్రమణలు తొలగింపు ఒకటే తమ లక్ష్యం కాదని విషతుల్యంగా మారిన చెరువులను శుభ్రపరుస్తున్నామని, తద్వారా గుర్రపు డెక్క వంటి చెట్లు మొలవకుండా శుభ్రమైన నీరు చెరువులో ఉండే విధంగా చూస్తున్నామన్నారు. అంతేకాక చెరువుల చుట్టూ ఉన్న ప్రాంతాన్ని వాకింగ్ ట్రాక్లుగా చిన్న పిల్లలు యువత ఆడుకునే క్రీడా మైదానాలుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని చెరువులను ఈ విధంగా రూపుదిద్దామని మరికొన్ని చెరువులను త్వరలో చేపడుతున్నామన్నారు . ఇప్పటివరకు హైడ్రా అనేక ఆక్రమణలు తొలగించి వెయ్యి ఎకరాలకు పైగా ప్రభుత్వ ఆస్తులను రక్షించిందని చెప్పారు. ఈ ఏడాది సుమారు 2000 ఎకరాల ఆక్రమణలను తొలగించి రూ . లక్ష కోట్ల ఆస్తులను కాపాడాలని లక్ష్యంతో ఉన్నామన్నారు. తొలగించాలని లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. సింగరేణి మాజీ ఉద్యోగులు ఈ విధంగా హరిత చైతన్య కళాక్షేత్రం పేరుతో పర్యావరణహితానికి తోడ్పడడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఇదే సమావేశంలో పాల్గొన్న కేంద్ర పర్యావరణ అటవీ శాఖ అడ్వైజర్, సీనియర్ సైంటిస్ట్ తరుణ్ కత్తుల మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించేదిగా ఉంటే పరిశ్రమలకు గాని గనులు తవ్వడానికి గాని అనుమతులు ఇవ్వడం లేదన్నారు. తీవ్ర వాతావరణ కాలుష్యంతో బాధపడుతున్న విషయాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణకు తమ వంతు బాధ్యతగా ముందుకు కదలాలన్నారు.

రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో సీనియర్ సోషల్ సైంటిస్ట్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి జీవి పుట్టిన దగ్గరనుంచి మరణించే వరకు పర్యావరణానికి హాని కలిగించే విధంగానే వ్యవహరిస్తున్నారని ఈ ధోరణి మారాలని ముఖ్యంగా ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు చైతన్యవంతులు అవ్వాలని సీనియర్ సిటిజల్లు తమ మనవలకు బిడ్డలకు ఈ విషయంలో మార్గదర్శకంగా నిలవాలని ప్లాస్టిక్ వాడకాన్ని సమూలంగా నిర్మూలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ మాజీ డైరెక్టర్లు జేవీ దత్తాత్రేయులు, ఏ మనోహర్, ఎస్ చంద్రశేఖర్, జీవీ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. హరిత చైతన్య కళాక్షేత్ర వ్యవస్థాపకులు అధ్యక్షులు గణాశంకర్ పూజారి తమ సంస్థ ఉద్దేశాలను వివరిస్తూ పాటల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పర్యావరణ చైతన్యం తీసుకురావడం కోసం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం జరిగిన సంగీత విభావరి అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది.

# హైదరాబాద్‌లో రెండో రోజు ఎంజీఎన్‌రేగా బచావో సంగ్రామ్ యాత్ర

**బహదూర్‌పురా మార్గంలో పాదయాత్ర**




**హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వము మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం (ఎంజీఎన్‌రేగా)ను బలహీనపరుస్తోందని ఆరోపి స్తూ హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) చేపట్టిన ఎంజీఎన్‌రేగా బచావో సంగ్రామ్ యాత్ర రెండో రోజులోకి ప్రవేశించింది. ఆదివారం నిర్వహించిన యాత్ర గాంధీ విగ్రహం క్రాస్ రోడ్ నుంచి ప్రారంభమై బహదూర్‌పురా క్రాస్ రోడ్ వద్ద ముగిసింది. ఈ పాదయాత్ర దూద్‌వాలి గలి, చందూలాల్ బరాదరి, రాంనస్పురా, కిషన్‌బాగ్ డివిజన్ల గుండా కొనసా గింది. ఈ యాత్ర ఉపాధి హక్కు అనే రాజ్యాంగ హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేపట్టిన ఉద్యమంలో భాగం. ఎంజీఎన్‌రేగా పై కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మార్పులు గ్రామీణ ఉపాధి, వికేంద్రీకృత ప్రణాళిక మరియు న్యాయమైన వేతనాలను దెబ్బతీస్తాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. ఈ ర్యాలీలో బహదూర్‌పురా అసెంబ్లీ ఇన్‌చార్జ్ రాజేష్ కుమార్ పులిపాటి, చంద్రాయణగుట్ట ఇన్‌చార్జ్ బి. నాగేశ్, చార్మినార్ ఇన్‌చార్జ్ మొహమ్మద్ ముజీబుల్లా షరీఫ్, మలక్‌పేట్ ఇన్‌చార్జ్ షేక్ అక్బర్, యాకుత్‌పురా ఇన్‌చార్జ్ కె. రవిరాజ్‌తో పాటు ఉజ్మా షకీర్, జి. కన్నయ్యలాల్, సయ్యద్ షా ముజాహిద్ హుస్సైనీ, సయ్యద్ ఇక్బాల్, మీర్ మొహమ్మద్ అలీ, భాను చంద్ర యాదవ్, జ్యోతి శెట్టి, మొహమ్మద్ ఫయాజ్, కృష్ణ కుమార్ తదితర సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక పదాధి కారులు పాల్గొనగా, ప్రజల నుంచి ఉత్సాహభరితమైన స్పందన లభించింది.

యాత్రను నడిపిస్తున్న హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సయ్యద్ ఖాలిద్ సైఫుల్లా కాంగ్రెస్ పార్టీ వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. “ఎంజీఎన్‌రేగా పేద కుటుంబాలకు ఉపాధి హక్కును కల్పించింది. కానీ మోదీ ప్రభుత్వం ఇప్పుడు దీన్ని ఢిల్లీ నుంచి నియంత్రించే పథకంగా మార్చుతోంది. గ్రామ పంచాయతీల స్థానంలో కాంట్రాక్టర్లు వస్తున్నారు. కార్మికులు భద్రతను, గౌరవాన్ని కోల్పోతున్నారు,” అని ఆయన అన్నారు. సవరించిన విధానాల ద్వారా కేంద్ర ప్రభుత్వం వేతన భారం రాష్ట్రాలపై మోపుతోందని, పంచాయతీల ద్వారా జరిగే స్థానిక నిర్ణయ ప్రక్రియను దెబ్బతీస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. హైదరాబాద్‌లో ఈ యాత్ర జనవరి 26 వరకు బహదూర్‌పురా, చంద్రాయణగుట్ట, మలక్‌పేట్, చార్మినా ర్, యాకుత్‌పురా అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగుతుంది. ఈ ఉద్యమం ఎంజీఎన్‌రేగా పేరుతో జరుగుతున్న కేంద్రీకరణ మరియు పేదల వ్యతిరేక మార్పులపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ప్రతిఘటనను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. హామీ ఉపాధి, న్యాయమైన వేతనాలు, వికేంద్రీకృత పాలన పునరుద్ధరణ కోసం ఈ ఉద్యమంలో ప్రజలు, గడ్డిమట్ట స్థాయి కార్యకర్తలు భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే

# ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**రాయికల్‌లో మహిళా స్వశక్తి సంఘాలకు రూ.11.29 లక్షల వడ్డీ రాయితీ చెక్కులు**

**రూ.7.20 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**




**జగిత్యాల, జనవరి 24 (జనం సాక్షి) :** రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపల్ పరిధిలోని మహిళా స్వశక్తి సంఘాల సభ్యులకు శనివారం రూ.11,29,571 వడ్డీ రాయితీ చెక్కులు అందజేశారు. అదే సందర్భంగా రూ.7.20 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మహిళా సోదరీమణుల ఆశీర్వాదంతో ప్రజాపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలను ఆర్థికంగా, వ్యాపారపరంగా, సామాజికంగా ముందంజలో నిలబెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం తొలి సంతకంగా అమలు చేసిన ఈ ప్రభుత్వం మహిళలకు అన్ని రకాలుగా సహాయం అందిస్తోందని, ఇది ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యం, మహిళా అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, వడ్డీ లేని ఋణాలు, అద్దెకు బస్సులు, ఉచిత స్కూల్ యూనిఫామ్‌లు వంటి అనేక పథకాలు మహిళల పేరుతోనే అమలవుతున్నాయని వివరించారు. ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేసి త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

రాయికల్ మున్సిపల్ పరిధిలోని మహిళా సంఘాలకు రూ.11,29,571 వడ్డీ రాయితీ ఋణాలు అందజేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అదే సమయంలో రూ.7.20 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్, ఆర్‌డీఓ మధుసూదన్, మెప్మా ఏవో శ్రీనివాస్ గౌడ్, ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, మహిళా సంఘం సభ్యులు, వివిధ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# జీవన్ రెడ్డి మీద ఉన్న ప్రేమ బిజెపి కార్యకర్తలపై లేదా?

**ఎంపీ అరవింద్ ఒంటెద్దు పోకడలు మానుకోవాలి.**

**జగిత్యాల బ్యూరో జనవరి 24 (జనం సాక్షి) :** 40 ఏళ్ల పాటు కాంగ్రెస్ లో పని చేసిన జీవన్ రెడ్డిని కాంగ్రెస్ నాయకత్వం ఇబ్బంది పెట్టడం తనకు బాధ కలిగిస్తుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ వ్యాఖ్యానించడాన్ని జగిత్యాల బిజెపి సీనియర్ నేతలు తీవ్రంగా ఖండించారు. శనివారం బిజెపి సీనియర్ నేతలు సీపెల్లి రవీందర్, అంకార్ సుధాకర్, బాసెట్టి ప్రభాకర్, వెంకట్రాజం, రత్నాకర్ రెడ్డి, ఎర్ర శ్రీనివాస్,నవ్వోతు సురేష్, మహేందర్ తదితరులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడిగా పోటీచేసిన ధర్మపురి అరవింద్ గెలుపు కోసం ప్రాణాలకు తెగించి పనిచేసిన బిజెపి సీనియర్ కార్యకర్తలను పట్టించుకోకుండా ఇబ్బందులు పెడుతూ పరాయి పార్టీ నాయకుల పై ఎంపీ సానుభూతి ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు. రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా గెలుపొందిన ధర్మపురి అరవింద్ నిజామాబాద్ పార్లమెంటు పరిధిలోని జగిత్యాల జిల్లాలో పార్టీని ఎంతవరకు బలోపేతం చేశాడో చెప్పాలని నిలదీశారు. గత 40 సంవత్సరాలుగా పార్టీ సిద్ధాంతాన్ని నమ్ముకుని జగిత్యాలలో ప్రాణాలకు తెగించి పనిచేసిన అనేకమంది సీనియర్ నాయకులను, కార్యకర్తలను పార్టీకి దూరం చేసి ఎలాంటి ప్రజాదరణ లేని నాయకులను వెంటేసుకొని అడపాదడపా జగిత్యాలలో ప్రెస్ మీట్ పెట్టి వెళ్ళడమే తప్పా పార్టీ బలోపేతం కోసం అరవింద్ చేసిందేమీ లేదన్నారు. ఎంపిగా ఉన్న ధర్మపురి అరవింద్ గత మున్సిపల్ ఎన్నికల ప్రచారం కోసం ఒక్కసారి కూడా జగిత్యాలలో అడుగుపెట్టలేదని, కార్యకర్తలమంతా కృషిచేసి పట్టణంలో 13వేల పై చిలుకు ఓట్లను సాధించామని తెలిపారు. అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీచేసిన భోగ శ్రావణి కోసం ఎంపీ తో పాటు రాష్ట్ర నాయకత్వం, జాతీయ నాయకత్వం ప్రచారం నిర్వహించినప్పటికీ జగిత్యాల పట్టణంలో కేవలం 15 వేల ఓట్లు మాత్రమే వచ్చాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం పార్టీ కార్యకర్తలను పట్టించుకోకుండా బిజెపి ఇన్చార్జి భోగ శ్రావణి హైదరాబాదు కే పరిమితం కావడం, ఎంపీ అరవింద్ జగిత్యాలముఖం కూడా చూడకపోవడంతో కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కనీసం కార్యకర్తలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో గెలిచే అవకాశం ఉన్న సీనియర్ పార్టీ కార్యకర్తలను కాదని ప్రజాదరణ లేని తమ అనుయాయులకు బీ ఫాం లు కట్టపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జగిత్యాల మున్సిపాలిటీలో అన్ని క్షేత్రాలను సమన్వయపరిచి, గెలుపు గుర్రాలకే పార్టీ టికెట్లు ఇచ్చి నాయకులంతా కష్టపడితే కనీసం 15 కౌన్సిలర్ సీట్లు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికైనా ఎంపీ ధర్మపురి అరవింద్, మాజీ జిల్లా అధ్యక్షుడు మోర పెల్లి సత్యనారాయణ రావు, భోగ శ్రావణి లు తమ ఒంటెద్దు పోకడలను మానుకోవాలని లేనట్లయితే రాబోయే రోజుల్లో బిజెపి పార్టీ తీవ్రంగా నష్టపోతుందని హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం జగిత్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపి పార్టీని ప్రక్షాళన చేయాలని కోరారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం

- నా భారత దేశం - నా ఓటు అనే థీమ్ తో ఓటర్ దినోత్సవం
- ప్రతి ఓటరు తన ఓటింగ్ హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి
- జాతీయ ఓటరు దినోత్సవం వేడుకలో పాల్గొన్న పెద్దపల్లి ఆర్డిఓ బి.గంగయ్య



**పెద్దపల్లి,జనవరి 25(జనంసాక్షి) :** ప్రజాస్వామ్య దేశంలో ఓటు మనకు ఉన్న బలమైన ఆయుధమని, దీనిని ఎన్నికల సందర్భంగా పారదర్శకంగా వినియోగించు కొని మంచి పరిపాలన అందించే వారిని ఎన్నుకోవాలని పెద్దపల్లి ఆర్డిఓ బి.గంగయ్య అన్నారు.ఆదివారం పెద్దపల్లి ఆర్డిఓ బి.గంగయ్య సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటూ నిజాయితీగా నాయకులను ఎన్నుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు.పెద్దపల్లి ఆర్డిఓ బి.గంగయ్య మాట్లాడుతూ ఓటు ప్రాముఖ్యతను మరింత బలోపేతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా 2011 సంవత్సరం నుంచి జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, మన దేశంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరుగుతాయని , ఎన్నికల సమయంలో ఎలక్షన్ కమిషన్ పరిధిలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తారని,ఎవరు భయపడకుండా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు.2026వ సంవత్సరం నా భారత దేశం - నా ఓటు అనే థీమ్ తో ఓటరు దినోత్సవం జరుగుతుందని, మనమంతా ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని, మన సమస్యలను పరిష్కరించే నాయకులను ఎన్నుకోవాలని తెలిపారు. లిభారత దేశ భవిష్యత్తు ఖచ్చితంగా ఓటరు చేతిలో ఉంటుందని, ఎన్నికల సమయంలో సక్రమంగా ఓటు హక్కు వినియోగించు కోవాలని ఆర్డిఓ పిలుపునిచ్చారు.అనంతరం పెద్దపల్లి ఆర్డిఓ జిల్లాలో నూతనంగా ఓటు హక్కు పొందిన యువత ను ఓటరుగా నమోదు చేసుకున్నందుకు వారిని అభినందించి ఓటర్ కార్డులు అందజేశారు. సీనియర్ ఓటర్లను ఆర్డిఓ సన్మానించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ ప్రకాష్, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ల సాధికారతకు విధానస్పష్టత అవసరం

**ఖైరతాబాద్, జనవరి 25 (జనం సాక్షి) :** దేశంలో మారుతున్న గిగ్ ఎకానమీలో డ్రైవర్ యాజమా న్య, సబ్ స్క్రిప్షన్ ఆధారిత రైడ్ హైలింగ్ ప్లాట్ ఫామ్ ‘భారత్ ట్యాక్సీ’ ప్రారంభం కీలక మలుపుగా నిలిచిందని ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం నగ రంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. వారు మాట్లాడుతూ సంప్రదాయ అగ్రిగేటర్లకు ప్రత్యామ్నాయంగా ఉంటూ సహకార పద్ధతిలో, తక్కువ కమీషన్ తో ఈ ప్లాట్ ఫామ్ ముందుకొ చ్చిందని తెలిపారు. తద్వారా నగరాలు, పట్టణాల రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఆటో, క్యాబ్ డ్రైవర్లకు తమ ఆదాయంపై నియంత్రణ, గౌర వం తిరిగి ఇవ్వాలనే లక్ష్యంతో ఇది రూపు దిద్దు కుందని అన్నారు. ఈ ఆశాజనక మోడల్ విస్తరిస్తు న్న కొద్దీ ఒక మౌలిక విధాన ప్రశ్నత లెత్తుతోందని తెలిపారు. డ్రైవర్లకు బలం ఇచ్చే ఇలాంటి కొత్త ప్రయత్నాలకు మన పన్నుల వ్యవస్థ మద్దతిస్తుం దా? లేక తెలియకుండానే వాటిని దెబ్బతీస్తుందా? సబ్ స్క్రిప్షన్ ఆధారిత(ఎసీఏఎస్) రైడ్ హైలింగ్ మోడల్‌లో రైడ్ చార్జీలపై 5 శాతం జీఎస్టీ విధిం చాలన్న ప్రతిపాదన ఈ చర్చకు కేంద్ర బిందువు వినియోగ దారుల వద్ద తీసుకునే మొత్తంలో తమ కమీషన్ తగ్గించుకునే ప్లాట్ ఫామ్స్ లా కాకుండా ఎసీఎస్ మోడల్ వేరేగా పనిచేస్తుందని అన్నారు. డ్రైవర్లకు ప్రయాణికులను కనెక్ట్ చేసే టెక్నాలజీ కోసం వాళ్లు స్థిరంగా నిర్దేశిత కాలానికి సభ్యత్వ ఫీజు చెల్లిస్తారని తెలిపారు. అందువల్ల ప్రయాణి కులు చెల్లించే డబ్బులన్నీ నేరుగా డ్రైవర్ల చేతికే వెళ్తాయని అన్నారు. డబ్బు లావాదేవీలు ఆఫ్ లైన్ లోనే జరుగుతాయని పేర్కొన్నారు. ధరలను ప్లాట్ ఫామ్ నియంత్రించదని అన్నారు. చెల్లింపుల విష యంలో కూడా ప్లాట్ ఫామ్ కల్పించుకోదని తెలిపారు.



# మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో దూప దీప నైవేద్యం స్కీమ్ మంజూరు

**రామగిరి జనం సాక్షి:** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో శ్రీ కోదండ ఆలయంలో (దూప దీప నైవేద్యం) స్కీమ్ మంజూరు అయిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సహకారం తో ఈ స్కీం మంజూరు అయిందని, వారికి వారి కుటుంబ సభ్యులకి రత్నాపూర్ గ్రామం తరపున శ్రీ కోదండ రామాలయం ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు. శ్రీ కోదండ ఆలయంలో (దూప దీప నైవేద్యం) స్కీమ్ మంజూరు అయిన సందర్భంగా రత్నాపూర్ గ్రామ రామాలయం (ఆలయం) అర్చకులు కృష్ణమాచార్యులు రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రోడ్డ బాపు చేతుల మీదుగా స్కీమ్ మంజూరు పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో రత్నాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధర్మల వెంకటేష్, మాజీ సర్పంచ్ కెక్కర్ల శ్రీనివాస్ గౌడ్, వార్డ్ మెంబర్లు కలవేన రవి, కండె లక్ష్మీ - గట్టయ్య, కండె సాహితీ - పోశం, మాజీ వార్డ్ మెంబర్లు కొడారి సది, గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కొండు అంజన్న, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోశం, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు మట్ట రాజ్ కుమార్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మోత్కూరి అవినాష్ గౌడ్, మండల యువజన నాయకులు భోగే ప్రకాష్, మార్కొండ సంతోష్ గౌడ్, అబ్బ తిరుపతి పటేల్, కనవేన సదానందం, గుండా అవినాష్ పాల్గొన్నారు.

# కొండగట్టు ఆలయ ఈవోపై చర్యలు తీసుకోవాలి

- అర్చకుల గౌరవాన్ని కించపరిచారు
- చాత్తాద శ్రీవైష్ణవ సంఘం మాజీ అధ్యక్షుడు మారుతి స్వామి ఆగ్రహం



జగిత్యాల, జనవరి 25: జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో అర్చకులపై ఆలయ ఈవో దురుసుగా ప్రవర్తించడాన్ని చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు జానంపేట మారుతి స్వామి తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకట నలో అర్చకులకు పూర్తి మద్దతు, సంఘీభావం తెలిపారు. కొండగట్టు దేవస్థానం అర్చకుల గౌరవం, సంప్రదాయాలు, ఆలయ ఆచార వ్యవహారాలను కించపరిచేలా ఈవో వ్యవహరించడం బాధాకరమని మారుతి స్వామి పేర్కొన్నారు. దేవాలయ అర్చకులు భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకులుగా ఉండాల్సిన వారిని అవమానించడం సరికాదని, ఇది ఆలయ సంప్రదాయాలకు విరుద్ధమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆలయ ఈవోపై తగిన చర్యలు తీసుకోవాలని మారుతి స్వామి డిమాండ్ చేశారు. అర్చకుల గౌరవాన్ని కాపాడటమే కాకుండా, దేవాలయాల్లో అధికారులు సంప్రదాయాలకు గౌరవం ఇవ్వాలని, భక్తుల భావోద్వేగాలను గౌరవించాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కొండగట్టు ఆలయం జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భక్తులకు ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం. ఇక్కడ అర్చకులు సాంప్రదాయకంగా పూజలు, అర్చనలు నిర్వహిస్తుండగా, ఈవో వైఖరి వల్ల భక్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మారుతి స్వామి ప్రకటనతో ఈ విషయం మరింత చర్చనీయాంశంగా మారింది.

# ‘ఇండియన్ పోలీస్ మెడల్‘ పథకంను వరించిన బుర్ర ఎల్లయ్య గౌడ్ ఎస్ఐ

- వేములవాడ ఎస్ఐ బుర్ర ఎల్లయ్య గౌడ్‌కు కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 25 (జనంసాక్షి) :** వేములవాడ లో పని చేస్తున్న బుర్ర ఎల్లయ్య గౌడ్ ఎస్ఐకి ఆదివారం రోజు కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్ పథకం ప్రకటించారు. బుర్ర ఎల్లయ్య గౌడ్ చేసిన సేవలకుగాను కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్ పథకం ప్రకటించారు. బుర్ర ఎల్లయ్య గౌడ్ కరీంనగర్ జిల్లా లోని గన్నేరువరం గ్రామంలో గౌడ బిడ్డ గా జన్మించారు. ఇతను 1985లో కానిస్టేబుల్‌గా చేరి, 1991 లో హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ పొంది, 2001లో ఏ.ఎస్.ఐ.గా, 2013 లో ఎస్సైగా ప్రమోషన్ పొంది సేవా పథకము, మహోన్నత పథకము ఇండియన్ పోలీస్ మెడల్ పొందడం ఎంతో గర్వకారణంగా ఉంది. మెరిటేరియస్ ప్రశంసా పత్రాలు 150, క్యాష్ రివార్డ్స్ ఒక 40 జివిస్సి లు పొందినారు. వీరు 1992 సంవత్సరంలో ఒక ఆపరేషన్ లో పాల్గొనుటకు వెళ్లి బావిలో పడడం జరిగింది. దాంతోపాటు ముగ్గురు ప్రాణాలతో బయటపడగా ఒక కానిస్టేబుల్ చనిపోవడం జరిగింది. తీవ్రవాదుల ఏరివేతలో ఎంతో చాకచక్యంగా పనిచేసే అధికారుల మన్నలను పొంది, మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించి, డిపార్ట్మెంట్ కు ఎనలేని సేవలు చేసి పేద ప్రజలకు నేనున్నానని గర్వంగా చెప్పుతూ ఎన్నో మంచి కార్యక్రమాలు చేసి బీద ప్రజలను వృత్తి రీత్యా ఆదుకున్నారు. ప్రజలందరితో మంచి స్వభావంతో కలిగి అందరి మన్నలను పొందినారు. బుర్ర ఎల్లయ్య గౌడ్ ఆదివారం రోజు ఇండియన్ పోలీస్ మెడలు పొందడం గౌడ జాతికే గర్వకారణం, బుర్ర ఎల్లయ్య గౌడ్ 2026 జూన్ 26 రిటైర్మెంట్ కు ఉన్నారు. ఇట్టి పథకం పొందినందున తన ఆత్మీయులు బుచ్చి రాముడు గౌడ్, నాగయ్య గౌడ్, రాజమౌళి గౌడ్, తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్, ఆడరేవుల ప్రెసిడెంట్, రిటైర్డ్ అదనపు ఎస్పీ తాళ్లపల్లి సుదర్శన్ గౌడ్, విద్యాసాగర్ గౌడ్, అడిషనల్ ఎస్పీ మహేష్ గౌడ్, డి.ఎస్.పి నాగేందర్ గౌడ్, డిఎస్పి లక్ష్మణ్ బాబు, సిఐ చంద్రశేఖర్ గౌడ్, సిఐ ముత్తిలింగయ్య, సిఐ సిహెచ్ మల్లయ్య, చాలా మంది అధికారులు హార్దిక శుభాభినందనలు తెలిపారు.



# కిస్మత్‌పూర్‌లో 130వ మన్ కీ బాత్ వీక్షణ

**రాజేంద్రనగర్, జనవరి 25 (జనంసాక్షి) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ‘మన్ కీ బాత్’ 130వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని కిస్మత్‌పూర్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు భీమార్జున్ రెడ్డి నివాసంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ , బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. వీరేందర్ గౌడ్ ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్ పాల్గొన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవం రోజున భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని గుర్తు చేస్తూ, రాజ్యాంగ నిర్మాతల త్యాగాలను స్మరించుకునేందుకు ఆ రోజు గొప్ప అవకాశమని పేర్కొన్నారు. అలాగే జనవరి 25 జాతీయ ఓటరు దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్ ముదిరాజ్ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ బీజేపీ అధ్యక్షులు మహేష్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, నాగభూషం, నరేష్, మహాలింగం, పవన్ సాయి, సాయి రెడ్డి, ప్రవీణ్ గౌడ్, గంగని అరుణ్, లక్ష్మణ్ ముదిరాజ్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేస్తాం

- హుస్నాబాద్ ను అభివృద్ధిని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉంచుతాం
- 10 ఏళ్లలో చేయలేని హుస్నాబాద్ అభివృద్ధి రెండేళ్లలో చేసి చూపించాం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- 26 కోట్ల రూపాయలతో హుస్నాబాద్ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



**హుస్నాబాద్ (జనంసాక్షి) :** గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. దాదాపు 26 కోట్ల రూపాయల తో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో గత 10 సంవత్సరాలుగా చేయని అభివృద్ధి రెండు సంవత్సరాల్లో చేసి చూపించమని మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసేలా కాంగ్రెస్ పార్టీనీ ఆశీర్వదించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్‌కు రెండేళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వెల్లడించారు. హుస్నాబాద్ అంటే వెంటనే స్పందించేలా రాష్ట్రంలో మంచి గుర్తింపు తీసుకొచ్చానని ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలతోపాటు గతంలో జరిగిన పార్లమెంట్ ,ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇచ్చిన మద్దతు తాజాగా జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ఉండాలని కోరారు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి హుస్నాబాద్ సస్య శ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ – కరీంనగర్, హుస్నాబాద్ – అక్కన్నపేట మధ్య నాలుగు లైన్ ల రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం చేస్తున్నామని ఇక్కడి ప్రజలకు 24 గంటలు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉండేలా 250 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని ,పీజీ కాలేజీ రావడంతో పాటు ఇక్కడే సూపర్ స్పెషాలిటీ డాక్టర్స్ ఉండనున్నారని పేర్కొన్నారు. త్వరలోనే చౌటపల్లి వద్ద ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ వస్తుందని తెలిపారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఈరోజు కొత్త చెరువు 7.79 కోట్లు ,పల్లె చెరువు ,ఎల్లమ్మ చెరువు కాలువల పునరుద్ధరణకు మరో 3 కోట్లు రూపాయలతో శంకుస్థాపన చేసుకున్నామని పేర్కొన్నారు. అంతకుముందు హుస్నాబాద్ మార్కెట్ యార్డు లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గత వర్షాకాలంలో హుస్నాబాద్ లో 32 సెంటీమీటర్ల వర్షం పడితే డ్రైనేజీ సమస్య వచ్చిందనీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. హుస్నాబాద్ లో తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆరు ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధి చేసుకున్నామని భీమదేవరపల్లి లో నవోదయ పాఠశాల తీసుకొస్తామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ ను కరీంనగర్ లో కలుపుతామని అప్పటి పీసీసీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, కచ్చితంగా హుస్నాబాద్ ను కరీంనగర్ జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి 20 ఎకరాల స్థలం త్వరలో కేటాయిస్తామని దానికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఇక్కడ స్టేడియం నిర్మిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హుస్నాబాద్ ప్రాంతంలో కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎలుకతుర్తి ఎమ్మార్వో కార్యాలయాన్ని ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని , కోహెడ లో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

# విలువలతో కూడిన అభివృద్ధే నిజమైన ప్రగతి

- చిన్మయ మిషన్ అమృత మహోత్సవంలో డిప్యూటీ సీఎం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** చిన్మయ మిషన్ సమాజానికి అందిస్తున్న ఆధ్యాత్మిక, విద్యా సేవలు నేటి కాలానికి ఎంతో అవసరమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన చిన్మయ మిషన్ 75వ వార్షికోత్సవం (అమృత మహోత్సవం) కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 75 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం కేవలం కాల పరిమాణం మాత్రమే కాదని, కాలాతీతమైన విలువలతో సమాజ అవసరాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్న సంస్థగా చిన్మయ మిషన్ నిలిచిందని పేర్కొన్నారు. ఇదే ఒక జీవంత సంప్రదాయానికి నిదర్శనమన్నారు. పూజ్య గురుదేవ్ స్వామి చిన్మయానంద గారి బోధనలు నేటికీ అత్యంత అవసరమని తెలిపారు. ఆధ్యాత్మికత అంటే ప్రపంచం నుంచి దూరంగా ఉండడం కాదని, బాధ్యతతో సమాజంలో భాగస్వామిగా నిలవడమేనని గురుదేవ్ బోధించారని గుర్తు చేశారు. నేటి కాలంలో సాంకేతిక, భౌతిక అభివృద్ధి వేగంగా జరుగుతున్నప్పటికీ, ఒత్తిడి, అసమానతలు, సామాజిక అంతరాలు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విలువలు లేని అభివృద్ధి అసంపూర్ణమని కరుణ లేని వృద్ధి నిలకడగా ఉండదని ఆయన స్పష్టం చేశారు. అందుకే చిన్మయ మిషన్ వంటి సంస్థల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. భగవద్గీత స్వార్థరహిత కర్మ, నైతిక నాయకత్వం, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని బోధిస్తుందని చెప్పారు. ఇవే నేటి పాలనకు కూడా మార్గదర్శక సూత్రాలని పేర్కొన్నారు. బాలవిహార్, యువత కార్యక్రమాలు, అధ్యయన వర్గాల ద్వారా చిన్మయ మిషన్ విలువలతో కూడిన పౌరులను తయారు చేస్తోందని డిప్యూటీ సీఎం ప్రశంసించారు. రేపటి వైద్యులు, ఇంజినీర్లు, అధికారులు నైతిక విలువలతో ఎదగడానికి ఇది దోహదపడుతోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇదే దృక్పథంతో పాలన సాగిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి పౌరుడు ఆత్మగౌరవంతో జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రత, రైతులు, కార్మికులు, మహిళలు, పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇది దానం కాదని, రాజ్యాంగబద్ధమైన బాధ్యతగా ప్రభుత్వం భావిస్తోందని ఆయన స్పష్టం చేశారు. "గీతా పంచామృతం" వంటి కార్యక్రమాలు ప్రజలకు సులభంగా గీత బోధనలను అర్థమయ్యేలా చేస్తున్నాయని ప్రశంసించారు. హైదరాబాద్ ఎప్పుడూ భిన్న సంస్కృతులు, భాషలు, మతాల మధ్య సమరస్యానికి ప్రతీకగా నిలిచిందని, ఆ సంప్రదాయాన్ని చిన్మయ మిషన్ హైదరాబాద్ మరింత బలపరుస్తోందని అన్నారు. పాలన అనేది కేవలం ఫైళ్లు మాత్రమే కాదని, ప్రజల విశ్వాసమే ముఖ్యమని ఆయన తెలిపారు. ఆ విశ్వాసాన్ని పెంచడంలో ఆధ్యాత్మిక సంస్థలు మౌన భాగస్వాములుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. చివరగా చిన్మయ మిషన్ 75 ఏళ్ల ప్రస్థానానికి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా సమాజానికి మార్గదర్శకంగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# తెలంగాణ ఉద్యమ తొలి నవల 'విప్లవయోధులు'



- ఆవిష్కరణ సభలో ప్రశంసలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రవీంద్రభారతి సమావేశ మందిరంలో 1953లో ఎమ్.ఆర్.నాగం అనే రచయిత రచించిన 'తెలంగాణ విప్లవ యోధులు' అనే నవలను తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఆవిష్కర్త మాట్లాడుతూ తెలంగాణ సాహిత్య చరిత్రను పునస్సమీక్ష చేయించాల్సిన అవసరాన్ని 'విప్లవ యోధులు' అనే ఈ నవల ముందుకు తెచ్చిందన్నారు. ఈ సభకు తెలంగాణ ప్రముఖ రచయిత, తెలంగాణ తొలి బీసి కమీషన్ చైర్మన్ బిఎస్ రాములు అధ్యక్షత వహించి అధ్యక్ష తొలి పలుకులలో ఇది విద్యార్థులకు పాఠ్య పుస్తకంగా చేర్చాల్సినదని, ఉపవాచకంగా పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి తొలికాపీని రచయిత సతీమణి నాగం సుశీలమ్మ (90)కు అందించారు. ఈ నవలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించిన చరిత్ర పరిశోధకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నవల పై ఒక సెమినార్ నిర్వహించాలన్నారు. నల్గొండ కవి సీనియర్ కవి డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి తమ ఉపన్యాసంలో ఈ నవలలో చారిత్రక అంశాలెన్నో చర్చించాల్సి వున్నదన్నారు. నవల కాపీని భద్రపరిచి కుటుంబ సభ్యులకు అందించిన హెచ్ రమేష్ బాబు ఈ అవకాశం దొరకడం తమకు దక్కిన గౌరవం అన్నారు. విజయ కుమార్. జి, తెలంగాణ అకాడమీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నామోజు బాలా చారి గారు తర్వాత ముద్రణ బాధ్యత తెలంగాణ అకాడమీ తీసుకుంటుందన్నారు. బహుళ పత్రిక సంపాదకులు జ్వలిత సాహితీ కొరులు తమ కుటుంబంలో సాహితీ వారసులను ఏర్పరుచుకోవలని, లేనట్లయితే తమ రచనలను భద్రత పరిచే వారుండరని, నవలా రచయిత తనయ ఈ నవలను పునర్ముద్రించి ఆవిష్కరణ సభ నిర్వహించడం ఒక చారిత్రక సంఘటన అన్నారు. ఈ సభలో రచయిత్రులు సుజాత శేఖర్, బండారు విజయ, పైడిమర్రి గిరిజ, నాగం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. 'తెలంగాణ విప్లవ యోధులు' నవలను పునర్ముద్రణకు పూనుకున్న నవలా రచయిత కుమార్తె సుమతి చురుకంటిని అందరూ ప్రశంసించారు.

# కేటీఆర్, సంతోష్ రావుల బినామీ పోచంపల్లి

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- గత ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించాడు



**స్టేషన్ ఘన్ పూర్, జనవరి 25 (జనంసాక్షి) :** కేటీఆర్, సంతోష్ రావుల బినామీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అని ,ఇక్కడ ఉన్నోడే పెద్ద గజ దొంగ ఇప్పుడు ఆ గజ దొంగకు తోడు మరో ముగ్గురు స్టువర్టుపురం దొంగలు వచ్చారని, ఈ దొంగలతో జరజాగ్రత్తగాఉండాలని మాజీఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ప్రజలకు సూచించారు. స్టేషన్ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ నిన్న కొంత మంది బిఆర్ఎస్ నాయకులు స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో ఒకసమావేశం ఏర్పా టు చేసి ఈ నియోజకవర్గంలో కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఏమాత్రంఅభివృద్ధి జరగలేదని, ఈనాడు ఇక్కడ నిర్మాణం అవుతు న్న 100పడకల హాస్పిటల్ గాని, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ గాని, ఘనపూర్ మున్సిపాలిటీ కావడానికి మేమే కారణం అన్న రీతిలో ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వారు మాట్లాడడం జరిగిందని అన్నారు. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలన్నింటిని ప్రభుత్వ ఉత్తర్వులతో సహా మీడియా ద్వారా నియోజకవర్గ ప్రజల ముందు పెట్టడం జరిగిందని తెలిపారు.అన్ని తెలిసి కూడా గత ప్రభుత్వంలో ఈ నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురైందని తెలిసి కూడా గతంలో ఉన్న ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి మరిచిపోయి జల్సాలకు అలవాటు పడి ఈ నియోజకవర్గానికి చెడ్డ పేరు తెచ్చినవిషయంఅందరికీ తెలిసిందేనని అన్నారు. ఇక్కడ ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 100 పడకల అస్పత్రి గాని, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ గాని, ప్రస్తుతం నడుస్తున్న డిగ్రీ కాలేజ్ గాని, నిర్మాణం లో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ గాని, స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కావడం కానీ, దానికి 50 కోట్ల అభివృద్ధి నిధులు మంజూ రు కావడంకానీ నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వా తనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంఏర్పడిన తర్వా త మాత్రమే మంజూరు అయ్యాయని వెల్లడించా రు. ఘనపూర్ నియోజకవర్గానికి గతంలో ఉన్న ఎమ్మెల్యే వలన ఏ రకంగా నష్టం జరిగిందో ఏ రకంగా చెడ్డ పేరు వచ్చిందో అందరికి తెలుసని అన్నారు. ప్రతిదీ కూడా అవినీతిమయం చేసి, తన చిల్లర పనుల ద్వారా ప్రజలు తలదించుకునే పరిస్థితులు తీసుకొచ్చారని ఆరోపించారు. 2023 లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికలలో ఆయనకు టికెట్ రాకపోవడానికి, రాజయ్యకి టికెట్ ఇస్తే మనం గెలవమని కేసీఆర్ కి చెప్పింది అప్పటి మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఈ ముగ్గురేనని తెలిపారు. కేసిఆర్ దగ్గర కేటీఆర్ దగ్గర రాజయ్యకు వ్యతిరేకంగా చెప్పి ఈయనను ప్రజలే తిరస్కరిస్తున్నారు అని చెప్పిన ఈ ముగ్గురే ఇప్పుడు ఇక్కడ ఇంచార్జ్ లు గా వేసుకున్నారని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ లో రాజయ్యనుడమ్మీచేసి ఒకరేమో బీజేపీ నాయ కున్నితీసుకురావాలని, మరొకరేమో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను తీసుకురావాలని, ఇంకొకరేమో కాంగ్రెస్ నాయకులనుతీసుకురావాలని ప్రయత్నా లు చేస్తున్నారని ఇది రాజయ్యకు అర్థం కావడం లేదని విమర్శించారు. ఎర్రబెల్లి దయాకర్ రావు మనవరాలు వయసు ఉన్న అమ్మాయి చేతిలో ఓడిపోయేసరికి చిన్న మెదడు చితికిపోయి మతి భ్రమించి సభ్యత సంస్కారం లేకుండా మాట్లాడు తున్నాడని ఏద్దేవా చేశారు. టిడిపిని హోల్ సేల్‌గా కేసీఆర్ కు అమ్మిన నీచపు చరిత్ర నీదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారలోకి రాగానే కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళడానికి ప్రయత్నాలు చేశావ్ కానీ నీ నీచచరిత్ర రేవంత్ రెడ్డి నిన్ను రానివ్వలేద ని అన్నారు.మనం మాట్లాడే సభ్యతనుబట్టే ఎదు టివారి సంస్కారంఉంటుందని హితవు పలికారు. కేసీఆర్ చుట్టూ బొచ్చు కుక్కలా తిరిగిన పల్లా రాజేశ్వర్ రెడ్డి కేసీఆర్ పేరుచెప్పుకొని వందలకోట్ల ఆస్తులు సంపాదించుకున్నాడని ఆరోపించారు. కవిత కేసీఆర్ చుట్టూ కొరివిదయ్యాలు ఉన్నాయ ని చెప్పినట్టు అందులో పెద్ద కొరివి దయ్యం పల్లా రాజేశ్వర్ రెడ్డి అని అన్నారు. కేసీఆర్ పక్కనే ఉంటూ కేసీఆర్ కుటుంబంలో చిచ్చు పెట్టడాని, పల్లా రాజేశ్వర్ రెడ్డే కేసీఆర్ కుటుంబాన్ని నాశనం చేశాడని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని పొట్టోడు అంటున్నారుకానీ అసలైన పొట్టో డు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నే అని విమర్శించారు. కేటీఆర్, సంతోష్ రావుల బినామీ పోచంపల్లి అన అన్నారు. కేటీఆర్, సంతోష్ రావు సంపాదిం చిన డబ్బులని ఈయన ద్వారా రియల్ ఎస్టేట్లో ఖర్చు పెడుతున్నారని తెలిపారు. ఎట్టి పరిస్థితు ల్లో స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో గెలిచేందు కు ఎన్ని డబ్బులు ఖర్చు చేయడానికైనా సిద్ధంగా ఉన్నారని అన్నారు. అందుకే ఈ ముగ్గురు ఇంచార్జ్ లుగా వచ్చారని అన్నారు.ఈ సమావేశం లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి, బెలిదే వెంకన్న, నీల గట్టయ్య, పోగుల సారంగపాణి, నియోజకవర్గ ప్రజా ప్రతి నిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు ఆదరించిన వారికే మున్సిపల్ టికెట్


- ఆర్మూర్,భీంగల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం.
- సన్నాహక సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.





**ఆర్మూర్, జనవరి 25 (జనంసాక్షి):** ప్రజలతో సత్సంబంధాలు ఉండి, ప్రజలు ఆదరించిన వారికే కాంగ్రెస్ మున్సిపాలిటీ కౌన్సిలర్ అభ్యర్థిగా టికెట్టు దక్కుతుందని,మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యమని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పౌరసరఫరాలు,నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.ఆర్మూర్ పట్టణంలోని క్లాసిక్ ఫంక్షన్ హాల్లో ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల నుండి కాంగ్రెస్ నాయకులతో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు.ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి,ఎమ్మెల్సీ వెంకట్, కార్పొరేషన్ చైర్మన్లు మానాల మోహన్ రెడ్డి,అన్వేష్ రెడ్డి,ఈరావత్రి అనిల్,మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి, డిసిసి అధ్యక్షుడు నాగేష్ రెడ్డి,ఆర్మూర్,బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జిలు ముత్యాల సునీల్ రెడ్డి, ప్రొద్దుటూరు వినయ్ రెడ్డి అతిథులుగా హాజరైనారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్మూర్ మున్సిపాలిటీలో 36 వార్డులు,భీంగల్ మున్సిపాలిటీలో 12 వార్డులు గెలుస్తామన్న ధీమా వ్యక్తం చేశారు.మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ కొన్ని రోజుల్లోనే రానుందని చెప్పారు. కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను అప్రమత్తం చేసి, గెలుపు బాటలు వేసేందుకే సన్నాక సమావేశం ఏర్పాటు చేశామన్నారు.బిఆర్ఎస్ పార్టీ పదేళ్లలో చేయని అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ రెండేళ్లలో అభివృద్ధి,సంక్షేమ పాలన దిశగా దేశంలో ఎక్కడ లేని విధంగా సుభిక్షమైన పాలన అందిస్తుందన్నారు. బిఆర్ఎస్ పార్టీది ముగిసిన అధ్యయనమంటూ మాట్లాడారు.ప్రజలు ఆదరించే అసలైన నాయకుడికి మున్సిపల్ టికెట్టు ఇంటికే వస్తుందంటూ వాక్యానించారు. కాంగ్రెస్ పాలనలో పేదలకు సన్న బియ్యం,రేషన్ కార్డులు,రైతు బీమా, రైతు భరోసా,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణలే కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకు గా మారుతాయని చెప్పారు.జిల్లాకు సంబంధించిన కాంగ్రెస్ సీనియర్ లీడర్లు భాగస్వామ్యంగా ఉండి కౌన్సిలర్లను గెలిపించే బాధ్యత వహించాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు,సర్పంచులు,నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370